

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 10-6-2024 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 55 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం, తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె. ఉ. 6.28; దుర్ముహూర్తం: మ. 12.40-1.32, మ. 3.16-4.09; అమృతఘడియలు: మ. 2.54-4.36; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఐఐటి జగతిపై చెరిగిపోని సంతకం...
మేధోప్రపంచంలో తిరుగులేని దిగ్గజం...నారాయణ

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో 100 లోపు ఆల్ కేటగిరీ ర్యాంకులు,

AIR	Name	HT. No.
24	KUNCHAM SHIVA	246121222
25	VIVEK NAGELLI	246157867
27	BADRINADH VARMA B	246014058
27	ARJAV JAIN	242002218 (DLP)
28	SHEKHAR JHA	242031290 (DLP)
31	SUSHANTH P	246149232
31	ISHAN GUPTA	242014288 (DLP)
33	SPARSH GUPTA	247019253 (DLP)
34	POLISETTY RITISH BALAJI	246161257
35	SARVAJITH KOLANU	246138129
36	AARUSH C	241050053
37	REVANTH ESWAR D	245014025
40	HARIPREETH P.S	246130165
40	ARNAV BARANWAL	242052079 (DLP)
42	SIDDHARTHI VIVEKANAND	246047026
44	SHRIJANI KOREPAKA	246183040
45	DHANUSH SANJAY N	246011188
49	BODIGEPALLY ARNAV B	246166124
49	AVADH HINDOCHA	241021073 (DLP)
50	DEV RAJ DAS	242103211
51	B CHARAN	246161542
51	RISHI GOUTHAM B	246153398
54	SAI TEJESH D	248056017
59	RISHIVARDHAN MAJJI	245014078
63	HUNDEKAR VIDITH	246163469
66	MRIGANK GOEL	241007021 (DLP)
69	SATYAM RAKESH SHARMA	241153239
69	VARUN SAI POTHULA	246158603
70	SRI SURYA VARMA D	246124096
72	B VENKATA SAKETH	246150205
73	MAHATHI REDDY CH	246049273
74	BHARATH KUMAR B	245010213
74	HIMANSHU THALOR	242050438 (DLP)
75	HEMANTH ALLU	245008033
76	EPPA LAXMI NARASIMHA	246154128
77	REVANTH SAI P	245010574
77	MD EMAAD ARIF	242054030 (DLP)
78	E SAI SHERVAN	246120066
81	SRINANDAN M	246162431
81	SAMNAVDEEP K	245010372
82	AMBAR GOGIA	2422014235 (DLP)
85	P SAI SINDHUSH	246121033
85	BIBASWAN BISWAS	245058146 (DLP)
87	MORA. ADARSH	246161228
87	V V AKASH REDDY	246053404
87	DEVANSH GATTANI	241113047 (DLP)
88	SATEESH KUMARCHINTU	245007385
89	JAIVEER SINGH	242081031 (DLP)
90	KRISHIV GOYAL	241101225
91	AMAR SINHA	242057008 (DLP)
94	NV SRI HARSHA	246037052
94	N NIRMALKUMAR	241110162 (DLP)
99	TANAY KAKLIYA	242057318 (DLP)

అడ్మిషన్ల కొరకు మీకు దగ్గరలోని బ్రాంచీలను సంప్రదించండి



JEE ADV. Repeater Batch starts from 15th June 2024

Trust Narayana to fulfil your NEET dreams, as #YourDreamsAreOurDreams

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice

Scan QR For Admissions

SRAMAYEVA JAYATHE

NARAYANA EDUCATIONAL INSTITUTIONS

Trust Narayana to fulfil your NEET dreams, as #YourDreamsAreOurDreams

Toll Free: 1800 102 3344 | SUBSCRIBE /TheNarayanaGroup | www.narayanagroup.com

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 10-6-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**



భారత్ జయహో

టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌పై విజయం

119 పరుగులే చేసినా ప్రత్యర్థిపై పైచేయి

113 పరుగులకే దాయాది జట్టు కట్టడి 4

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా (3/14)

హ్యాట్రిక్ ప్రమాణం

ప్రధానిగా మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం.. నెహ్రూ రికార్డు సమం

- రాష్ట్రపతిభవన్‌లో వైభవంగా కార్యక్రమం
- మోదీతోపాటు 72 మంది ప్రమాణం
- 30 మంది క్యాబినెట్, ఐదుగురు స్వతంత్ర హోదా, 36 మంది 'సహాయ'
- మిత్రపక్షాలకు 11 పదవులు
- ఏపీ నుంచి రామ్మోహన్, తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డికి క్యాబినెట్ హోదా
- సహాయ మంత్రులుగా పెమ్మసాని, శ్రీనివాస వర్మ, బండి సంజయ్
- రాజ్‌నాథ్, షా, నిర్మల తదితరులకు మళ్లీ
- యూపీ, బిహార్‌లకు అధిక ప్రాధాన్యం
- ఒక్కో రాష్ట్రం నుంచి 9 మందికి
- **ఏడుగురు మహిళలకు చాన్స్**
- బీసీ 27, ఎస్సీ 10, ఎస్టీ 5, మైనారిటీ 5
- గత మంత్రివర్గంలోని 37 మందికి నో
- 33 మందికి తొలిసారి అవకాశం
- హాజరైన పొరుగుదేశాల అధినేతలు
- విపక్షం నుంచి ఖర్గే హాజరు



ఆదివారం మోదీతో మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి భవన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం వేలాది మంది ఆహూతులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు, పొరుగు దేశాల అధినేతల సమక్షంలో 73 ఏళ్ల నరేంద్రమోదీ భారతదేశ ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి ప్రమాణాన్ని స్వీకరించారు. తద్వారా దేశ చరిత్రలో ఇప్పటి వరకూ మాజీ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూకు మాత్రమే సాధ్యమైన రికార్డును సమం చేశారు. మోదీ ప్రమాణ స్వీకారోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దేశంలోని పలువురు

మిగతా 5వ పేజీలో...

అణకువగా ఉండండి

తోటి సభ్యులను గౌరవించండి

కొత్త క్యాబినెట్‌కు మోదీ సూచన

డాక్టర్ నుంచి కేంద్ర మంత్రిగా...

ఎన్నారై పెమ్మసాని చంద్రశేఖర్‌కు

గెలిచిన తొలిసారే జాక్‌పాట్

సామాన్య కార్యకర్తకు పట్టం

అనూహ్యంగా కేంద్ర మంత్రి పదవి

దక్కించుకున్న శ్రీనివాసవర్మ

కిషన్‌రెడ్డికి మళ్లీ కిరీటం

మూడు దశాబ్దాలుగా పార్టీకి సేవలు

పోరాటానికి దక్కిన ఫలితం

కార్పొరేటర్ స్థాయి నుంచి..

కేంద్ర మంత్రిగా సంజయ్

5 6



రామ్మోహన్

ఎర్రన్న వారసుడిగా!

తండ్రి అడుగుజాడల్లోనే రామ్మోహన్

శ్రీకాకుళం ఎంపీగా హ్యాట్రిక్

36 ఏళ్లకే.. మోదీ క్యాబినెట్‌లో



పెమ్మసాని



శ్రీనివాసవర్మ



కిషన్‌రెడ్డి



సంజయ్





రామోజీ రావు అంతిమయాత్రలో పాడె మోస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు. (ఇన్‌సెట్) అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమారుడు కిరణ్

అశ్రునయనాలతో..

రామోజీరావు అంత్యక్రియలు పూర్తి

- ఫిల్మ్‌సిటీలోని స్మృతివనంలో అంతిమ సంస్కారాలు
- అధికారిక లాంఛనాలతో నిర్వహించిన ప్రభుత్వం
- రామోజీ పాడె మోసిన టీడీపీ అధినేత చంద్రబాబు
- అంతిమయాత్రలో రాజకీయ, సినీ ప్రముఖులు
- కన్నీటితో వీడ్కోలు పలికిన కుటుంబసభ్యులు

హైదరాబాద్ సిటీ, అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బంధుమిత్రుల అశ్రునయనాలు.. ప్రముఖులు, సన్నిహితుల నివాళుల నడుమ.. రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీ రావు అంత్యక్రియలు ముగిశాయి. ఫిలింసిటీలోని విశాలమైన ప్రాంతంలో రామోజీరావు ముందుగానే నిర్మాణం చేయించుకున్న స్మృతివనంలో ఆదివారం తెలంగాణ ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పోలీసులు గౌరవ సూచకంగా గాల్లోకి 3 రౌండ్లు కాల్పులు జరిపారు. రామోజీరావు చితికి పెద్ద కుమారుడు, ఈనాడు ఎండీ కిరణ్

మిగతా 7వ పేజీలో...

బరిలోకి బాబు!

వ్యవస్థలను చక్కదిద్దే పనిలో నిమగ్నం

- ప్రమాణస్వీకారానికి ముందే గాడిలో పెట్టే చర్యలు
- రోజుల వ్యవధిలోనే మార్పు చూపే యత్నం
- అమరావతి ప్రాంతంలో సీఎస్ సుడిగాలి పర్యటన
- 200 పొక్లయిన్లతో జంగిల్ క్లియరెన్స్
- రాష్ట్రవ్యాప్తంగా వీధిదీపాల వెలుగులకు ఆదేశం
- పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సూచన
- సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు
- సురక్షిత తాగునీటి సరఫరాకు నిర్దేశం
- జగన్‌తో అంటకాగిన అధికారులకు ఉద్వాసన
- కీలక ఫైళ్లు మాయం కాకుండా అప్రమత్తం
- ఫైబర్‌నెట్, ఏపీఎండీసీ, బేవరేజెస్ ఆఫీసులు సీజ్
- బాధ్యతలు చేపట్టగానే వివిధ శాఖలపై సీఎం సమీక్ష!



ఆదివారం రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించిన సీఎస్ నీరబ్ కుమార్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ సర్కారు గత ఐదేళ్లలో అతలాకుతలం చేసిన ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ చక్కదిద్దేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు అప్పుడే రంగంలోకి దిగిపోయారు. ఈ నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు తర్వాత భారీ మెజారిటీతో టీడీపీ కూటమి గెలుపొందింది. తొలుత 9వ తేదీన సీఎంగా ప్రమాణం చేయాలని ఆయన భావించారు. అయితే ప్రధాని మోదీ అదే రోజు బాధ్యతలు చేపడుతుండడం.. ఎన్డీయేలో టీడీపీ ఇప్పుడు కీలకంగా మారిన

మిగతా 7వ పేజీలో...

'ఫైర్'లో భారతి పనిమనుషులు!



- జగన్ సతీమణి సిఫారసులతో అగ్నిమాపక శాఖలో హోంగార్డు ఉద్యోగాలు
- అవినాశ్ లేఖ, సజ్జల ఫోన్‌తో కూడా
- ఫిట్‌నెస్ చూడరు.. అర్హత చూడరు
- సిఫారసు ఉంటే చాలన్నట్టు వ్యవహారం
- మూడు నెలల్లో 60 మంది నియామకం
- స్వామిభక్తి చాటుకున్న డీజీ సునీల్
- అర్హులైన నిరుద్యోగులకు ఎసరు

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ సతీమణి భారతి ఇంట్లో పనిమనుషులకు కీలకమైన అగ్నిమాపక శాఖలో ఉద్యోగాలు ఇచ్చిన వ్యవహారం వెలుగు చూసింది. కేవలం సిఫారసు లేఖలు తీసుకుని.. దాదాపు 60 మందికి కొలువులు ఇచ్చినట్టు తెలిసింది. వైసీపీ హయాంలో ముఖ్య నేతల సిఫారసులతో ఎలాంటి చదువు, ఎత్తు, ఇతరత్రా అర్హతలు లేకుండానే ఉద్యోగాలు ఇచ్చేశారు. గత మూడు నెలలుగా అగ్నిమాపక శాఖలో ఇదే జరిగినట్టు తెలిసింది. జగన్ సతీమణి భారతి పేరే కాదు.. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి సిఫారసు లేఖ ఉన్నా సరే ఉద్యోగం ఇచ్చేశారు. మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి ఫోను చేశారంటే కాదనే ప్రసక్తేలేదు. ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలో అయినా సెక్యూరిటీ గార్డుకు

మిగతా 7వ పేజీలో...




3వ ర్యాంక్ సాధించిన కర్నూలు విద్యార్థి సందేశ్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

తెలుగు విద్యార్థుల 'జై' ఈఈ!

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మనోళ్ల సత్తా

- టాప్‌టెన్‌లో 3 ర్యాంకులు తెలంగాణకే
- మరో ర్యాంకు ఏపీ విద్యార్థి కైవసం 3
- తొలి 100 ర్యాంకుల్లో 26 తెలుగు రాష్ట్రాలకే
- 16 మంది తెలంగాణ.. 10 మంది ఏపీ నుంచి
- సత్తా చాటిన కర్నూలు విద్యార్థులు



చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి కృష్ణాజిల్లా కేసరపల్లిలో సిద్ధమవుతున్న వేదిక

చకచకా పనులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్, డీజీపీ
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కూడా..



ప్రమాణస్వీకార ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తదితరులు

గన్నవరం, జూన్ 9: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం 17 ఎకరాల విస్తీర్ణంలో సీనియర్ అధికారులు, టీడీపీ నేతల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఆదివారం పరిశీలించారు. 60 మంది కూర్చునే విధంగా 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 8 అడుగల ఎత్తులో స్టేజీని నిర్మిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజల కోసం 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న జర్మన్ హ్యాంగర్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీతోపాటు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు వస్తుండటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా సభాస్థలికి వచ్చేందుకు స్టేజీ వెనుకనున్న క్వారీ గోతులను పూడ్చి వేశారు. స్టేజీ ఎదురుగా డి.జోన్ బ్లాక్, ఆ తరువాత వీవీఐపీ, వీఐపీ బ్లాక్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

19 నుంచి శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం

- వజ్ర, ముత్యాల కవచాల్లో దర్శనమివ్వనున్న శ్రీవారు

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జ్యేష్ఠాభిషేకం జరగనుంది. అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనాల కారణంగా శ్రీదేవి, భూదేవి, మలయప్పస్వామి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానసాగమోక్తంగా నిర్వహించే ఉత్సవమే జ్యేష్ఠాభిషేకం. ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసంలో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసే విధంగా స్వామివారికి ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలో ఉన్న కల్యాణమండపంలో ఈ ఉత్సవం చేప డతారు. దీనిని 'అభిధేయక అభిషేకం'అని కూడా అంటారు. మొదటిరోజు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారికి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచం అలంకరించి పురవీధుల్లో ఊరేగిస్తారు. రెండో రోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడో రోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు.



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నారాయణ రికార్డ్

- వివిధ కేటగిరీల్లో 6 ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు, ఓపెన్‌లో 20 లోపు 7

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాలలో నారాయణ విద్యార్థులు టాప్ ర్యాంకులతో మరోసారి సత్తా చాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో సందేశ్ భాగాలపల్లి 3వ ర్యాంకు, రాజ్‌దీప్ మిశ్రా (6వ ర్యాంకు), ఎం. బాలాదిత్య (11వ ర్యాంకు), రాఘవ్ శర్మ (12వ ర్యాంకు), బిస్మిత్ సాహు (16వ ర్యాంకు), ఆర్యన్ ప్రకాశ్ (17వ ర్యాంకు), అమోఘ్ అగర్వాల్ 20వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు.. 27, 28, 31, 33, 40, 45, 49, 51, 54, 59, 63, 66, 70, 74, 76, 77, 82, 85, 87, 89, 90, 91, 94, 99 తదితర 100 లోపు 31 ర్యాంకులు తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు డా.పి. సింధునారాయణ, పి. శరణినారాయణ తెలిపారు. అలాగే వివిధ కేటగిరీలలో ఎం.బాలాదిత్య ఓబీసీ ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, శ్రీచరణ్ పీడబ్ల్యూడీ ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, రాఘవ్ శర్మ జనరల్-ఈడబ్ల్యూఎస్ ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, బిబస్వాన్ బిస్వాస్ ఎస్సీ ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, సుముఖ్ ఎస్టీ ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, గుండా జ్యోష్మిత జనరల్ పీడబ్ల్యూఎస్ పీడబ్ల్యూడీ ఆలిండియాతో ఫస్ట్ ర్యాంకులు సాధించినట్లు వారు పేర్కొన్నారు. మొత్తం 6 ఆలిండియా ఫస్ట్ ర్యాంకులతో విద్యార్థులు సత్తా చాటారని వెల్లడించారు. ఐఐటీ సీట్ల ఆశయాలను సాకారం చేయడంలో మరెవరూ నారాయణ విద్యాసంస్థలకు సాటిలేరని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్



ప్రవీణ్‌కుమార్ శ్రీవాత్సవ

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ శ్రీవాత్సవ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న కమిషనర్‌కు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

13 నుంచి స్కూళ్లు

- పాఠశాలల పునఃప్రారంభం ఒక రోజు వాయిదా

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలల పునఃప్రారంభాన్ని ప్రభుత్వం ఒక రోజు వాయిదా వేసింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 12న స్కూళ్లను పునఃప్రారంభించాల్సి ఉండగా, 13 నుంచి తెరవాలని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నందున పాఠశాలల పునఃప్రారంభాన్ని ఒక రోజు వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

చెరపకురా... చెడేవు

- కోవర్ట్ నాని ఇప్పుడైనా అర్థమైందా?: బుద్దా



విజయవాడ(వన్‌టౌన్), జూన్ 9: టీడీపీ కష్టకాలంలో ఉన్నపుడు చంద్రబాబునాయుడు అనాడు కోవర్ట్ నాని (కేశినేని శ్రీనివాస్)ని పిలిచి లోక్‌సభలో విప్ పదవి ఇస్తానంటే వద్దన్నాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న తెలిపారు. చెరపకురా చెడేవు అన్న సూక్తిని ఆతను అర్థం చేసుకుంటాడని గత సంఘటనను వెంకన్న గుర్తు చేస్తూ ఆదివారం ట్వీట్ చేశారు. లోక్‌సభలో పార్టీ విప్ పదవి ఇస్తానని చంద్రబాబునాయుడు అంటే నాని తిరస్కరించి అంత పెద్ద పదవి తాను చేయలేనని చెప్పాడన్నారు. నానిది రతన్ టాటా రేంజ్ అని తెలిసి, వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే గనుక అతన్ని పక్కన పెట్టి అతని తమ్ముడు కేశినేని చిన్నికి అవకాశం ఇచ్చి ఎంపీగా గెలిపించారని బుద్దా వెంకన్న తెలిపారు. పక్కనున్న గుంటూరు నుంచి ఎంపీగా ఎన్నికయిన పెమ్మసానిని కేంద్ర మంత్రివర్గంలోకి పంపారని.. దీనిని బట్టి చెరపకురా చెడేవు అన్నది గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

బ్యాంకర్లతోనూ మిలాఖత్

'భోగాపురం'లో తవ్వేకొద్దీ అక్రమాలు

- రహస్యంగా లావాదేవీలు, ఖాతాలు
- బ్యాంకు ముఖ్య అధికారులకు ఓ బీచ్ రిసార్ట్‌లో ప్లాట్‌ల కేటాయింపు
- పెద్దసారు మేనల్లుడి లీలలు బయటకు
- అసైన్డ్ భూముల్లో ప్రత్యేక సర్వే
- ఓ అధికారి స్వీయ పర్యవేక్షణ
- అక్కడే 120 ఎకరాల అసైన్డ్ భూములు కొన్న రిసార్ట్ యజమాని
- వసూల్‌రాజా వాటా 18 ఎకరాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భోగాపురం అసైన్డ్ భూముల దందాలో మరో కొత్తకోణం. తవ్వే కొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వంలో పెద్ద సారుగా చలామణి అవుతున్న ఓ ప్రధాన అధికారి మేనల్లుడు భోగాపురంలో అసైన్డ్, జిరాయితీ భూముల కొనుగోళ్ల లావాదేవీల్లో మూడు బ్యాంకుల అధికారులను గుప్పిటపట్టినట్లు తెలిసింది. డిపాజిట్లు, ఇతర లావాదేవీలు బయటకు రాకుండా, ఎవరు అడిగినా సమాచారం చెప్పకుండా ఉండేందుకు ఆ బ్యాంకుల ముఖ్య అధికారులతో ఒప్పందాలు చేసుకున్న విషయం వెలుగుచూసింది. ఇందుకు ప్రతిఫలంగా భోగాపురం మండలంలోని ఓ బీచ్ రిసార్ట్ పరిధిలోని రియల్ వెంచర్‌లో ప్లాట్‌లు కేటాయించినట్లు తెలిసింది. అలాగే విజయనగరం జిల్లాకు చెందిన ఓ రెవెన్యూ అధికారికి కూడా భూసంతర్పణ చేసినట్లు సమాచారం. అసైన్డ్ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో పెద్దసారు సేవలో ఓ సర్వే ఉన్నతాధికారి తరించిపోయారు. సర్వే విభాగంలోని అధికారులను భోగాపురానికి పంపించి, ముందుగానే ఫ్రీ హోల్డ్ అయ్యే భూములపై సర్వేలు చేయించారు. ప్రభుత్వ అత్యవసర కార్యక్రమని పేరు చెప్పి ఆ భూముల్లో ఆగమేఘాల మీద డ్రోన్ సర్వేలు చేయించినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత భూముల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్‌లు చకచకా జరిగిపోయాయి.

రిసార్ట్ యజమాని మంత్రాంగం

పెద్దసారు మేన ల్లుడు విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని ఏడు గ్రామాల పరిధిలో భారీగా అసైన్డ్ భూములు కొన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. కడప జిల్లాకు చెందిన అల్లుడి భూదందాలను ఒక్కొక్కటిగా బయటపెట్టింది. ఆరా తీసే కొద్దీ కొత్త విషయాలు బయటపడుతున్నాయి. భూముల కొనుగోళ్ల సందర్భంగా భారీగా లావాదేవీలు జరిగాయి. బ్యాంక్ డిపాజిట్లు చేశారు. భోగాపురంతో పాటు విశాఖలోని మూడు బ్యాం కుల నుంచే నగదు బదిలీలు, డిపాజిట్ల కార్యకలాపాలు జరిగాయి. వీటి వివరాలు బ్యాంక్ రెగ్యులర్ ఫిజికల్, ఈ ఫైలింగ్ రికార్డుల్లో అం దరికీ కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారని తెలిసింది. బ్యాంకులో పని చేసే సీనియర్ ఉద్యోగులు కూడా ఆ డేటాను చూడలేనంతగా గోప్యత పాటించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయించినట్లు తెలిసింది. దీంతో స్వేచ్ఛగా కోట్ల రూపాయల మేర లావాదేవీలు నడిపినట్లు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా బ్యాంకు అధికారులకు భోగాపురం మం డలంలోనే పిన్నింటిపాలెం సమీపంలోని ఓ రియల్ వెంచర్‌లో నివాస స్థలాలు కేటాయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ వెంచర్ సముద్ర తీరానికి సమీపంలో, ఓ ప్రముఖ బీచ్ రిసార్ట్‌కు దగ్గరలో ఉంటుంది. రిసార్ట్ యజమాని ద్వారా ఆ మూడు బ్యాంకుల ముఖ్య అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు మంత్రాంగం నడిపించారు. ఆయన కూడా ఎయిర్‌పోర్టు చుట్టూ ఉన్న గ్రామాల పరిధిలో 120 ఎకరాల అసైన్డ్ భూమిని కొన్నారు. ఆ భూములను విజయనగరంలో రెండో స్థానంలో ఉన్న ఓ కీలక అధికారి, మరో రెవెన్యూ అధికారి దగ్గరుండి ఫ్రీ హోల్డ్ చేయించారు. ఆ వెంటనే భూములను నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగించారు. ప్రాజెక్టు రాబోతుందని స్థానికులను భయపెట్టి తన రిసార్టు పక్కనే ఉన్న భూములను ఎకరం 16 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఇందులో నుంచే ము ఖ్యనేత వద్ద పని చేసిన వసూల్‌రాజాకు 18 ఎకరాలు, వైసీపీకే చెందిన మరో ముఖ్య నేత(నెల్లూరు)కు 25 ఎకరాలు రాసిచ్చినట్లుగా చెబుతున్నారు.

స్పెషల్ సర్వే

భోగాపురంలోని ఏడు గ్రామాలపరిధిలో పెద్దసారు మేనల్లుడు అసైన్డ్, జిరాయితీ భూ ముల కొనుగోళ్లు చేపట్టడానికి ముందే వాటిలో సర్వే నిర్వహించారు. పెద్దసారు ఆదేశాలతో సర్వే శాఖలోని ఓ ఉన్నతాధికారి ప్రత్యేకంగా సర్వే చేయించారని తెలిసింది. ఇందుకు విశాఖతో పాటు విజయనగరం జిల్లాకు చెందిన కొందరు సర్వేయర్లను ఉపయోగించినట్లు తెలిసింది. ఆ ప్రాంతంలో ప్రభుత్వం పెద్ద పరిశ్రమను తీసుకురాబోతుందని, ఫ్రీ హోల్డ్ అయ్యే అవకాశాలున్న భూములు, వాటి మధ్యలో ఉన్న జిరాయితీ భూములను సర్వే చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలూ ఇవ్వలేదని తెలిసింది. మౌఖిక ఆదేశాలతోనే రెండు జిల్లాల అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించి ఆ భూముల సర్వేను గత అక్టోబరు నాటికే పూర్తి చేయించినట్లు తెలిసింది. ప్రభుత్వ పెద్దల సేవలో ముందుండే ఈ సర్వే అధికారి పెద్ద సారు చెప్పినట్లు అడ్డగోలు పనులు చేయడంలోనూ ఆరితేరారన్న విమర్శలున్నా యి. పెద్దసారు మేనల్లుడికి లబ్ధిచేకూర్చే కార్యక్రమని తెలిసి కూడా అసలు విషయం చెప్పకుండా సర్వే సిబ్బందిని ఆ భూముల సర్వేకు పురమాయించినట్లు శాఖలో చర్చ జరుగుతోంది.

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య హవా

- ఓపెన్ కేటగిరీలో 10 లోపు 5 ఆలిండియా ర్యాంకులు



హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4, 5, 6, 9, 10, 12, 14 ర్యాంకులతో శ్రీచైతన్య తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. టాప్ ర్యాంకుల్లోనూ, టోటల్ ర్యాంకుల్లోనూ తిరుగులేని అగ్రస్థానంతో దూసుకెళ్లింది. ఆలిండియా 1వ ర్యాంకు రాఘవశర్మ, ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 4వ ర్యాంకు రిథమ్ కేడియా, పుట్టి కుశాల్ కుమార్ 5వ ర్యాంకు, రాజదీప్ మిశ్రా 6, ధ్రువిన్ హేమంత్ దోషి 9, సిద్విక్ సుహాస్ 10వ ర్యాంకు సాధించారు. ఓపెన్ కేటగిరిలో టాప్ 10లోపు 5 ర్యాంకులతో పాటు 100 లోపు 30 ర్యాంకులు, 1000 లోపు 202 ర్యాంకులు, వివిధ కేటగిరీల్లో 100 లోపు 146, 1000 లోపు 721 ర్యాంకులు సాధించారు. మొత్తం 3,728 శ్రీచైతన్య విద్యార్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ మాట్లాడుతూ.. దేశంలో నిష్ణాతులైన టాప్ ఫ్యాకల్టీతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో నాణ్యమైన శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. ఇంతటి ఘన విజయాలను సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, సిబ్బందిని అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎస్సార్ ప్రభంజనం



జి.నవీన్, పి.రాకేష్‌కుమార్, కె.వినోద్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో జి.నవీన్ 8వ ర్యాంకు, పి.రాకేష్‌కుమార్ 36వ ర్యాంకు, కె.వినోద్ 39వ ర్యాంకు, జె.స్నేహిత్ సందేశ్ 123, వి.రాంబాబు 125వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు అన్ని కేటగిరీలు కలిపి జాతీయ స్థాయిలో 127, 133, 135, 157, 185, 299, 323, 324, 450, 598, 621, 654, 689, 737, 751, 901, 966 ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలతో కలిసి వరదారెడ్డి అభినందించారు.

డా.కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి 5వ ర్యాంకు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 పోటీ పరీక్షల ఫలితాల్లో డా.కేకేఆర్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో 5, 55 ర్యాంకులు సాధించారు. పుట్టి కుషల్ కుమార్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 5వ ర్యాంకు, సతివాడ జోతిరాదిత్య 55వ ర్యాంకు సాధించారు. అలాగే మొదటి 100 లోపు వివిధ కేటగిరీల్లో 3, 5, 9, 12, 17, 26, 28, 45, 55, 55, 64, 88 ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సంస్థ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

గుడివాడ విశ్వభారతి పూర్వ విద్యార్థికి ఫస్ట్ ర్యాంకు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాల్లో గుడివాడ విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు జగన్నాథ్ మోహిత్ ఆలిండియా 1వ ర్యాంకు, బోతమొళ్ల చరణ్ ఆలిండియా 2వ ర్యాంకుతో సంచలన విజయం సాధించారు. దొరికాల శ్రీనివాసరెడ్డి ఆలిండియా స్థాయిలో 13వ ర్యాంకు, ఎం.సాయి దివ్యతేజ రెడ్డి 15, ఎం.సాయి శివలోచన్ 16, కె.ప్రభాకర్ రెడ్డి 18, వై.సత్య సాయి నీలేశ్ 20, కె.జాహ్నవి 75, డి.ఉపేంద్ర 91వ ర్యాంకు సాధించగా.. కె.సూర్యశశాంక్ 94వ ర్యాంకు వివిధ కేటగిరీల్లో సాధించారు. ఐఐటీ చరిత్రలో 2011, 2013, 2023లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించిన విశ్వభారతి పూర్వ విద్యార్థులు 2021లో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 5వ ర్యాంకు, 2022లో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా రెండో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను, విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ అభినందించారు.

ఆల్ఫోర్స్ విద్యార్థులకు ర్యాంకులు

కరీంనగర్, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాల్లో కరీంనగర్ అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఎం. హర్షిత్ 64వ ర్యాంకు, జి. శ్రీహాస్ 290 ర్యాంకు, బి. భరద్వాజ్ 396, ఆర్. పునీత్ మనోహర్ 477, సుబోద్ చౌదరి 545, ఎ. శివవరుణ్ 557, పి. రాహుల్ 571, దేవదత్త 751, విశాల్‌రెడ్డి 838 ర్యాంకులు సాధించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన భాష్యం



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), జూన్ 9: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించారని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ వెల్లడించారు. భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు ఎం.సాయియశ్వంత్ రెడ్డి ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 50వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 62వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారని తెలిపారు. అదే విధంగా రిజర్వేషన్ కేటగిరిలో ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 5వ ర్యాంకు, పి.గౌతమి 19వ ర్యాంకు, కె.శ్రేయ 23, కె.జాషువా వివేక్ 26, జి.జాన్ 36, ఎం.అర్జున్‌కుమార్ 37, కె.హర్షిత 43, కె.చైతన్య 52, పి.శ్యామ్ 61, డి.భరత్‌చంద్ర 86వ ర్యాంకు సాధించారని వివరించారు. జాతీయస్థాయిలో 100 లోపు 12 ర్యాంకులు. 200 లోపు 20 ర్యాంకులు, 500 లోపు 51 ర్యాంకులు, 1000 లోపు 86 ర్యాంకులు, 2000 లోపు 107 ర్యాంకులు, 5000 లోపు 193 ర్యాంకులు సాధించి తమ విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు. జాతీయ స్థాయి ర్యాంకర్లకు రూ.5 లక్షల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు.

జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలు విడుదల

- ఢిల్లీ జోన్ విద్యార్థి వేద్ లాహోటికి ఫస్ట్ ర్యాంక్
- 355 మార్కులతో సరికొత్త రికార్డు
- టాప్-10 ర్యాంకర్లలో నలుగురు ఐఐటీ మద్రాస్ జోన్ విద్యార్థులు
- నేటి నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ

న్యూఢిల్లీ, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లాహోటి 360 మార్కులకుగాను 355 మార్కులు సాధించి నెంబర్ వన్ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షల చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు. 2022లో అప్పటి ఫస్ట్ ర్యాంకర్ సాధించిన 352 మార్కులే ఇప్పటి వరకూ అత్యధికం. తదుపరి ర్యాంకర్లలో ఆదిత్య (ఐఐటీ ఢిల్లీ జోన్)-2, భోగపల్లి సందేశ్ (ఐఐటీ మద్రాస్ జోన్)-3, రిథమ్ కేడియా (ఐఐటీ రూర్కీ జోన్)-4, పుట్టి కుశాల్ కుమార్ (ఐఐటీ మద్రాస్)-5, రాజ్‌దీప్ మిశ్రా (ఐఐటీ బాంబే జోన్)-6, ద్విజ ధర్మేశ్‌కుమార్ పటేల్ (ఐఐటీ బాంబే జోన్)-7, కోడూరి తేజేశ్వర్ (ఐఐటీ మద్రాస్ జోన్)-8, ధ్రువి హేమంత్ దోషి (ఐఐటీ బాంబే జోన్)-9, సిద్విక్ సుహాస్ (ఐఐటీ మద్రాస్ జోన్)-10 ఉన్నారు. ఆలిండియా స్థాయిలో ఏడో ర్యాంకు సాధించిన ద్విజ ధర్మేశ్‌కుమార్ పటేల్ 332 మార్కులతో బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా, టాప్ 10 ర్యాంకర్లలో నలుగురు విద్యార్థులు ఐఐటీ మద్రాస్‌కు చెందిన వారు కావటం విశేషం. క్వాలిఫై అయిన విద్యార్థులలో కూడా ఐఐటీ మద్రాస్ జోన్‌కు చెందిన వారే అధికంగా ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే జోన్లు ఉన్నాయి. తొలి 500 మంది ర్యాంకర్లలో 145 మంది ఐఐటీ మద్రాస్, 136 ఐఐటీ బాంబే, 122 మంది ఐఐటీ ఢిల్లీ జోన్లకు చెందిన వారు ఉన్నారు. ఈసారి ఏడుగురు విదేశీ విద్యార్థులతోపాటు 179 మంది ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా కూడా అర్హత సాధించారు. కాగా, మే 26వ తేదీన జరిగిన జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షకు 1,80,200 మంది విద్యార్థులు హాజరుకాగా 48,248 మంది అర్హత సాధించారు. వీరిలో 7,964 మంది బాలికలు. ఈసారి ఈ పరీక్షను ఐఐటీ మద్రాస్ నిర్వహించింది. సోమవారం నుంచి ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

నేడు పలు జిల్లాల్లో వర్షాలు

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర మీదుగా తూర్పు, పడమర మధ్య సముద్రమట్టానికి 3.6 కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్యన ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. మరిన్నిచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. రానున్న 24 గంటల్లో రాయలసీమ, కోస్తాలో నెల్లూరు, ప్రకాశం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షం కురుస్తుందని వాతావరణశాఖ తెలిపింది.

విజయవాడ-హైదరాబాద్ హైవేపై దారిదోపిడీ

చిట్యాల రూరల్, జూన్ 9: నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున దారిదోపిడీ జరిగింది. ఎస్సై సైదాబాబు కథనం మేరకు తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పంచాక్షరి-అఖిల దంపతులు. శనివారం తోట్లపాలెం నుంచి పంచాక్షరి-అఖిల దంపతులు, వారి కుమారుడు దేవాంశ్, శ్రుతి కలిసి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి వచ్చేసరికి కారును ఆదివారం వేకువజామున 2:30 గంటలకు బస్ బేలో నిలిపాడు. సుమారు 3.45 గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు ముఖం కనబడకుండా వస్త్రాలు కట్టుకుని పెద్దబండరాయితో కారు ముందుభాగంలోని కుడి, ఎడమవైపు అద్దాలను ధ్వంసం చేశారు. ముందుసీట్లలో నిద్రిస్తున్న పంచాక్షరిని, శ్రుతిని కారులోంచి బయటకు లాగి రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. పంచాక్షరి వేలికి ఉన్న 10 గ్రాముల బంగారు ఉంగరం, శ్రుతి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని 3 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని సమీపంలోని తోటలోకి పారిపోయారు. దుండగుల దాడిలో గాయపడిన పంచాక్షరి, శ్రుతిని గమనించిన ఓ వ్యాన్ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి.. వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడినుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లాడు.

తెలుగు విద్యార్థుల 'జై'ఈఈ!

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మనోళ్ల సత్తా

- టాప్‌టెన్‌లో 3 ర్యాంకులు తెలంగాణకే
- మరో ర్యాంకు ఏపీ విద్యార్థి కైవసం
- తొలి 100 ర్యాంకుల్లో 26 తెలుగు రాష్ట్రాలకే
- 16 మంది తెలంగాణ.. 10 మంది ఏపీ నుంచి
- సత్తా చాటిన కర్నూలు విద్యార్థులు



కుశాల్ (5వ ర్యాంకు)



సుహాస్ (10వ ర్యాంకు)

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తాచాటారు. జాతీయ స్థాయిలో తొలి 100 ర్యాంకుల్లో ఏకంగా 26 ర్యాంకులు తెలుగు విద్యార్థులే సాధించారు. వీరిలో 16 మంది తెలంగాణ నుంచే ఉంటే.. మిగతా 10 మంది ఏపీకి చెందినవారున్నారు. ఆల్ ఇండియా టాప్-10 ర్యాంకుల్లో మూడు ర్యాంకులు తెలంగాణ, ఒక ర్యాంకు ఏపీ విద్యార్థికి దక్కాయి. హైదరాబాద్ విద్యార్థి, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన సందేశ్ జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు, పుట్టి కుశాల్‌కుమార్ ఐదోర్యాంకు, ఎస్ఎస్‌డీబీ సిద్విక్ సుహాస్ పదో ర్యాంకుతో మెరిశారు. అదేవిధంగా ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన కొండూరు తేజేశ్వర్ 331/360 మార్కులు సాధించి 8వ ర్యాంకు సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలను ఐఐటీ మద్రాస్ ఆదివారం విడుదల చేసింది.

రాష్ట్రంలోని ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు హర్షవర్ధన్‌కు 42వ ర్యాంకు, కె. శివనారాయణకు 51వ ర్యాంకు, ప్రణతికి 345వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అత్యధికంగా అబ్బాయిలు హాజరుకాగా, ఉత్తీర్ణులైన వారిలోనూ వారే ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు జాతీయ స్థాయిలో 1,86,584 మంది రిజిస్ట్రేషన్‌ను చేసుకోగా, 1,80,200 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 48,248 మంది అర్హత పొందారు. అబ్బాయిలు 1,43,637 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 40,284 మంది క్వాలిఫై అయ్యారు. అమ్మాయిలు 42,947 మంది దరఖాస్తు చేసుకుంటే, 7,964 మంది క్వాలిఫై అయ్యారు.



3వ ర్యాంక్ సాధించిన సందేశ్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

ఐఏఎస్ లక్ష్యం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 3వ ర్యాంకు సాధించిన ఉమ్మడి కర్నూలు జిల్లా గోస్పాడు మండల కేంద్రానికి చెందిన బి.సందేశ్‌కు 338/360 మార్కులు వచ్చాయి. 99.99 పర్సంటైల్ సాధించారు. గోస్పాడు మండలం నెహ్రూనగర్‌కి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బొగ్గులపల్లె రామసుబ్బారెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమారుడు సందేశ్ పాఠశాల దశ నుంచే ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పదో తరగతిలో 10కి 10 పాయింట్లు, ఇంటర్మీడియెట్‌లో 957 మార్కులు సాధించారు. సందేశ్ మాట్లాడుతూ.. సివిల్స్ రాసి ఐఏఎస్ కావడం తన ఆశయమని తెలిపారు.

కేటగిరీల వారీగా

ఈ ఏడాది జనరల్ కేటగిరీ విద్యార్థులు 14 వేల మంది క్వాలిఫై కాగా, ఎస్సీ కేటగిరీ విద్యార్థులు 13వేల మంది క్వాలిఫై అయ్యారు. ఓబీసీ విద్యార్థులు 9వేల మంది క్వాలిఫై అయ్యారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో అభ్యర్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లోని సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన కౌన్సెలింగ్‌ను జూన్ 10 నుంచి జులై 23 వరకు నిర్వహించనున్నారు.



ప్రీతం భాటియా (32వ ర్యాంకు)

మెరిసిన తెలంగాణ

తెలంగాణకు చెందిన ఎక్కువ మంది విద్యార్థులు ఈసారి జేఈఈలో మెరిశారు. సుచిత్రకు చెందిన గంగా శ్రేయాస్‌కు జాతీయ స్థాయిలో 13వ ర్యాంకు, గచ్చిబౌలి విద్యార్థి ప్రీతం భాటియాకు 32వ ర్యాంకు, హర్షిణికి 72వ ర్యాంకు, సిద్దిపేటకు చెందిన లక్ష్మి నరసింహారెడ్డికి 76 ర్యాంకు, శ్రేయాస్ మోహన్ కల్లూరి 92వ ర్యాంకు, నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఆర్ రాహుల్‌కు 207వ ర్యాంకు, ఎస్ హరిచక్రవర్తి 483వ ర్యాంకు, మిర్యాలగూడకు చెందిన కుంచం శివకు 211వ ర్యాంకు, సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన జే వెంకటేశ్‌కు 293వ ర్యాంకు సాధించారు. ఇదిలావుంటే, ఆల్ ఇండియా టాప్-10లో ఐఐటీ మద్రాస్ జోన్ నుంచి నలుగురు విద్యార్థులు చోటు దక్కించుకున్నారు. వీరిలో ముగ్గురు తెలంగాణ విద్యార్థులున్నారు. తెలంగాణ విద్యార్థిని శ్రీనిత్య దేవరాజ్ మద్రాస్ జోన్ నుంచి మహిళల్లో టాపర్‌గా నిలిచారు. శ్రీనిత్య ఆలిండియా ఓపెన్ కోటాలో 268 ర్యాంకును సాధించారు.

సీఎస్ఈలో చేరతా!



తేజేశ్వర్ (8వ ర్యాంకు)

కర్నూలు నగరానికి చెందిన కొండూరు తేజేశ్వర్ 331/360 మార్కులు సాధించి 8వ ర్యాంకు సాధించారు. తేజేశ్వర్ తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. తండ్రి శేఖర్ ఆస్పరి మండలం చిన్నహుల్తిలో స్కూల్ అసిస్టెంట్‌గా, కృష్ణవేణి జూపాడుబంగ్లా మండలం తంగడంచలో పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్నారు. తేజేశ్వర్ పదో తరగతిలో 570 మార్కులు, ఇంటర్‌లో 981 మార్కులు సాధించారు. జేఈఈలో 331 మార్కులతో 99.918 పర్సంటైల్‌ను సాధించారు. తేజేశ్వర్ మాట్లాడుతూ.. ఐఐటీ ముంబై విద్యా సంస్థలో సీఎస్ఈలో చేరాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్

సౌతాఫ్రికా x బంగ్లాదేశ్ (రా.8. గం.)

ఇంగ్లండ్‌పై ఆసీస్ గెలుపు


జంపా

బ్రిడ్జిటౌన్ (బార్బడోస్): డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా విజయం సాధించింది. శనివారం రాత్రి జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో 36 పరుగులతో ఇంగ్లండ్‌ను కంగారూలు చిత్తు చేశారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ ఈసారి టోర్నీలోనే అత్యధికంగా 201/7 స్కోరు సాధించింది. వార్నర్ (39), మార్ష్ (35), హెడ్ (34), స్టొయినిస్ (30) రాణించారు. భారీ ఛేదనలో 20 ఓవర్లలో 165/6 స్కోరుకే పరిమితమై ఇంగ్లండ్ ఓడింది. బట్లర్ (42), ఫిల్ సాల్ట్ (37) తొలి వికెట్‌కు 73 పరుగులతో ఇచ్చిన మెరుపు ఆరంభాన్ని తదుపరి బ్యాటర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జంపా ఓపెనర్లిద్దరినీ అవుట్ చేసి ఇంగ్లండ్‌ను దెబ్బ కొట్టాడు.

అకిల్ పాంచ్ పటాక



- ఉగాండా 39 రన్స్‌కే ఆలౌట్
- వెస్టిండీస్ భారీ విజయం

ప్రొవిడెన్స్ (గయానా): లెఫ్టామ్ స్పిన్నర్ అకిల్ హొసేన్ (4-0-11-5) బంతులకు పసికూన ఉగాండా చిగురుటాకులా వణికింది. దాంతో 174 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీ20 వరల్డ్ కప్ అరంగేట్ర జట్టు ఉగాండా 12 ఓవర్లలో 39 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా మెగా టోర్నీలో సంయుక్తంగా అత్యల్ప స్కోరు సాధించిన జట్టుగా రికార్డు సృష్టించింది. 2014 ప్రపంచ కప్‌లో శ్రీలంకపై నెదర్లాండ్స్ కూడా ఇన్నే పరుగులు చేసింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 173 పరుగులు చేసింది. చార్లెస్ (44), రస్సెల్ (30 నాటౌట్), కెప్టెన్ పొవెల్ (23) రాణించారు. అనంతరం ఛేదనలో.. అకిల్‌కు పేసర్ అల్జారీ జోసెఫ్ (2/6) తోడవడంతో ఉగాండా బ్యాటర్లు కకావికలయ్యారు.

హ్యాండ్‌బాల్ చైర్మన్‌గా జగన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం చైర్మన్‌గా ఎ. జగన్‌మోహన్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ఏజీఎంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇక, అధ్యక్షుడిగా రంజిత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్దన్, కోశాధికారిగా శివ ప్రకాష్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

థ్రిల్లింగ్ విన్

119 రన్స్‌ను కాపాడిన బౌలర్లు

బుమ్రాకు 3 వికెట్లు • భారత్ చేతిలో పాక్ చిత్తు

టీ20 వరల్డ్‌కప్


బుమ్రా (3/14)


పంత్ (42)

ప్రపంచకప్‌లో అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్ కలిగిన భారత్ చేసింది 119 పరుగులే.. ఇక ఈ స్కోరుతో గెలిచేదెలా? అనే నిరాశ అందరిలోనూ కనిపించింది. అటు తొలి పది ఓవర్లపాటు పాక్ బ్యాటింగ్ కూడా సజావుగానే సాగింది. ఈ దశలో గెలుపుపై భారత ఫ్యాన్స్‌కు ఆశలు లేకపోయినా.. బౌలర్లు మాత్రం అద్భుతమే చేశారు. మధ్య ఓవర్లలో పరుగులను కట్టడి చేస్తూనే మరోవైపు వికెట్లు తీస్తూ పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. పేసర్ బుమ్రా తన పదునైన బంతులతో చెలరేగడంతో భారత్‌కు అపూర్వ విజయం దక్కింది.

న్యూయార్క్: బ్యాటర్లు విఫలమైనా.. టీమిండియా బౌలర్లు కలిసికట్టుగా కదంతొక్కి దాయాది పాకిస్థాన్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చారు. ఫలితంగా ఆదివారం అత్యంత ఆసక్తికరంగా ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయాన్నందుకుంది. భారత్‌కిది రెండో గెలుపు కాగా.. పాక్‌కు రెండో ఓటమి. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్ (31 బంతుల్లో 6 ఫోర్లతో 42), అక్షర్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 20) మాత్రమే ఓ మాదిరిగా ఆడారు. ఏకంగా ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. పేసర్లు నసీమ్ షా, హారిస్ రౌఫ్‌లకు మూడేసి, ఆమిర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో పాక్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 113 పరుగులు చేసి ఓడింది. రిజ్వాన్ (31) ఒక్కడే రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బుమ్రాకు మూడు, పాండ్యాకు రెండు వికెట్లు దక్కాయి. అంతకు ముందు వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా ఆరంభమైంది. అలాగే భారత్ తొలి ఓవర్ ముగిశాక కూడా మరో 35 నిమిషాలపాటు బ్రేక్ అంతరాయం ఏర్పడింది.

ఆరంభమే బాగుంది..: స్వల్ప ఛేదనలో పాక్ ఆరంభం బాగానే ఉన్నా మధ్య ఓవర్లలో తడబడి మూల్యం చెల్లించుకుంది. ఓపెనర్ రిజ్వాన్ ఒక్కడే నిలకడగా ఆడాడు. అయితే మూడో ఓవర్‌లోనే అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను ఫైన్‌లెగ్‌లో దూబే వదిలేశాడు. మరో ఓపెనర్ బాబర్ ఆజమ్ (13)ను బుమ్రా అవుట్ చేయగా.. ఆరో ఓవర్‌లో రిజ్వాన్ సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 35/1 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత ఉస్మాన్ (13)తో కలిసి రిజ్వాన్ రెండో వికెట్‌కు 31 పరుగులు జోడించాడు. 11వ ఓవర్‌లో ఉస్మాన్‌ను అక్షర్ అవుట్ చేశాక.. ఫఖర్ (13) వచ్చీ రాగానే 6,4తో జోరు చూపే ప్రయత్నం చేశాడు. కానీ హార్దిక్ అతడిని వెనక్కి పంపాడు. అనంతరం 15వ ఓవర్‌లో 3 రన్స్ మాత్రమే ఇచ్చి కీలక రిజ్వాన్‌ను బుమ్రా బౌల్డ్ చేయగా, షాదాబ్ (4)ను హార్దిక్ వెనక్కిపంపడంతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గింది. ఇక 19వ ఓవర్‌లో ఇఫ్తికార్ (5)ను బుమ్రా అవుట్ చేయడంతో సమీకరణం ఆరు బంతుల్లో 18 రన్స్‌కు మారడం పాక్‌కు సవాల్‌గా మారింది. తొలి బంతికే ఇమాద్ (15)ను అర్ష్‌దీప్ అవుట్ చేయగా, నసీమ్ (10 నాటౌట్) రెండు ఫోర్లు బాదినా ఫలితం లేకపోయింది.

పేసర్ల దాడి: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ను ఈ పిచ్‌పై ఊహించినట్టుగానే పాక్ పేసర్లు ఇబ్బంది పెట్టారు. వీరి ధాటికి ఒక్క బ్యాటర్ కూడా సౌకర్యవంతంగా కనిపించలేదు. 24 పరుగుల తేడాతో చివరి ఏడు వికెట్లు నేలకూలడం గమనార్హం. పంత్ పర్వాలేదనిపించాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ రోహిత్ సిక్సర్ బాదినా.. వర్షం తర్వాత ఆరంభమైన రెండో ఓవర్‌లో పాక్ గట్టి షాక్ ఇచ్చింది. ప్రత్యర్థిపై అద్భుత రికార్డున్న విరాట్ (4)ను పేసర్ నసీమ్ షా దెబ్బతీశాడు. కవర్ పాయింట్‌లో ఉస్మాన్ సులువైన క్యాచ్ తీసుకున్నాడు. తర్వాతి ఓవర్‌లోనే రోహిత్‌ను పేసర్ షహీన్ అవుట్ చేయడంతో పాక్ సంబరాలు మిన్నంటాయి. ఈ దశలో అనూహ్యంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన అక్షర్-పంత్ జోడీ కాసేపు పాక్ బౌలర్లను నిలువరించగలిగింది. షహీన్ ఓవర్‌లో అక్షర్ 4,6 బాది 14 రన్స్ రాబట్టగా.. ఆమిర్ ఓవర్‌లో పంత్ రెండు ఫోర్లు బాదాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 50/2 స్కోరుతో ఓకే అనిపించింది. కానీ ఎనిమిదో ఓవర్‌లో అక్షర్‌ను నసీమ్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో ఎండ్‌లో జోరు పెంచిన పంత్ పదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగాడు. అటు సూర్యకుమార్ (7), శివమ్ దూబే (3) విఫలం కావడంతో పంత్ ఒత్తిడికి లోనయ్యాడు. దీంతో ఆమిర్ వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్ తొలి బంతినే లాఫ్టెడ్ షాట్ ఆడిన పంత్ మిడాఫ్‌లో బాబర్‌కు చిక్కాడు. ఇక రెండో బంతికే జడేజా డకౌట్ కావడంతో 96/7 స్కోరుతో జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఏడు పరుగుల తేడాతో ఈ నాలుగు వికెట్లు కోల్పోవడం గమనార్హం. మరోవైపు క్రీజులో హార్దిక్ (7) ఉండడంతో చివర్లో ఆదుకుంటాడనిపించినా అత్యాశే అయ్యింది. 18వ ఓవర్‌లో అతడితో పాటు బుమ్రా (0)ను వరుస బంతుల్లో రౌఫ్ పెవిలియన్‌కు చేర్చాడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) రౌఫ్ (బి) షహీన్ షా 13, కోహ్లీ (సి) ఉస్మాన్ (బి) నసీమ్ 4, పంత్ (సి) బాబర్ (బి) ఆమిర్ 42, అక్షర్ (బి) నసీమ్ 20, సూర్యకుమార్ (సి) ఆమిర్ (బి) రౌఫ్ 7, శివమ్ దూబే (సి అండ్ బి) నసీమ్ 3, హార్దిక్ (సి) ఇఫ్తికార్ (బి) రౌఫ్ 7, జడేజా (సి) ఇమాద్ (బి) ఆమిర్ 0, అర్ష్‌దీప్ (రనౌట్) 9, బుమ్రా (సి) ఇమాద్ (బి) రౌఫ్ 0, సిరాజ్ (నాటౌట్) 7 ; **ఎక్స్‌ట్రాలు : 7 ; మొత్తం 19 ఓవర్లలో 119 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-12, 2-19, 3-58, 4-89, 5-95, 6-96, 7-96, 8-112, 9-112 ; **బౌలింగ్:** అఫ్రీది 4-0-29-1, నసీమ్ షా 4-0-21-3, మహ్మద్ ఆమిర్ 4-0-23-2, ఇఫ్తికార్ అహ్మద్ 1-0-7-0, ఇమాద్ వసీమ్ 3-0-17-0, హారిస్ రౌఫ్ 3-0-21-3.

పాకిస్థాన్: రిజ్వాన్ (బి) బుమ్రా 31, బాబర్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 13, ఉస్మాన్ ఖాన్ (ఎల్బీ) అక్షర్ 13, ఫఖర్ జమాన్ (సి) పంత్ (బి) హార్దిక్ 13, ఇమాద్ వసీమ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 15, షాదాబ్ (సి) పంత్ (బి) హార్దిక్ 4, ఇఫ్తికార్ (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 5, షహీన్ షా (నాటౌట్) 0 , నసీమ్ షా (నాటౌట్) 10 ; **ఎక్స్‌ట్రాలు 9 ; మొత్తం 20 ఓవర్లలో 113/7 ; వికెట్లపతనం :** 1-26, 2-57, 3-73, 4-80, 5-88, 6-102, 7-102 ; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-31-1, సిరాజ్ 4-0-19-0, బుమ్రా 4-0-14-3, హార్దిక్ 4-0-24-2, జడేజా 2-0-10-0, అక్షర్ 2-0-11-1.

చాంపియన్ అల్కారజ్



తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కైవసం

ఫైనల్లో జ్వెరెవ్‌కు నిరాశ

పారిస్: వెనుకబడినా.. అద్భుతంగా పుంజుకొన్న స్పెయిన్ చిన్నోడు కార్లోస్ అల్కారజ్ తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను ముద్దాడాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ అల్కారజ్ 6-3, 2-6, 5-7, 6-1, 6-2తో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై పోరాడి గెలిచాడు. 2022లో యూఎస్ ఓపెన్, 2023లో వింబుల్డన్ నెగ్గిన కార్లోస్‌కు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఈ క్రమంలో మూడు వేదికల్లో విజేతగా నిలిచిన పిన్న వయస్కుడిగా స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ (22 ఏళ్ల 5 నెలలు) రికార్డును అల్కారజ్ (21 ఏళ్లు) అధిగమించాడు. 2004 తర్వాత బిగ్-3లో కనీసం ఒక్కరుకూడా లేకుండా జరిగిన ఈ ఫైనల్లో ఇరువురూ హోరాహోరీగా తలపడ్డారు. వరుసగా రెండు సెట్లు నెగ్గిన జ్వెరెవ్.. ఆ తర్వాత పట్టుకోల్పోయాడు. దీంతో 2020 యూఎస్ ఓపెన్ ఫైనల్లో ఓడిన అలెగ్జాండర్ మరోసారి రన్నరప్‌గా సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

పట్టువదలని కార్లోస్: ఆరంభంలో దూకుడుగా ఆడిన అల్కారజ్ తొలి సెట్‌ను సునాయాసంగా సొంతం చేసుకొన్నాడు. ఐదో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్కారజ్ 6-3తో సెట్‌ను సొంతం చేసుకొన్నాడు. అయితే, రెండో సెట్‌లో పుంజుకొన్న అలెగ్జాండర్ ఐదో గేమ్‌లో కార్లోస్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-2తో ముందంజ వేశాడు. ఇక్కడి నుంచి వరుసగా గేమ్‌లు నెగ్గి సమం చేశాడు. మూడో సెట్‌లో అల్కారజ్ బ్రేక్ పాయింట్‌తో 4-2తో ఆధిక్యం సాధించినా.. పట్టువదలని జ్వెరెవ్ పోరాడి 5-5తో సమం చేశాడు. మరోసారి ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన అలెగ్జాండర్ 7-5తో సెట్‌ను దక్కించుకొన్నాడు. కానీ, నాలుగో సెట్‌లో జూలు విదిల్చిన అల్కారజ్ 4-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అయితే, ఐదో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను జ్వెరెవ్ బ్రేక్ చేసినా.. ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లు గెల్చిన కార్లోస్ సెట్‌ను తన ఖాతాలో వేసుకొన్నాడు. దీంతో మ్యాచ్ ఫలితం ఐదో సెట్‌కు దారితీసింది. నిర్ణాయక సెట్‌లో అల్కారజ్ జోరు ముందు జ్వెరెవ్ నిలవలేకపోయాడు. మూడోగేమ్‌లోనే బ్రేక్ పాయింట్ సాధించిన కార్లోస్ 2-1తో పైచేయి సాధించాడు. ఆ తర్వాత ఇద్దరూ తమతమ సర్వీస్‌లను నిలబెట్టుకొన్నారు. కానీ, ఏడో గేమ్‌లో మరోసారి ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్కారజ్.. ఆ తర్వాతి గేమ్‌లో గెలిచి చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొన్నాడు.

రజతంతో మెరిసిన సురభి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సురేంద్ర సింగ్ స్మారక జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ షూటర్ సురభీ భరద్వాజ్ రజతంతో మెరిసింది. భోపాల్‌లో జరిగిన ఈ పోటీల్లో 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో సురభి వెంట్రుకవాసిలో స్వర్ణం కోల్పోయింది. రాజస్థాన్ షూటర్ మణిని కౌశిక్ 621.9 పాయింట్లతో పసిడి పతకం కొల్లగొట్టగా, సురభి 621.8 పాయింట్లతో ద్వితీయ స్థానానికి పరిమితమైంది.

బిజినెస్

23,600 పైన బుల్లిష్

(జూన్ 10-14 తేదీల మధ్య వారానికి)

టెక్నికల్ అనాలిసిస్


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,339-21,281 పాయింట్ల మధ్యన కదలాడి 759 పాయింట్ల లాభంతో 23,290 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,600 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,881, 22,683, 22,755, 22,521 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 23,600 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 22,000
నిరోధ స్థాయిలు: 23,500, 23,600, 23,700 (23,400 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,100, 23,000, 22,900 (23,200 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	475
వరంగల్	502	గోదావరి	470
చిత్తూరు	523	విశాఖపట్నం	475
		డజను గుడ్లు రూ. 72	



భారత పౌర విమానయానం అదుర్స్

పోటీతో ప్రయాణికులకు మరింత మేలు.. ఎమిరేట్స్ ఎయిర్‌లైన్ సీసీఓ అద్నాన్

దుబాయ్: భారత పౌర విమానయాన మార్కెట్ పురోభివృద్ధిపై ఎమిరేట్స్ ఎయిర్‌లైన్ సంస్థ అత్యంత ఆశాభావం వ్యక్తం చేసింది. అయితే మార్కెట్ పెరుగుదలకు అనుగుణంగా భారత్-యూఏఈ మధ్య విమాన సర్వీసులు పెరగక పోవడంపై ఆ సంస్థ డిప్యూటీ ప్రెసిడెంట్, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ (సీసీఓ) అద్నాన్ కజిమ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దుబాయ్‌లో జరిగిన ఐఏటీఏ వార్షిక సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. భారత్‌లో మరిన్ని పౌర విమానయాన సంస్థలను అనుమతిస్తే పోటీ పెరిగి ప్రయాణికుల తమకు ఇష్టమైన ఎయిర్‌లైన్‌ను ఎంచుకునే సౌలభ్యం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం రెండు దేశాల విమానయాన సంస్థలు వారానికి 1.3 లక్షల సీట్ల సామర్థ్యంతో విమాన సర్వీసులు నడుపుతున్నా, రద్దీ తగ్గడం లేదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సీట్ల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని కజిమ్ తెలిపారు.

స్టార్ అలయెన్స్‌తో మేలు: ఎయిర్ ఇండియా-లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ మధ్య ఉన్న భాగస్వామ్య ఒప్పందం రెండు విమానయాన సంస్థల ప్రయాణికులకు మేలు చేస్తుందని ఇదే సదస్సుకు హాజరైన స్టార్ అలయెన్స్ గ్రూప్ సీఈఓ థియో పనాజియోటౌలియాస్ అన్నారు. ఈ భాగస్వామ్యంతో ప్రపంచంలోని 50 ప్రముఖ విమానాశ్రయాల్లో 26 విమానయాన సంస్థల సేవలను ప్రయాణికులు వినియోగించుకునేందుకు వీలవుతుందన్నారు. మరిన్ని భారత విమానయాన సంస్థలు స్టార్ అలయెన్స్‌లో చేరాలని కోరుతున్నట్టు తెలిపారు.

లాభాలకు చేరువలో: ఆకాశ ఎయిర్

తమ సంస్థ లాభాలకు చేరువలో ఉందని దుబాయ్ ఐఏటీఏ వార్షిక సదస్సుకు హాజరైన ఆకాశ ఎయిర్ వ్యవస్థాపకుడు ఆదిత్య ఘోష్ తెలిపారు. దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలకు మరిన్ని విమాన సర్వీసులు ప్రారంభించే యోచన ఉందన్నారు. ఇదే సమయంలో దేశంలోని ద్వితీ, తృతీయ శ్రేణి నగరాలకూ తమ సర్వీసులు విస్తరిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి జెద్దాకు తమ విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని ఘోష్ తెలిపారు.

సంస్కరణల బాట మరువద్దు మోదీజీ

పారిశ్రామిక వర్గాలు

న్యూఢిల్లీ: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. మరిన్ని సాహసోపేత సంస్కరణలతో వికసిత్ భారత్‌కు ప్రధాని మోదీ పునాదులు వేస్తారని ఆశిస్తున్నట్టు తెలిపాయి. 'వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు నరేంద్ర మోదీజీకి అభినందనలు. దేశ అభివృద్ధి, సౌభాగ్యాలకు మీరు ఈ కాలాన్ని వినియోగిస్తారని ఆశిస్తున్నా' అని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రగతిశీల విధానాలతో ప్రధాని మోదీ ఈ కాలాన్ని వికసిత్ భారత్‌కు గట్టి పునాదులు వేసేందుకు ఉపయోగిస్తారని ఆశిస్తున్నాం' అని ఫిక్కీ జాతీయ అధ్యక్షుడు అనిష్ షా ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. అసోచామ్ సెక్రటరీ జనరల్ దీపక్ సూద్, పీడబ్ల్యూసీ ఇండియా ఛైర్‌పర్సన్ సంజీవ్ కృష్ణన్ కూడా ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు.

కాకినాడలో నానో ఫెర్టిలైజర్ ప్లాంట్ ప్రారంభం

కోరమాండల్ ఇంటర్నేషనల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోరమాండల్ ఇంటర్నేషనల్ నానో ఎరువుల విభాగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ప్రత్యేకంగా ఫెర్టిలైజర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఆదివారం నాడు ఈ ప్లాంట్‌ను కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంకరసుబ్రమణియన్ ప్రారంభించారు. ఈ ప్లాంట్ ప్రారంభంతో కంపెనీ కొత్తతరం ఎరువుల విభాగంలోకి ప్రవేశించిందని సుబ్రమణియన్ అన్నారు. ఏటా కోటి సీసాల నానో ఎరువుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కాకినాడ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే ఈ ఎరువులను గ్రోమోర్ నానో డీఏపీ, గ్రోమోర్ నానో యూరియా పేర్లతో మార్కెట్ చేయనుంది.

ఇన్‌స్టంట్ దోశ, ఇడ్లీ పిండిపై 18% జీఎస్‌టీ

న్యూఢిల్లీ: ఇన్‌స్టంట్ దోశ, ఇడ్లీ, గారెల పిండి మరింత భారం కానున్నాయి. ఈ ఉత్పత్తులు 18 శాతం జీఎస్‌టీ పరిధిలోకి వస్తాయని గుజరాత్ అప్పిలేట్ అథారిటీ ఫర్ అడ్వాన్స్ రూలింగ్ (జీఏఏఏఆర్) స్పష్టం చేసింది. ఉత్తర భారతంలో ఎక్కువగా వినియోగించే ఈ పిండి ఉత్పత్తులు ఐదు శాతం జీఎస్‌టీ పరిధిలోకి వస్తాయన్న కిచెన్ ఎక్స్‌ప్రెస్ ఓవర్సీస్ లిమిటెడ్ అనే కంపెనీ వాదనని జీఏఏఏఆర్ తోసిపుచ్చింది. ఇన్‌స్టంట్ ఇడ్లీ, దోశ, గారెల పిండి తయారీలో ఉప్పు, చక్కెర, కొన్ని మసాలా దినుసులు కలుపుతుండటంతో ఇవి 18 శాతం జీఎస్‌టీ పరిధిలోకే వస్తాయని స్పష్టం చేసింది.

కార్ల ఎగుమతుల్లో మారుతి జోరు

న్యూఢిల్లీ: భారత్ నుంచి కార్ల ఎగుమతులు గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో నికరంగా 2,67,708 యూనిట్ల మేరకు పెరిగినట్టు పరిశ్రమ గణాంకాలు తెలుపుతున్నాయి. పెరిగిన ఎగుమతుల్లో 70 శాతం వాటా మారుతి సుజుకీ కంపెనీదేనని అంటున్నారు. మారుతి కంపెనీ ఎగుమతులు నికరంగా 1,85,774 యూనిట్లు పెరిగాయి. దేశీయ కంపెనీలు 2020-21లో 4,04,397, 2021-22లో 5,77,875, 2022-23లో 6,62,703, 2023-24లో 6,72,105 కార్లను ఎగుమతి చేశాయి. కొత్తగా మరిన్ని మోడళ్లు ప్రవేశపెట్టడం, ప్రపంచ ప్రమాణాలకు కట్టుబడడం, టయోటాతో భాగస్వామ్యం తమకు కలిసి వచ్చిందని మారుతి సుజుకీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ భారతి అన్నారు.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	139	గోదావరి	141
వరంగల్	139	విజయవాడ	141
కరీంనగర్	139	గుంటూరు	141
మహబూబ్‌నగర్	139	ఒంగోలు	141
కర్నూలు	139	చిత్తూరు	154
విశాఖపట్నం	130		

అప్రమత్తతే మేలు !

ఈ వారం మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. ఇప్పటికే దేశీయ బెంచ్‌మార్క్ సూచీలు జీవితకాల గరిష్ఠాలకు చేరుకున్నాయి. మరికొంత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే వాల్యుయేషన్స్ పెరగటంతో సమీప భవిష్యత్తులో కరెక్షన్‌కు ఆస్కారం ఉంది. సూచీలు కరెక్షన్‌కు గురయితే విలువైన షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తే పెట్టుబడి పెట్టొచ్చు. ఈ వారం నిఫ్టీకి 23150 వద్ద మద్దతు స్థాయిలుండగా 23,400 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మళ్లీ పొజిషన్లు తీసుకుంటున్నారు.

స్టాక్ రికమండేషన్స్

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా: సుదీర్ఘకాలం అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ కౌంటర్‌లో ఈ మధ్యనే దిద్దుబాటు జరిగింది. మంచి బాటమ్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 9.47 శాతం లాభంతో రూ.76.85 వద్ద ముగిసి ఆల్‌టైమ్ హై బ్రేక్ చేసింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.77 స్థాయిలో ప్రవేశించి రూ.85/94 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.75 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

టాటా మోటార్స్: జీవితకాల గరిష్ఠానికి చేరిన ఈ షేరు ప్రస్తుతం కరెక్షన్ దశలో ఉంది. సైడ్‌వేస్‌లో సాగుతున్నప్పటికీ రిలేటివ్ స్ర్టెంత్ బాగానే ఉంది. ఈ షేరుకు రూ.950 స్థాయిలో కీలక మద్దతు లభించింది. గత శుక్రవారం ఈ షేరు 3 శాతం లాభంతో రూ.970 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.950/970 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,120 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.925 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

విప్రో: ఈ స్టాక్‌లో చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి మూడో వారం నుంచి పతనమవుతున్న ఈ షేరుకు రూ.441 వద్ద మద్దతు లభించింది. చివరి మూడు సెషన్లలో భారీ వాల్యూమ్స్‌తో క్యాండిల్స్ ఫామ్ అయ్యాయి. గత శుక్రవారం ఈ షేరు 5.11 శాతం లాభంతో రూ.484 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.480 శ్రేణిలో ప్రవేశించి రూ.525/555 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.460 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్: కొద్ది రోజుల క్రితం జీవితకాల గరిష్ఠాలను తాకిన ఈ షేర్లు ప్రస్తుతం స్వల్పకాల డౌన్‌ట్రెండ్‌లో ఉన్నాయి. అయితే చివరి మూడు సెషన్లలో బలమైన ప్రైస్ యాక్షన్ జరిగింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టడంతో అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేక్ అయ్యింది. గత శుక్రవారం ఈ షేరు 2.89 శాతం లాభంతో రూ.6,061 వద్ద స్థిరపడింది. ఈ కౌంటర్‌లో మూమెంటమ్ ఇన్వెస్టర్లు రూ.6,050 స్థాయిలో ఎంటరై రూ.6,190/6,225 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,010 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

టైటాన్: ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకున్న ఈ షేరు ఐదు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. అయితే రూ.3,200 స్థాయిలో కీలక మద్దతు లభించింది. డబుల్ బాటమ్ ఫామ్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 3.68 శాతం లాభంతో రూ.3,444 వద్ద ముగియటంతో బలమైన క్యాండిల్ ఏర్పడింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,440/3,420 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,380 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

23,350 స్థాయి కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో 730 పాయింట్ల లాభంతో 23,300 వరకు వెళ్లినా మంగళవారం బేరిష్‌గా మారి 2,000 పాయింట్ల భారీ నష్టంతో 21,300 వరకు దిగజారింది. కాని తదుపరి మూడు రోజుల్లో మంచి రికవరీ సాధించి చివరికి గత వారంతో పోల్చితే 760 పాయింట్ల లాభంతో 23,300 సమీపంలో జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ముగిసింది. మార్కెట్ గత వారం టెక్నికల్ పుల్‌బ్యాక్ అనంతరం ఈ కీలక స్థాయిలో నిలదొక్కుకోవడం పాజిటివ్ ట్రెండ్ సంకేతం. మిడ్‌క్యాప్-100 సూచీ ఇంట్రాడేలో 4,400 పాయింట్లు నష్టపోయినా చివరికి 1,500 పాయింట్ల లాభంతో ముగియగా స్మాల్‌క్యాప్-100 సూచీ 520 పాయింట్ల లాభంతో ముగిసింది. నిఫ్టీ ఈ వారంలో అప్రమత్త ధోరణిలో ప్రారంభమై గత వారం గరిష్ఠ స్థాయి 23,300 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: గత వారం ఆకస్మికంగా బలమైన బౌన్స్‌బ్యాక్ సాధించినందు వల్ల గరిష్ఠ స్థాయిలో కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. పాజిటివ్ ట్రెండ్ ఏర్పడినట్టయితే నిరోధ స్థాయి 23,350 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. ఆ పైన మరిన్ని కొత్త శిఖరాలకు ప్రయాణం సాగిస్తుంది. మానసిక అవధి 23,550.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ గత వారం 23,000 పాయింట్లను దాటినందు వల్ల సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. విఫలమైతే బలహీనతకు ఆస్కారం ఉంటుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 22,700, 22,450.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 5,000 పాయింట్ల మేరకు ఇంట్రా వీక్ కరెక్షన్ సాధించినా బౌన్స్‌బ్యాక్ సాధించి చివరికి 820 పాయింట్ల లాభంతో 49,900 వద్ద ముగిసింది. 50,000 పాయింట్ల వద్ద పరీక్ష ఎదుర్కొనబోతోంది. ఆ పైన నిలదొక్కుకున్నట్టయితే నిరోధ స్థాయిలు 50,600, 51,200. బలహీనపడితే ప్రధాన మద్దతు స్థాయి 49,000.

పాటర్న్: మార్కెట్ గత వారం కీలకమైన 100, 200 డిఎంఏల వద్ద రికవరీ సాధించింది. మరోసారి ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశించబోతోంది. 23,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద గట్టి మద్దతు ఉంది. అప్‌ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,310, 23,350
మద్దతు	23,200, 23,120

www.sundartrends.in



నెహ్రూ రికార్డు సమం

న్యూఢిల్లీ, జూన్ 9: భారత ప్రధానమంత్రిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇలా వరసగా రెండు సార్లు పూర్తిస్థాయిలో పదవిలో ఉండి, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం కేవలం భారత్‌లోనే కాదు.. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దేశాల్లోనూ రికార్డే. ఒక అధ్యయనం ప్రకారం.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రజాస్వామ్య ప్రపంచంలో ఇలా వరసగా మూడోసారి గెలుపొంది, ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏకైక నేత మోదీయే కావడం విశేషం. గత రెండు పర్యాయాలతో పాటు మూడోసారి కూడా స్థిరమైన ఓటు శాతంతో ఎన్నికల్లో గెలిచిన నాయకులు మరెవ్వరూ లేకపోవడం గమనార్హం. భారత దేశ ప్రజలు తొలి ప్రధాని నెహ్రూపై అచంచెల విశ్వాసం చూపారు. ఆయన్ను వరసగా మూడు సార్లు గెలిపించారు. వరసగా 1952, 1957, 1962 ఎన్నికల్లో నెహ్రూ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. ఆ తర్వాత మరే ప్రధానీ ఈ ఘనత సాధించలేదు. తాజాగా నరేంద్ర మోదీ.. ఆ రికార్డును సమం చేశారు.

ఆరెస్సెస్ నుంచి బీజేపీలోకి..

ఆరెస్సెస్, ఆ తర్వాత 1985 నుంచి బీజేపీతో రాజకీయ ప్రయాణం ప్రారంభించిన మోదీ.. అంచలంచెలుగా ఎదిగారు. 2001లో తొలిసారి గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన మోదీ.. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2012 వరకు తన నేతృత్వంలో గుజరాత్‌లో నాలుగుసార్లు బీజేపీ ప్రభుత్వాలను గద్దెనెక్కించారు. 2014లో ప్రధాని అభ్యర్థిగా బరిలో దిగి.. బీజేపీకి ఘన విజయాన్ని సాధించి పెట్టారు. 2019లో, తాజా ఎన్నికల్లో కూటమిని విజయతీరాలకు చేర్చి హ్యాట్రిక్ కొట్టారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా మూడో విడత పాలనలో తనదైన కార్యాచరణతో దూసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు.

● 2014 ఎన్నికల్లో మోదీ జాతీయ స్థాయిలో కమలం పార్టీకి సంపూర్ణ మెజారిటీ సాధించిపెట్టారు. 1984 తర్వాత ఆ ఘనత సాధించిన తొలి ప్రధానిగా గుర్తింపు పొందారు. 2014లో టైమ్ మేగజీన్ పాఠకుల పోల్‌లో 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే జమ్మూకశ్మీర్‌లో 'ఆర్టికల్ 370'ని రద్దు చేశారు. సీఏఏ, ట్రిపుల్ తలాక్ రద్దు, కొవిడ్ వ్యాక్సిన్ల పంపిణీ, అయోధ్యలో రామాలయ నిర్మాణం, కొత్త పార్లమెంటు భవనం, మహిళా రిజర్వేషన్లకు ఆమోదం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.



హ్యాట్రిక్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖులు, తాజా, మాజీ ముఖ్యమంత్రులు, పీఠాధిపతులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి నరేంద్ర మోదీ పేరును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలవగానే సభా ప్రాంగణమంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది. వేదిక ఎదుట ఆసీనులై ఉన్న వేలాది మందిని ఉద్దేశించి మోదీ గౌరవ వందనం చేసి ఆ తర్వాత ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 71 మంది మంత్రులు కూడా ప్రమాణం చేశారు. వారితో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిలో 60 మంది బీజేపీకి చెందినవారు కాగా 11 మంది ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందిన వారు. తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి క్యాబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయమంత్రిగా, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలుగుదేశం ఎంపీలు కింజరాపు రామ్మోహన్ నాయుడు కేబినెట్ మంత్రిగా, పెమ్మసాని చంద్రశేఖర్ సహాయమంత్రిగా, బీజేపీ ఎంపీ శ్రీనివాస వర్మ సహాయ మంత్రిగా ప్రమాణం చేశారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అయిదుగురికి మోదీ మూడో మంత్రివర్గంలో స్థానం దక్కినట్లయింది.

30 మంది క్యాబినెట్ మంత్రులు



ప్రమాణస్వీకార కార్యక్రమంలో బాబు, నితీశ్, పవన్ తదితరులు

మోదీ కొత్త మంత్రివర్గంలో 30మంది క్యాబినెట్ మంత్రులు, అయిదుగురు స్వతంత్ర హోదాలో సహాయమంత్రులు, 36 మంది సహాయమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మోదీతో కలిపి కేంద్ర మంత్రివర్గంలో మొత్తం 72 మందికి స్థానం లభించినట్లయ్యింది. కేరళ నుంచి ఎన్నికైన ఏకైక బీజేపీ ఎంపీ, సినీ నటుడు సురేశ్‌గోపీతో పాటు పార్టీలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న అదే రాష్ట్రానికి చెందిన క్రైస్తవ నేత కురియన్‌కు పార్లమెంటులో సభ్యత్వం లేనప్పటికీ మంత్రిపదవి ఇచ్చారు. పంజాబ్‌లోని లూధియానా నుంచి ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినప్పటికీ రవీందర్ సింగ్ బిట్టూకు మంత్రి వర్గంలో స్థానం కల్పించారు.

వీరికి మళ్లీ అవకాశం

మోదీ గత మంత్రివర్గంలో మంత్రులుగా ఉన్న పలువురికి ఈసారి కూడా పదవి లభించింది. వారిలో బీజేపీకి చెందిన రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, జయశంకర్, నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్‌పూరి, పీయూష్ గోయెల్, నితిన్ గడ్కరీ, మన్సుఖ్ మాండవీయ, అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్, ప్రహ్లాద్ జోషి, గజేంద్రసింగ్ షెకావత్, భూపేంద్ర యాదవ్, జ్యోతిరాదిత్య సింధియా, కిషన్‌రెడ్డి, గిరిరాజ్‌సింగ్, అన్నపూర్ణాదేవి, కిరెన్ రిజెజు, అర్జున్ రాం మేఘ్వాల్, శోభా కరంద్లాజే, నిత్యానందరాయ్, జితేంద్ర సింగ్, రావు ఇంద్రజిత్ సింగ్, ఎల్.మురుగన్, వీరేంద్రకుమార్, కిషన్ పాల్ గుజ్జర్, ఎస్పీ సింగ్ బఘేల్ ఉన్నారు. వీరితోపాటు అనుప్రియ పటేల్ (అప్నాదళ్), రాందాస్ అథావలే (రిపబ్లికన్ పార్టీ) తదితర మిత్రపక్షాల నేతలకు మళ్లీ మంత్రివర్గంలో అవకాశం లభించింది.

ఏడుగురు మాజీ సీఎంలకు చోటు

మోదీ కొత్త మంత్రివర్గంలో ఏడుగురు మాజీ సీఎంలకు చోటు దొరికింది. వారిలో శివరాజ్ సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్), మనోహర్ లాల్ ఖట్టర్ (హరియాణా), సర్బానంద సోనోవాల్ (అస్సాం), కుమారస్వామి (కర్ణాటక), జితన్‌రాంమాంఝీ (బిహార్), రాజ్‌నాథ్‌సింగ్ (యూపీ) ఉన్నారు. ప్రధాని మోదీ సైతం గతంలో గుజరాత్ సీఎంగా పని చేశారు కాబట్టి, ఆయనను కూడా కలుపుకొంటే మొత్తం ఏడుగురు మాజీ సీఎంలకు చోటు లభించినట్లయ్యింది.

యూపీ, బిహార్‌లకు అత్యధికం

ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ ఈసారి దెబ్బతిన్నప్పటికీ ఆ రాష్ట్రానికి 9 మంత్రిపదవులు కేటాయించడం గమనార్హం. బిహార్‌కు కూడా 8 పదవులు కేటాయించారు. మహారాష్ట్రకు 6, గుజరాత్‌కు 5, మధ్యప్రదేశ్‌కు 5, కర్ణాటకకు 5, రాజస్థాన్‌కు 5, ఒడిశాకు 2, ఏపీకి 3, తెలంగాణకు 2 మంత్రి పదవులు ఇచ్చారు. సామాజిక వర్గాల ప్రకారం చూస్తే 27 మంది బీసీలకు, 10 మంది ఎస్సీలకు, ఐదుగురు ఎస్టీలకు, ఐదుగురు మైనారిటీలకు అవకాశం లభించింది. ఏడుగురు మహిళలకు చోటు దొరికింది. మోదీ మంత్రివర్గంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు తొలినుంచి విధేయులుగా ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చారు. బీజేపీలోకి వలస వచ్చిన వారిని మంత్రివర్గంలో చేర్చుకోలేదు.

33 మందికి తొలిసారిగా అవకాశం

కొత్త కేబినెట్‌లో 33 మందికి తొలిసారిగా స్థానం లభించింది. కేంద్ర మంత్రులు అవ్వడం వీరికి ఇదే తొలిసారి. వీరిలో శివరాజ్ చౌహాన్, మనోహర్ ఖట్టర్, హెచ్‌డీ కుమారస్వామి, లలన్ సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్, జయంత చౌదరి, చిరాగ్ పాస్వాన్, సురేష్ గోపీ, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, శ్రీనివాస వర్మ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన మోదీకి, మంత్రులకు ఏపీ ప్రజల తరుపున టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు. వికసిత్ భారత్ దార్శనీకతకు అంకితమైన మోదీ తన పదవీ కాలాన్ని సంపూర్ణంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. దేశాభివృద్ధికి, శ్రేయస్సుకు, కొత్త శకానికి ఎన్డీయే ప్రభుత్వం నాంది పలుకుతుందన్నారు. కాగా, ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్ పక్కపక్కనే కూర్చున్నారు. అదే వరుసలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉన్నారు. విపక్షం నుంచి ఖర్గే ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

గత మంత్రివర్గంలోని 37 మందికి దక్కని చాన్స్

మోదీ గత ప్రభుత్వంలో మంత్రులు, సహాయ మంత్రులుగా పని చేసిన 37 మందికి నూతన మంత్రివర్గంలో చోటు దక్కలేదు. వీరిలో స్మృతీ ఇరానీ, అనురాగ్ ఠాకూర్, నారాయణ్ రాణే, పురుషోత్తమ్ రుపాలా, అర్జున్ ముండా, ఆర్కే సింగ్, వీకే సింగ్ తదితర ప్రముఖులు ఉన్నారు. గత క్యాబినెట్‌లో మంత్రులుగా పని చేసిన వారిలో 18 మంది ఈసారి ఎన్నికల్లో ఓడిపోయారు.

పలు దేశాల అధినేతలు

మోదీ ప్రమాణ స్వీకార వేడుకకు పొరుగు దేశాలైన శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జగన్నాథ్, భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గే, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అఫీఫ్ విచ్చేశారు.



హుందాగా, అణకువగా ఉండండి

పార్టీలకతీతంగా తోటి సభ్యులను గౌరవించండి

▸▸ నూతన కేబినెట్‌కు ప్రధాని మోదీ సూచనలు

న్యూఢిల్లీ, జూన్ 9: మంత్రులంతా ప్రజలకు నచ్చేలా అణకువగా, హుందాగా ఉండాలని, విధి నిర్వహణలో అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని కేంద్ర నూతన మంత్రి వర్గానికి ప్రధాని మోదీ సూచించారు. వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరేందుకు మంత్రి వర్గమంతా కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న సభ్యులకు భారత ప్రధానిగా మూడో సారి ప్రమాణ స్వీకారం చేసే ముందు నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం తేనేటి విందు ఇచ్చారు. 2014లో తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మోదీ ఈ తేనేటి విందు సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. పార్టీలకతీతంగా పార్లమెంట్ సభ్యులు అందరికీ మంత్రులు సముచిత గౌరవం ఇవ్వాలని మోదీ ఈ సందర్భంగా ఎంపీలకు స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా వంద రోజుల కార్యాచరణ సిద్ధం చేసుకుని దానికి అనుగుణంగా పని చేసేందుకు మంత్రులంతా సిద్ధం కావాలని కోరారు. మరోవైపు, వరుసగా మూడో సారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే ముందు మహాత్మాగాంధీ. బీజేపీ నేత అటల్ బిహారీ వాజపేయికి మోదీ ఆదివారం నివాళులర్పించారు. ఆ తర్వాత ఇండియా గేట్ వద్ద జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి నివాళులర్పించారు.



సహాయ మంత్రి పదవి మాకొద్దు

మంత్రివర్గ కూర్పులో భాగంగా బీజేపీ నాయకత్వం తమకు కేటాయించిన కేంద్ర సహాయ మంత్రి(ఇండిపెండెంట్ చార్జ్) పదవిని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(అజిత్‌పవార్) తిరస్కరించింది. గతంలో కేంద్ర మంత్రిగా పని చేసిన తనకు సహాయ మంత్రి ఇవ్వడం పట్ల ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తన స్థాయిని తగ్గించడమేనని ఎన్సీపీ అధిష్ఠానానికి స్పష్టం చేశారు.

తరలివచ్చిన పారిశ్రామిక వేత్తలు, సినీ ప్రముఖులు

మోదీ ప్రమాణ స్వీకరాత్సోవానికి పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులు తరలివచ్చారు. పారిశ్రామిక వేత్తలు గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ, సినీ నటులు రజనీకాంత్, షారుఖ్ ఖాన్, అక్షయ్ కుమార్, అనిల్ కపూర్, అనుపమ్ ఖేర్, రవీనా టాండన్, బాలీవుడ్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నేత షీలా రషీద్ కూడా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. ట్రాన్స్‌జెండర్ వర్గానికి చెందిన పలువురు ప్రముఖులు, పారిశుధ్య కార్మికులు, కొత్త పార్లమెంటు భవన నిర్మాణ కార్మికులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రధాని ప్రమాణ స్వీకారోత్సవానికి ట్రాన్స్‌జెండర్లు హాజరు కావడం ఇదే తొలిసారి.

బీజేపీ కొత్త సారథి ఎవరు?

▸▸ క్యాబినెట్‌లోకి పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా

న్యూఢిల్లీ, జూన్ 9: కేంద్ర మంత్రివర్గం ఏర్పాటు నేపథ్యంలో బీజేపీలో సంస్థాగతంగా మార్పులు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇంతకాలం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డాను క్యాబినెట్‌లోకి తీసుకోవటంతో ఆయన స్థానంలో ఎవరికి పార్టీ సారథ్య బాధ్యతలు అప్పగిస్తారన్నది ఆసక్తిదాయకంగా మారింది. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, హరియాణా మాజీ సీఎం ఖట్టర్‌లలో ఒకరిని పార్టీ అధ్యక్షుడిగా నియమించవచ్చని ఊహాగానాలు వెలువడినప్పటికీ.. వారిద్దరిని కూడా కేంద్ర క్యాబినెట్‌లోకి తీసుకోవటంతో వాటికి తెరపడింది. దీంతో బీజేపీ కొత్త సారథి ఎవరన్న చర్చ కొనసాగుతోంది. మరోవైపు, ఒడిశాలో అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన బీజేపీ అక్కడ ఎవరిని ముఖ్యమంత్రిగా నియమిస్తుందన్న అంశం కూడా కొంతకాలంగా హాట్‌టాపిక్‌గా మారింది. ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆ అవకాశం ఉందని బీజేపీ వర్గాలు పేర్కొన్నప్పటికీ.. ఆయనకు కూడా మోదీ టీంలో స్థానం లభించటంతో ఒడిశా సీఎం పదవిపై సస్పెన్స్ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో సీనియర్ బీజేపీ నేత సురేశ్ పుజారీ పేరు తెరపైకి వచ్చింది. సురేశ్ పుజారీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా ఎన్నికయ్యారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయనకు ఢిల్లీ నుంచి పిలుపు రావటంతో సీఎం పదవి పుజారీనే వరించనుందని పలువురు భావిస్తున్నారు. ఈ నెల 11న ఒడిశా శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. దీంట్లో సీఎం ఎవరనేది తేలనుంది. కేంద్ర మంత్రి వర్గంలో మళ్లీ అవకాశం లభించిన పలువురు మంత్రుల శాఖలు మారుతాయన్న అంచనాలు కూడా ఉన్నాయి.



మోదీ నూతన మంత్రివర్గం ఇదే

కేబినెట్ మంత్రులు

నరేంద్రమోదీ - ప్రధానమంత్రి

1. రాజ్‌నాథ్ సింగ్(బీజేపీ)
2. అమిత్ షా(బీజేపీ)
3. నితిన్ గడ్కరీ(బీజేపీ)
4. జగత్ ప్రకాశ్ నడ్డా(బీజేపీ)
5. శివరాజ్ సింగ్ చౌహాన్(బీజేపీ)
6. నిర్మలా సీతారామన్(బీజేపీ)
7. ఎస్. జయశంకర్(బీజేపీ)
8. మనోహర్ లాల్ ఖట్టర్(బీజేపీ)
9. హెచ్‌డీ కుమార స్వామి(జేడీ-ఎస్)
10. పీయూష్ గోయెల్(బీజేపీ)
11. ధర్మేంద్ర ప్రధాన్(బీజేపీ)
12. జితన్ రాం మాంఝీ(హెచ్ఏఎం)
13. రాజీవ్ రంజన్ సింగ్(జనతాదళ్-యు)
14. సర్బానంద సోనోవాల్(బీజేపీ)
15. వీరేంద్ర కుమార్(బీజేపీ)
16. కింజరాపు రామ్మోహన్ నాయుడు(టీడీపీ)
17. ప్రహ్లాద్ జోషి(బీజేపీ)
18. జ్యుయల్ ఒరామ్(బీజేపీ)
19. గిరిరాజ్ సింగ్(బీజేపీ)
20. అశ్వినీ వైష్ణవ్(బీజేపీ)
21. జ్యోతిరాదిత్య సింధియా(బీజేపీ)
22. భూపేంద్ర యాదవ్(బీజేపీ)
23. గజేంద్ర సింగ్ షెఖావత్(బీజేపీ)
24. అన్నపూర్ణా దేవి(బీజేపీ)
25. కిరణ్ రిజిజు(బీజేపీ)
26. హర్దీప్ సింగ్ పురి(బీజేపీ)
27. మన్సుఖ్ మాండవీయ(బీజేపీ)
28. జి. కిషన్ రెడ్డి(బీజేపీ)
29. చిరాగ్ పశ్వాన్(లోక్ జనశక్తి)
30. సీఆర్ పాటిల్(బీజేపీ)

సహాయ మంత్రులు(స్వతంత్ర)

31. రావు ఇంద్రజిత్ సింగ్(బీజేపీ)
32. జితేంద్ర సింగ్(బీజేపీ)
33. అర్జున్ రాం మేఘ్వాల్(బీజేపీ)
34. ప్రతాప్‌రావు గణపత్‌రావు జాదవ్(శివసేన)
35. జయంత్ చౌదరి(రాష్ట్రీయ లోక్ దళ్)

సహాయ మంత్రులు

36. జితిన్ ప్రసాద(బీజేపీ)
37. శ్రీపాద యశో నాయక్(బీజేపీ)
38. పంకజ్ చౌదరి(బీజేపీ)
39. క్రిషన్ పాల్ గుజ్జర్(బీజేపీ)
40. రాందాస్ అథావలే(రిపబ్లిక్ పార్టీ)
41. రాంనాథ్ ఠాకూర్(జేడీ-యు)
42. నిత్యానంద్ రాయ్(బీజేపీ)
43. అనుప్రియ పటేల్(అప్నాదళ్)
44. వి. సోమన్న(బీజేపీ)
45. పెమ్మసాని చంద్రశేఖర్(తెలుగుదేశం)
46. ఎస్.పి. సింగ్ బఘేల్(బీజేపీ)
47. శోభా కరంద్లాజే(బీజేపీ)
48. కీర్తివర్ధన్ సింగ్(బీజేపీ)
49. బీఎల్ వర్మ(బీజేపీ)
50. శంతను ఠాకూర్(బీజేపీ)
51. సురేశ్ గోపి(బీజేపీ)
52. ఎల్. మురుగన్(బీజేపీ)
53. అజయ్ టమ్టా(బీజేపీ)
54. బండి సంజయ్ కుమార్(బీజేపీ)
55. కమ్లేశ్ పశ్వాన్(బీజేపీ)
56. భగీరథ్ చౌదరి(బీజేపీ)
57. సతీష్ చంద్ర దుబే(బీజేపీ)
58. సంజయ్ సేథ్(బీజేపీ)
59. రవ్నీత్ సింగ్ బిట్టూ(బీజేపీ)
60. దుర్గాదాస్ ఉయికే(బీజేపీ)
61. రక్షా నిఖిల్ ఖడ్సే(బీజేపీ)
62. సుకాంత మజుందార్(బీజేపీ)
63. సావిత్రి ఠాకూర్(బీజేపీ)
64. టోకన్ సాహూ(బీజేపీ)
65. రాజ్ భూషణ్ చౌదరి(బీజేపీ)
66. భూపతిరాజు శ్రీనివాస వర్మ(బీజేపీ)
67. హర్ష్ మల్హోత్రా(బీజేపీ)
68. నీమూబెన్ బంభనియా(బీజేపీ)
69. మురళీధర్ మహోల్(బీజేపీ)
70. జార్జి కురియన్(బీజేపీ)
71. పవిత్ర మార్గరిటా(బీజేపీ)

మీ గొంతునవుతా!

నీట్ కుంభకోణంపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తా

▸▸ విద్యార్థులకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ

న్యూఢిల్లీ, జూన్ 9: నీట్-2024 రగడ దేశాన్ని కుదిపేస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందని ఫలితాలు విడుదలైనప్పటి నుంచి విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తోంది. తాజాగా ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ.. నీట్ కుంభకోణంపై ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు ఎక్కుపెట్టారు. ఈ అంశంపై పార్లమెంటులో విద్యార్థుల గొంతుకగా నిలిచి మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తానని స్పష్టం చేశారు. "నరేంద్ర మోదీ ఇంకా ప్రమాణ స్వీకారం చేయనే లేదు. నీట్ కుంభకోణం వల్ల లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయి. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురు గరిష్ఠ మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. చాలామందికి సాంకేతికంగా సాధ్యంకాని మార్కులు వచ్చాయి. ఇంత జరిగినా పేపర్ లీకేజీ వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండిస్తూనే ఉంది. దీనిపై చట్టం చేయడం ద్వారా పేపర్ లీకేజీల సమస్యల నుంచి విద్యార్థులను విముక్తులను చేస్తామని మా మేనిఫెస్టోలో హామీ కూడా ఇచ్చాం. ఈ రోజు దేశంలోని విద్యార్థులందరికీ నేను మరోసారి హామీ ఇస్తున్నాను. పార్లమెంటులో నేను మీ గొంతుగా ఉంటాను. మీ భవిష్యత్తును ప్రభావితం చేసే సమస్యలను బలంగా లేవనెత్తుతా" అని మోదీ ప్రమాణ స్వీకారానికి ముందు ఎక్స్ (ట్విటర్)లో రాహుల్ ట్వీట్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును బీజేపీ నాశనం చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఆరోపించారు. నీట్-2024 అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ శనివారం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శి కె సంజయ్‌కు లేఖరాశానని ఆయన చెప్పారు. కాగా, కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు ఇతర పార్టీలు కూడా గొంతు కలిపాయి. నీట్ కుంభకోణంపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి. నీట్ వివాదం నేపథ్యంలో.. కేంద్రం ఇప్పటికే నలుగురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.



పదేళ్ల తర్వాత లోక్‌సభలో విపక్ష నేత

▸▸ కాంగ్రెస్‌కు తగిన సీట్లు రావడంతో దక్కనున్న హోదా!

న్యూఢిల్లీ, జూన్ 9: కీలకమైన 'లోక్‌సభలో ప్రతిపక్ష నేత' స్థానం పదేళ్ల తర్వాత భర్తీ కానుంది. గత రెండుసార్లు కాంగ్రెస్ సహా మరే పార్టీ కనీస సంఖ్యలో సీట్లు సాధించకపోవడంతో ఈ పదవి ఖాళీగా ఉంది. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ 100 స్థానాల్లో నెగ్గడంతో అర్హత సాధించింది. లోక్‌సభ మొత్తం సభ్యుల సంఖ్య 543 కాగా.. ఇందులో పది శాతం (54) సీట్లు గెలిచిన పార్టీకి ప్రతిపక్ష నేత పదవిని పొందే అవకాశం ఉంటుంది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ 44 సీట్లనే సాధించింది. 2019లో 52 స్థానాలతో సరిపెట్టుకుంది. కాగా, రాహుల్ గాంధీ విపక్ష నేతగా ఉండాలని సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా తీర్మానించింది. బీజేపీ విధానాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లిన రాహుల్ ప్రధాని మోదీకి దీటైన నాయకుడిగా ఎదిగారని కాంగ్రెస్ పేర్కొంటోంది. మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదా పరంగానూ ప్రాధాన్యం ఉన్నది. సభలో సీట్లు, పార్లమెంటులో గదుల కేటాయింపు, అధికారిక దస్త్రాలను పొందే అవకాశం, పార్లమెంటరీ కమిటీల ఏర్పాటు, రోజువారీ సభా వ్యవహారాల్లో ఈ పదవి చాలా ముఖ్యం. అన్నిటికి మించి సీబీఐ, సీవీసీ, ఎన్నికల సంఘం, కేంద్ర సమాచార కమిషనర్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ వంటి అత్యంత ముఖ్యమైన పదవుల నియామక కమిటీల్లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యుడిగా ఉంటారు. ఇక గత లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ లేకుండానే ముగిసింది. ఈసారి మాత్రం ఆ పదవిని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఇండియా కూటమి పట్టుదలగా ఉంది.

రాజకీయాలకు పాండ్యన్ బైబై

ఒడిశాలో బీజేడీ ఓటమితో నిర్ణయం

భువనేశ్వర్, జూన్ 9: ఒడిశాలో మాజీ బ్యూరోక్రాట్ వీకే పాండ్యన్ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. నవీన్ పట్నాయక్‌కు సహాయపడే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, అందుకే 2024 ఎన్నికల్లో పోటీ చేయలేదని తెలిపారు. ఇప్పుడు రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నానని, ఈ ప్రయాణంలో ఎవరినైనా నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు. అలాగే తనకు వ్యతిరేకంగా జరిగిన ప్రచారం బీజేడీ ఓటమిలో పాత్ర పోషించి ఉంటే అందుకు కూడా ప్రజలు, బీజేడీ కార్యకర్తలు తనను క్షమించాలని కోరారు. కాగా, పాండ్యన్‌పై వస్తున్న విమర్శలు దురదృష్టకరమని నవీన్ పట్నాయక్ తన సన్నిహితుడిని వెనకేసుకొచ్చారు. పాండ్యన్ తన వారసుడు కాదని, తన వారసుడిని రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారని నవీన్ స్పష్టం చేశారు. కాగా, ఎన్నికల్లో పట్నాయక్ ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని పాండ్యన్ గతంలో ప్రకటించారు.

యాత్రికుల బస్సుపై ఉగ్ర దాడి

▸▸ లోయలోకి బస్సు.. 10 మంది మృతి

జమ్మూ, జూన్ 9: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడ్డారు. యాత్రికులతో వెళ్తున్న బస్సుపై కాల్పులకు తెగబడ్డారు. రియాసీ జిల్లాలోని శివ్ ఖోడీ ఆలయాన్ని సందర్శించుకున్న యాత్రికులు కాత్రాకు వెళ్తుండగా ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో పోని ప్రాంతంలోని తెర్యాత్ గ్రామం వద్ద ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఫలితంగా బస్సు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో పది మంది యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా 33 మంది గాయపడ్డారు. కాగా, ఎత్తైన ప్రాంతంలో నక్కిన ఉగ్రవాదులు కాల్పులు జరపడం.. బస్సు లోయలోకి దొర్లుకుంటూ పడిపోవడం క్షణాల్లోనే జరిగిపోయాయి. స్థానికులతో కలిసి పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు. రాత్రి 8 గంటల సమయానికి గాయపడ్డ యాత్రికులందర్నీ బయటకు తీసుకొచ్చారు. కాగా, ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాని మోదీ పరిస్థితిని సమీక్షించారు. దాడికి బాధ్యులైనవారిని విడిచిపెట్టేది లేదని కేంద్ర మంత్రి అమిత్ షా హెచ్చరించారు. ప్రధాని మోదీ, మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో, పలు దేశాల అధిపతులు వచ్చిన సందర్భంలో ఈ దాడి జరగడం దారుణమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యానించారు.



కొత్త క్యాబినెట్ మంత్రులు

అమిత్ షా..

బీజేపీలో కీలక నేతగా ఉన్న అమిత్ షా.. గత ప్రభుత్వంలో నంబర్-2గా వ్యవహరించారు. ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితుడిగా, హోంశాఖ మంత్రిగా ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ వంటి కీలక నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. ఏబీవీపీ, బీజేవైఎం కార్యకర్తగా, ఆర్ఎస్ఎస్‌లో స్వయం సేవక్‌గా పని చేసిన అమిత్ షా.. గుజరాత్ రాజకీయాల్లో అప్పట్లో ముఖ్యమంత్రిగా పనిచేసిన మోదీ వెంట నడిచారు. మోదీ ప్రధాని అయ్యాక బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి.. రెండోసారి ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అయ్యారు.

రాజ్‌నాథ్‌సింగ్..

మోదీ కేబినెట్‌లో మరోసారి చోటు దక్కించుకున్న 72 ఏళ్ల రాజ్‌నాథ్‌సింగ్‌ది సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర. 1974లో రాజకీయాల్లో అడుగుపెట్టిన రాజ్‌నాథ్.. ఉత్తర భారతంలో బీజేపీ ఎదుగుదలలో కీలకపాత్ర పోషించారు. గతంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగానూ పనిచేయడంతోపాటు 2003లో వాజపేయి ప్రభుత్వంలోనూ కేంద్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014 నుంచి వరుసగా మూడోసారి మోదీ కేబినెట్‌లో కొనసాగుతున్నారు.

నితిన్ గడ్కరీ..

బీజేపీ మాజీ అధ్యక్షుడిగా, ఆర్ఎస్ఎస్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలున్న గడ్కరీ.. వరుసగా పదేళ్లపాటు రవాణా, హైవేల శాఖ మంత్రిగా పని చేసి 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరు పొందారు. దేశ వ్యాప్తంగా 90 వేల కిలోమీటర్ల నేషనల్ హైవేలు, 30 వేల కిలోమీటర్ల మేర కొత్త రోడ్లు నిర్మింపజేశారు. కాలం కలిసివస్తే ప్రధానమంత్రి అవుతారన్న ప్రచారం జరిగిన గడ్కరీ.. నాగ్‌పూర్ నుంచి వరుసగా మూడోసారి ఎంపీగా గెలిచారు.

జేపీ నడ్డా..

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా వరుసగా నాలుగేళ్లపాటు కొనసాగిన జేపీ నడ్డా తిరిగి కేంద్ర మంత్రివర్గంలోకి అడుగుపెట్టారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన నడ్డా గతంలో 2014 నుంచి 2019 వరకు కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న నడ్డా.. 2020లో నాటి అధ్యక్షుడు అమిత్ షా కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో అధ్యక్షుడిగా ప్రమోట్ అయ్యారు. మోదీ, అమిత్ షాలకు నడ్డా అత్యంత సన్నిహితుడు.

శివరాజ్‌సింగ్ చౌహాన్..

మధ్యప్రదేశ్ సీఎంగా నాలుగు సార్లు పనిచేసిన శివరాజ్ చౌహాన్.. తొలిసారి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బలహీనవర్గాలకు ఆప్తుడిగా మధ్యప్రదేశ్ ప్రజలు 'మామ' పిలుచుకునే శివరాజ్‌సింగ్ 13వ ఏట ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి సీఎం అయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తన సారథ్యంలో బీజేపీ గెలిచినా శివరాజ్‌కు సీఎం పదవి ఇవ్వకుండా పక్కన పెట్టిన పార్టీ నాయకత్వం.. తాజాగా ఆయనను కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంది.

నిర్మలా సీతారామన్..

స్వతంత్ర భారతదేశంలో పూర్తిస్థాయి ఆర్థికమంత్రిగా పనిచేసిన మహిళగా గుర్తింపు పొందిన నిర్మలా సీతారామన్.. వరుసగా మూడోసారి కేంద్ర మంత్రి పదవి చేపట్టారు. మదురైలో జన్మించిన నిర్మల రాజకీయాల్లోకి రాక ముందు బ్రిటన్‌లో కార్పొరేట్ సంస్థల్లో పనిచేశారు. 2008లో బీజేపీలో చేరారు. 2017లో రక్షణమంత్రిగా మోదీ కేబినెట్‌లో చేరారు. 2019 నుంచి ఆర్థికమంత్రిగా ఉన్నారు.

ఎస్.జైశంకర్..

దౌత్యవేత్త నుంచి రాజకీయవేత్తగా మారిన ఎస్.జైశంకర్.. పలు అంతర్జాతీయ వేదికల్లో భారత విదేశాంగ విధానాలను సమర్థంగా వినిపించడం ద్వారా గుర్తింపు పొందారు. గుజరాత్‌కు చెందిన జైశంకర్.. 2015 నుంచి 2018 వరకు మోదీ తొలి ప్రభుత్వ హయాంలో విదేశాంగ కార్యదర్శిగా పని చేశారు. అనంతరం మోదీ ఆయనను రాజ్యసభ సభ్యుడిని చేసి గత ప్రభుత్వంలో విదేశీ వ్యవహారాల మంత్రిని చేశారు.

మనోహర్‌లాల్ ఖట్టర్..

70 ఏళ్ల మనోహర్‌లాల్ ఖట్టర్ ఎంపీగా ఎన్నికైన తొలిసారే కేంద్ర మంత్రి అయ్యారు. అంతకుముందు 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై హరియాణ ముఖ్యమంత్రి అయ్యారు.

హెచ్‌డీ కుమారస్వామి..

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ నేత కుమారస్వామి.. బీజేపీతో చేతులు కలపడం ద్వారా అటు సంక్షోభంలో ఉన్న తన పార్టీని కాపాడుకోవడంతోపాటు కేంద్ర మంత్రి పదవిని దక్కించుకున్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడైన కుమారస్వామి.. గతంలో రెండుసార్లు కర్ణాటక ముఖ్యమంత్రిగా సంకీర్ణ ప్రభుత్వాలకు సారథ్యం వహించారు.

పీయూష్ గోయెల్

59 ఏళ్ల పీయూష్ గోయెల్ వరుసగా మూడోసారి కేంద్ర మంత్రి పదవి చేపట్టినా.. లోక్‌సభకు ఎన్నికవడం మాత్రం ఇదే తొలిసారి. ముంబై నార్త్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన గోయెల్.. గతంలో రాజ్యసభ సభ్యుడిగా ఉంటూ మంత్రి అయ్యారు. గత ప్రభుత్వంలో వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రిగా కీలకంగా వ్యవహరించారు.

ధర్మేంద్ర ప్రధాన్..

సుదీర్ఘకాలం పెట్రోలియం శాఖ మంత్రిగా పనిచేసిన ఒడిసా నేత ధర్మేంద్ర ప్రధాన్ వరుసగా మూడోసారి కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఒడిసాలో బీజేపీకి కీలక నేతగా ఉన్న ప్రధాన్.. 15 ఏళ్ల తరువాత లోక్‌సభకు ఎన్నికయ్యారు.

జీతన్‌రాం మాంఝీ..

బిహార్‌కు చెందిన దళిత నేత, హిందూస్థాన్ ఆవమ్ మోర్చా అధ్యక్షుడు జీతన్‌రాం మాంఝీ సుమారు 80 ఏళ్ల వయసులో తొలిసారి లోక్‌సభకు ఎన్నికై కేంద్ర మంత్రి అయ్యారు. గతంలో జేడీయూలో ఉన్న మాంఝీ 2014లో బిహార్ సీఎంగా నియమితులై.. 2015 వరకు పనిచేశారు.

రాజీవ్‌రంజన్‌సింగ్..

బిహార్ సీఎం, జేడీయూ అధ్యక్షుడు నీతీశ్‌కుమార్‌కు సన్నిహితుడైన రాజీవ్‌రంజన్‌సింగ్ అలియాస్ లలన్‌సింగ్ మూడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 2022లో జేడీయూలోను తిరిగి ఎన్‌డీఏలో చేరేలా ఒప్పించిన నేతగా లలన్‌సింగ్‌ను చెబుతుంటారు.

సర్బానంద సోనోవాల్..

వరుసగా మూడోసారి కేంద్ర మంత్రి పదవి చేపట్టారు. గతంలో అసోం సీఎంగా పనిచేసిన సోనోవాల్.. విద్యార్థి రాజకీయాల నుంచే ఫైర్‌బ్రాండ్ నేతగా పేరుపొందారు. మోదీ 2.0 ప్రభుత్వంలో తొలుత సహాయ మంత్రిగా పనిచేసి.. 2021లో కేబినెట్ మంత్రిగా ప్రమోషన్ పొందారు.

వీరేంద్రకుమార్..

ఎనిమిదోసారి ఎంపీగా ఎన్నికైన మధ్యప్రదేశ్‌కు చెందిన దళిత నేత, 70 ఏళ్ల వీరేంద్ర మరోసారి కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.. బాల్యంలో తన తండ్రితో కలిసి సైకిల్ పంక్చర్ షాపులో పనిచేసేవారు. కేంద్ర మంత్రి అయ్యాక కూడా తన మూలాలు మరువని నేతగా ఆయనకు పేరుంది.

ప్రహ్లాద్ జోషి..

ఆర్ఎస్ఎస్‌లో కీలక వ్యక్తిగా, మోదీ, అమిత్‌షాలకు సన్నిహితుడిగా కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషికి పేరుంది. గత ప్రభుత్వంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా సమర్థంగా పనిచేసిన గుర్తింపు ఉంది.

జ్యుయల్ ఓరమ్..

ఒడిసాకు చెందిన గిరిజన నేత. ఆరోసారి ఎంపీగా గెలిచారు. 2014లో మోదీ ప్రభుత్వంలో గిరిజన వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. మోదీ 2.0లో మంత్రిగా అవకాశం దక్కకపోయినా.. తాజాగా ఒడిసాలో బీజేపీ ఘనవిజయంతో ఓరమ్‌కు మళ్లీ కేంద్రం నుంచి పిలుపొచ్చింది.

గిరిరాజ్‌సింగ్..

హిందుత్వవాదిగా, వివాదాస్పద వ్యాఖ్యలకు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకొనే గిరిరాజ్ సింగ్ వరుసగా రెండోసార కేబినెట్ బెర్తు దక్కించుకున్నారు. గతంలో ఆయన బిహార్ రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

అశ్వినీ వైష్ణవ్..

ఉన్నతాధికారి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన అశ్వినీ వైష్ణవ్ మరోసారి ప్రధాని మోదీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. ఒడిసాకు చెందిన మాజీ ఐఏఎస్.. 20121లో తొలిసారి మోదీ కేబినెట్‌లో చేరి రైల్వేలు, కమ్యూనికేషన్లు వంటి కీలకశాఖలు నిర్వహించారు.

జ్యోతిరాదిత్య సింధియా..

కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి 2020లో పౌరవిమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన జ్యోతిరాదిత్య సిందియా మరోసారి కేంద్ర మంత్రి అయ్యారు. మధ్యప్రదేశ్‌లోని గుణ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు.

భూపేంద్రయాదవ్..

పార్టీ వ్యూహకమిటీలో సభ్యుడిగా వ్యవహరించారు. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు పరిశీలకుడిగా వ్యవహరించి బీజేపీని గెలుపు బాటలో నడిపించారు. 2021లో తొలిసారిగా, తాజాగా మరోసారి కేంద్ర మంత్రి అయ్యారు.

గజేంద్రసింగ్ షెకావత్

2014లో రాజస్థాన్ సీఎం అశోక్ గహ్లోత్ కుమారుడిపై ఎంపీగా గెలుపొంది మోదీ ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టారు. అనంతరం 2019లో, తాజాగా కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు.

అన్నపూర్ణాదేవి..

ఝార్ఖండ్‌లో ఓబీసీ వర్గానికి చెందిన ఒకప్పటి ఆర్జేడీ నేత రమేశ్‌యాదవ్ భార్య అయిన అన్నపూర్ణాదేవి.. తన భర్త మరణంతో 1998లో అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. అనంతరం బీజేపీలో చేరి ఎంపీగా గెలుపొందారు. 2021లో ఆమెకు మోదీ కేబినెట్‌లో చోటు కల్పించారు. ఇప్పుడు మరోసారి అవకాశం ఇచ్చారు.

కిరెన్ రిజిజు..

న్యాయశాస్త్ర విద్యార్థి నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగిన అరుణాచల్ ప్రదేశ్ నేత. కాంగ్రెస్‌తో రాజకీయ జీవితం ప్రారంభించారు. 2014లో బీజేపీలో చేరి ఎంపీగా గెలుపొందారు. 2014లో న్యాయశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2019లోనూ అదే పదవిలో చేపట్టి 2021లో మంత్రిగా ప్రమోషన్ పొందారు.

హర్‌దీప్‌సింగ్ పురి..

మాజీ ఐఎఫ్ఎస్ అధికారి అయిన 72 ఏళ్ల హర్‌దీప్ సింగ్.. 2019లో సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి.. తన పనితీరుతో 2021లో కేబినెట్ మంత్రిగా ప్రమోషన్ పొందారు. ఇప్పుడు మరోసారి బెర్తు దక్కించుకున్నారు.

మన్సుక్ మాండవీయ..

ఆరోగ్యశాఖ మంత్రిగా కొవిడ్ సమయంలో సమర్థంగా వ్యవహరించి ప్రధాని మోదీ మన్ననలు పొందారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న మాండవీయ.. తాజా ఎన్నికల్లో గుజరాత్‌లోని పోరుబందర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

చిరాగ్ పాసవాన్..

ఎల్‌జేపీ వ్యవస్థాపకుడు రాంవిలాస్ పాసవాన్ కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చిన చిరాగ్.. తొలిసారి కేంద్ర మంత్రి అయ్యారు. మోదీకి హనుమంతుడి లాంటివాడిని చెప్పుకొనే చిరాగ్ రెండోసారి లోక్‌సభకుఎన్నికయ్యారు.

సీఆర్ పాటిల్..

గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో గుజరాత్‌లో పార్టీని విజయపథంలో నడిపించిన వ్యక్తిగా మోదీ కేబినెట్‌లో చోటుదక్కించుకున్నారు.

ఎర్రన్న వారసుడిగా!

తండ్రి అడుగుజాడల్లోనే రామ్మోహన్‌నాయుడు



శ్రీకాకుళం ఎంపీగా హ్యాట్రిక్ విజయం

న్యూఢిల్లీ/శ్రీకాకుళం/గుంటూరు/భీమవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ యువనేత కింజరాపు రామ్మోహన్‌నాయుడు (37) టీడీపీ సీనియర్ నేతల్లో అగ్రగణ్యుడు, కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడి కుమారుడు. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ఆయ న.. అతి చిన్న వయసులో రాజకీయాల్లోకి వచ్చారు. 2013లో శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గమంతా సైకిల్ ర్యాలీ నిర్వహించి తనకంటూ గుర్తింపు సాధించారు. ప్రజాసమస్యలపై స్పందించి పట్టుపెంచుకున్నారు. పార్టీలో అనతికాలంలోనే కీలక నాయకుడిగా ఎదిగారు. పార్టీ అధినేత చంద్రబాబుకు స న్నిహితుడయ్యారు. 2013 అక్టోబరులో ఆంధ్రప్రదేశ్ విభజన అంశంపై ఆయనకు మద్దతుగా ఢిల్లీలో నిరాహార దీక్ష కూడా చేశారు. 2014లో తొలిసారి శ్రీకాకుళం లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి గెలిచారు. అక్కడ వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. ఈసారి 3.27 లక్షల భారీ మెజారిటీతో గెలవడం విశేషం. 1987 డిసెంబరు 18న జన్మించిన ఈయన మోదీ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడు (ఈయనతో పాటు కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రక్ష నిఖిల్ ఖడ్సే 1987 మే 13న పుట్టారు). రామ్మోహన్‌కు భార్య శ్రావ్య, కుమార్తె ఉన్నారు. ఆయన యూఎస్ఏలో పుర్డ్యూ యూనివర్సిటీలో బీ-టెక్ పూర్తిచేశారు. న్యూయార్క్‌లో ఐలాండ్ యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. ఆంగ్లం, హిందీల్లో అనర్గళంగా ప్రసంగించగలరు. తండ్రిలాగే తాను కూడా కేంద్ర మంత్రి అయ్యారు. కాగా.. ఆయన బాబాయి అచ్చెన్నాయుడు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో టెక్కలి నుంచి గెలిచారు. సోదరి, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త ఆదిరెడ్డి వాసు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇక రామ్మోహన్ భార్య తండ్రి మాజీ మంత్రి బండారు సంత్యనారాయణ మూర్తి కూడా అనకాపల్లి జిల్లా మాడుగుల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఈ దఫా ఎక్కువ మంది వస్తామని..

గత ఏడాది లోక్‌సభలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు కొన్ని నిమిషాల సమయం కావాలని స్పీకర్‌ను కోరారు. అయితే చాలా తక్కువ సమయం ఇవ్వడంతో.. వచ్చే దఫా టీడీపీ నుంచి అధిక ఎంపీలు బంపర్ మెజారిటీతో వస్తారని.. అప్పుడు అడిగినంత సమయం ఇస్తారని ఆయన స్పీకర్‌తో అన్నారు. తాజా లోక్‌సభలో ఎన్డీయేలో బీజేపీ (240) తర్వాత అతిపెద్ద పార్టీ (16) టీడీపీయేనన్న సంగతి తెలిసిందే.

ఇది రాష్ట్ర ప్రజల విజయం: రామ్మోహన్

తనకు కేంద్ర మంత్రి పదవి దక్కడం ఆంధ్ర ప్రజల విజయమని రామ్మోహన్‌నాయుడు అన్నారు. ప్రమాణస్వీకారానికి ముందు ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రిగా అవకాశం రావడం సంతోషంగా ఉందని, రాష్ట్రానికి మరింత సేవచేసే అవకాశం దక్కిందన్నారు. తన ఉన్నతికి శ్రీకాకుళం ప్రజలే కారణమన్నారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి, రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

అత్యంత పిన్నవయస్కుడు..

మోదీ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న వారిలో అత్యంత పిన్నవయస్కుడిగా టీడీపీ నేత, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు (36) నిలిచారు. వరుసగా మూడోసారి ఎంపీగా ఎన్నికైన రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ప్రమాణం చేశారు. రామ్మోహన్ నాయుడు తర్వాత మోదీ క్యాబినెట్‌లో అత్యంత పిన్నవయస్కురాలిగా మహారాష్ట్ర బీజేపీ నేత రక్ష నిఖిల్ ఖడ్సే(37) నిలిచారు.

సామాన్య కార్యకర్తకు పట్టం

» అనూహ్యంగా కేంద్ర మంత్రి పదవి దక్కించుకున్న శ్రీనివాసవర్మ



బీజేపీలో సామాన్య కార్యకర్త స్థాయిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన భూపతిరాజు శ్రీనివాస వర్మ నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించడమే అనూహ్యం. అంతే అనూహ్యంగా ఆయనకు కేంద్ర మంత్రిగా కూడా అవకాశం దక్కింది. 1967 ఆగస్టు 4న జన్మించిన ఆయనకు.. రొయ్య సాగు, వాణిజ్యంలో 20 ఏళ్లు, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో 30 ఏళ్ల అనుభవం ఉంది. 1991 నుంచి 95 వరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా, 1995 నుంచి 97 వరకు పార్టీ భీమవరం పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో బీజేపీ తరఫున ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. గత ఏడాది వరకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. టీడీపీ-జనసేన కూటమి మద్దతుతో నరసాపురం ఎంపీ స్థానం నుంచి 2.76 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఆయన తల్లిదండ్రులు.. సీత, సూర్యనారాయణరాజు. భార్య పేరు వెంకటేశ్వరీదేవి.

ఎన్నో ఏళ్ల శ్రమకు ఫలితం: వర్మ

తనకు కేంద్ర మంత్రి పదవి రాత్రికి రాత్రే రాలేదని, ఇది ఎన్నో ఏళ్ల శ్రమకు దక్కిన ఫలితమని శ్రీనివాస వర్మ తెలిపారు. ఢిల్లీలో ప్రమాణ స్వీకారానికి ముందు ఆయన మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే పోలవరం నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. దేశంలో రాష్ట్రంలో రెండుచోట్లా ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నందున అభివృద్ధికి అన్నివిధాలా అనుకూల సమయమని చెప్పారు. సామాన్య కార్యకర్తనైన తనను కేంద్ర మంత్రి స్థాయికి చేర్చిన నరసాపురం ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ నుంచి కేంద్ర మంత్రిగా..

» గుంటూరు ఎంపీగా గెలిచిన తొలిసారే జాక్‌పాట్




మొదటిసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి.. గుంటూరు ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొందిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు తొలి దఫాలోనే కేంద్ర మంత్రి పదవి దక్కింది. 1976 మార్చి 7న తెనాలి సమీపంలోని బుర్రిపాలెంలో జన్మించిన ఆయన.. డాక్టర్‌గా అమెరికాలో స్థిరపడి, వైద్యరంగంలో ఉన్నత స్థాయికి ఎదిగారు. టీడీపీ ఎన్నారై విభాగంలో పనిచేశారు. జన్మభూమిపై మమకారంతో ప్రజలకు చేయాలనే లక్ష్యంతో రాష్ట్రానికి వచ్చారు. టీడీపీ తరఫున గుంటూరు లోక్‌సభకు మొదటిసారి పోటీచేసి గెలిచారు. లోక్‌సభలో అత్యంత సంపన్నుడైన ఎంపీ (రూ.5,700 కోట్లు) ఈయనే కావడం విశేషం. మోదీ కేబినెట్‌లో అనూహ్యంగా సహాయ మంత్రిగా చోటు సంపాదించారు. 1996-98 నడుమ కేంద్రంలో దేవెగౌడ, ఐకే గుజ్రాల్ కేబినెట్‌లలో నాటి టీడీపీ బాపట్ల ఎంపీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మంత్రిగా పనిచేశారు. మళ్లీ 28 ఏళ్ల తర్వాత టీడీపీ ఎంపీగా పెమ్మసానికి మంత్రి పదవి దక్కింది. ఆయన రాజధాని ప్రాంతం నుంచి ఎంపీగా గెలుపొందడం కూడా ఈ పదవి రావడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్న చంద్రబాబు.. రాజధాని అమరావతి పునరుజ్జీవంపై దృష్టిసారించారు. మోదీ కేబినెట్లో రాజధాని ప్రాంత ఎంపీ ఉంటే ఢిల్లీ నుంచి సాయం పొందడం సులువవుతుందని భావించారు. పెమ్మసానికి మంత్ర పదవి దక్కడంపై రాజధాని రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. పెమ్మసాని తల్లిదండ్రులు సువర్చల, సాంబశివరావు. సాంబశివరావు వ్యాపారరీత్యా నరసరావుపేటలో స్థిరపడ్డారు. టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలంగా పనిచేశారు. చంద్రశేఖర్ ఎంసెట్‌లో 27వ ర్యాంకు సాధించి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. అమెరికా పెన్సిల్వేనియాలో పీజీ పూర్తి చేశారు. జాన్స్ హాప్కిన్స్ వర్సిటీ, సినాయ్ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేశారు. అమెరికాలో లైసెన్సింగ్ ఎగ్జామ్స్‌కు హాజరయ్యే విద్యార్థుల కోసం 'యూ వరల్డ్' పేరుతో ఆన్‌లైన్ శిక్షణ సంస్థను స్థాపించారు. తొలి నుంచీ టీడీపీతో అనుబంధం ఉన్న చంద్రశేఖర్ ఎన్నారై విభాగం తరఫున క్రియాశీలంగా వ్యవహరించారు. ఆయన భార్య డాక్టర్ శ్రీరత్న. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కిషన్‌రెడ్డికి రెండో సారి కిరీటం

కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా బండి సంజయ్





హైదరాబాద్/న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ/బర్కత్‌పుర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ బీజేపీలో అంకితభావం కలిగిన నేతలు. పార్టీ సిద్ధాంతమే ఊపిరిగా, అధినాయకత్వం ఆదేశాలే శిరోధార్యంగా పనిచేస్తూ సమర్థత నిరూపించుకున్న వారిద్దరూ కేంద్ర మంత్రులయ్యారు. ఆ ఇద్దరే... గంగాపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్. సికింద్రాబాద్ నుంచి వరుసగా రెండోసారి విజయం సాధించిన కిషన్‌రెడ్డికి మరోసారి క్యాబినెట్ హోదా లభించగా, కరీంనగర్ నుంచి వరుసగా రెండోసారి గెలుపొందిన బండి సంజయ్‌కి, సహాయ మంత్రిగా అవకాశం వచ్చింది. ఈ ఇద్దరు కూడా గడచిన మూడు దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ వస్తున్నారు. ఇందుకు గుర్తింపుగా వారిని మంత్రి పదవులు వరించాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రానికి సంబంధించి కేంద్ర క్యాబినెట్‌లో ఓసీ, బీసీ సమతుల్యత సాధించినట్లయ్యిందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

కిషన్‌రెడ్డి సమర్థతకు మరో అవకాశం

ముందునుంచీ ప్రచారం జరుగుతున్నట్లుగానే కిషన్‌రెడ్డికి క్యాబినెట్‌లో ప్రధాని మోదీ మరోసారి అవకాశం ఇచ్చారు. 2019 ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి తొలిసారి ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి, మొదట కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేశారు. రెండేళ్ల అనంతరం, ప్రమోషన్ పొంది క్యాబినెట్ హోదాతో పర్యాటక, సాంస్కృతికశాఖ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసి సమర్థత నిరూపించుకున్నారు. ఇటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, అటు కేంద్ర మంత్రిగా చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచీ ఒక్కో మెట్టు ఎదుగుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో కీలక పదవులు నిర్వహించి సత్తా చాటుకున్నారు. ఆరెస్సెస్ నేర్పిన క్రమశిక్షణ, జాతీయవాదం పట్ల ఆకర్షణ దిశగా కిషన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం కొనసాగింది. బీజేపీ అభ్యున్నతికి రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో తనవంతు పాత్ర పోషించారు. అభిమానులంతా కిషనన్న అని పిలుచుకునే కిషన్‌రెడ్డిని మరోసారి కేంద్ర మంత్రి పదవి వరించడంతో పార్టీ కార్యకర్తలు, అభిమానులు సంబురాలు చేసుకున్నారు.

పోరాటయోధుడికి చాన్స్

తెలంగాణలో బీజేపీ అనూహ్యంగా పుంజుకోవడంలో కీలక పాత్ర పోషించిన బండి సంజయ్‌ని కేంద్ర మంత్రి పదవి వరించింది. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని వేధింపులకు గురిచేసినా తట్టుకుని ప్రజా సమస్యలపై పోరాటం చేసిన సంజయ్, జాతీ య నాయకత్వం ప్రశంసలందుకున్నారు. ఏడాది కిందట తనను అనూహ్యంగా రాష్ట్రసారథ్య బాధ్యతల నుంచి తప్పించిన సందర్భంలో సంజయ్, తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అయితే, ఎక్కడా పార్టీ నాయకత్వం నిర్ణయాన్ని ప్రశ్నించలేదు. ఇదే సమయంలో, సంజయ్‌ను తప్పించడం వల్ల పార్టీలో అసంతృప్తి వచ్చిన విషయాన్ని జాతీయ నాయకత్వం కొద్దిరోజుల్లోనే గుర్తించింది. పొరపాటు దిద్దుబాటులో భాగంగా ఆయనకు జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి కట్టబెట్టింది. అయినా, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి కొనసాగింది. ఈ సమయంలో, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పార్టీ జాతీయ నాయకత్వం బీసీ సీఎం నినాదం తెరపైకి తెచ్చింది. ఇది పెద్దగా ఫలితమివ్వలేదు.. పైగా, ఎంపీగా ఉన్న సంజయ్, ఎమ్మెల్యేగా పోటీచేసి కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ నేపథ్యంలో, తాజా ఎంపీ ఎన్నికల్లో మరోసారి కరీంనగర్ నుంచి పోటీ చేసిన సంజయ్ విజయం సాధించారు.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషి: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం అంకితభావంతో పని చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర మంత్రిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీని, మోదీ నాయకత్వాన్ని ప్రజలందరూ స్వాగతిస్తున్నారని తెలిపారు. సంకల్ప పత్రం పేరుతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి వచ్చే ఐదేళ్ల చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పారు. తెలంగాణలో పదేళ్లలో కేంద్రం రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తన గెలుపు కోసం పని చేసిన పదాధికారులు, మోర్చాల అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

కిషన్‌రెడ్డి ప్రొఫైల్

పేరు: గంగాపురం కిషన్‌రెడ్డి
పుట్టిన తేదీ: 15 జూన్, 1964
తల్లిదండ్రులు: స్వర్గీయ ఆండాళమ్మ, స్వామిరెడ్డి
సతీమణి: కావ్య; పిల్లలు.. వైష్ణవి, తన్మయ్

1977లో జనతాపార్టీ యువమోర్చా నాయకుడిగా కిషన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభం. 1980లో బీజేపీ ఆవిర్భావం నుంచీ పార్టీలో పూర్తిస్థాయి బాధ్యతలు. 1980-81 బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కమిటీ కన్వీనర్. 1982-83 బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి. 1983-84 బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి. 1986-1990 ఉమ్మడి ఏపీ బీజేవైఎం అధ్యక్షుడిగా బాధ్యతలు. 1990-92 బీజేవైఎం జాతీయ కార్యదర్శి, దక్షిణ భారత ఇన్‌చార్జి. 1992-94 బీజేవైఎం జాతీయ ఉపాధ్యక్షుడు. 1994-2001 వరుసగా మూడుసార్లు బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి. 2001-2002 బీజేపీ రాష్ట్ర కోశాధికారి, అధికార ప్రతినిధి, రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి. 2002-2004 బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు. 2004-2005 ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధికార ప్రతినిధి. 2004-2009 హిమాయత్‌నగర్ ఎమ్మెల్యే. 2009-2014 అంబర్‌పేట ఎమ్మెల్యే. 2010-2014 ఉమ్మడి ఏపీ బీజేపీ అధ్యక్షుడు. 2014-18 రెండోసారి అంబర్‌పేట ఎమ్మెల్యే. 2019 సికింద్రాబాద్ ఎంపీగా ఎన్నిక. 2019లో కేంద్ర మంత్రి. 2023 జూలై నుంచి నాలుగోసారి బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు. 2024లో సికింద్రాబాద్ నుంచి మరోసారి ఎంపీగా ఎన్నిక.

బండి సంజయ్ ప్రొఫైల్...

పేరు: బండి సంజయ్ కుమార్
పుట్టిన తేదీ:11-7-1971
తల్లిదండ్రులు: శకుంతల, (కీ.శే. బండి నర్సయ్య)
సతీమణి : బండి అపర్ణ(ఎస్‌బీఐ ఉద్యోగి)
పిల్లలు: సాయి భగీరత్, సాయి సుముఖ్

బాల్యంలోనే ఆర్ఎస్ఎస్‌లో చేరిన సంజయ్.. ఆ తర్వాత ఏబీవీపీ, బీజేవైఎంలో వివిధ బాధ్యతలు చేపట్టారు. బీజేపీ జాతీయ కార్యాలయం, ఢిల్లీలో ఎన్నికల ప్రచార ఇన్‌చార్జిగానూ పనిచేశారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల పార్టీ ఇన్‌చార్జిగానూ బాధ్యతలు నిర్వహించారు. ఎల్‌కే ఆడ్వాణీ చేపట్టిన సురాజ్ రథ యాత్రలో వెహికల్ ఇన్‌చార్జిగా ఉన్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థగా ఏర్పడిన తర్వాత 48వ డివిజన్ నుండి రెండు సార్లు బీజేపీ కార్పొరేటర్‌గా గెలుపొందారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించారు. ఓబీసీ వెల్ఫేర్ పార్లమెంట్ కమిటీ మెంబర్‌గా, అర్బన్ డెవలప్‌మెంట్ పార్లమెంట్ కమిటీ మెంబెర్‌గా, టొబాకో బోర్డు మెంబర్‌గా, మైనారిటీ అఫైర్స్ స్టేట్ లెవల్ కమిటీ మెంబర్‌గా కొనసాగారు. 2020లో ఎయిమ్స్ బీబీనగర్ బోర్డు మెంబెర్‌గా పనిచేశారు. 2020లో బీజేపీ తెలంగాణ పార్టీ అధ్యక్షుడిగా, 2023లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. తాజా ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు.



రామోజీరావు అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు

అశ్రునయనాలతో..

(మొదటిపేజీ తరువాయి)

నిప్పంటించారు. రామోజీరావు పార్థివదేహాన్ని ఆదివారం ఉదయం ఫిల్మ్‌సిటీలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి ఇంటికి తరలించారు. లాంఛనాల అనంతరం ఉదయం 9.30కు పోలీసుల గౌరవవందనంతో అంతిమయాత్ర ప్రారంభమైంది. వేలాది మంది వెంట రాగా రామోజీ గ్రూప్ సంస్థల కార్యాలయాల మీదుగా 10.30 గంటలకు స్మృతివనం వద్దకు చేరుకుంది. ప్రధాన గేటు వద్ద వాహనం నుంచి రామోజీరావు పాడెను కిందకు దించగా.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నివాళులర్పించారు. స్మృతివనం లోపలి వరకు పాడెను మోశారు. ఓ దశలో ఆయన భావోద్వేగానికి గురయ్యారు. అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, వారి కుమారుడు లోకేశ్, కోడలు బ్రహ్మణి అక్కడే ఉన్నారు. కాగా, రామోజీ సంస్థల సిబ్బంది, అభిమానుల జోహార్ రామోజీరావు నినాదాల మధ్యన 11.30కు అంత్యక్రియలు ముగిశాయి. స్మృతివనం వద్ద రామోజీరావు కడచూపు సందర్భంగా భార్య రమాదేవి, పెద్ద కుమారుడు కిరణ్, కోడళ్లు శైలజాకిరణ్, విజయేశ్వరి, మనవరాళ్లు సహరి, బృహతి, దివిజ, కీర్తి సోహన, మనవడు సుజయ్ కన్నీటి పర్యంతమయ్యారు. అంతిమయాత్ర వాహనంలో రామోజీరావు కుటుంబసభ్యులతో పాటు తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి ఉన్నారు. రామోజీరావుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ ఐఏఎస్ అధికారులు రజత్‌భార్గవ, సిసోడియా, సాయిప్రసాద్‌లు శ్రద్ధాంజలి ఘటించారు. పలు రాష్ట్రాల నుంచి రామోజీ అభిమానులు, ప్రముఖులు కూడా హాజరయ్యారు.

అక్షర యోధుడికి వీడ్కోలు పలికా: చంద్రబాబు

"తెలుగు వెలుగు, అక్షర యోధుడి అంతిమసంస్కార కార్యక్రమాల్లో పాల్గొని.. తెలుగు వారి ఆత్మబంధువు రామోజీరావుకు కడసారి వీడ్కోలు పలికా" అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. తన హృదయం బాధతో నిండిపోయిందని, రామోజీరావు మన మధ్య లేకపోయినా, ఆయన పంచిన స్ఫూర్తి మార్గదర్శిగా మనల్ని ముందుకు నడిపిస్తుందని పేర్కొన్నారు.



తరలివచ్చిన ప్రముఖులు, ప్రజలు

రామోజీరావుకు నివాళి అర్పించేందుకు రెండో రోజూ సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఫిల్మ్‌సిటీ సమీప గ్రామాల ప్రజలు స్మృతి వనంకు చేరుకున్నారు. అంతిమ సంస్కారాలను వీక్షించేందుకు ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. రామోజీరావు అంతిమ యాత్రలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, నారా లోకేష్ పాల్గొన్నారు. తెలంగాణ మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేష్ రెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, మాజీ మంత్రులు మండవ వెంకటేశ్వరరావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, మోత్కుపల్లి నర్సింహులు తదితరులు నివాళులర్పించారు. తెలంగాణ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఏపీ ఎమ్మెల్యేలు రఘురామరాజు, ప్రత్తిపాటి పుల్లారావు, చింతమనేని ప్రభాకర్, వెనిగండ్ల రాము, అరిమిల్లి రాధాకృష్ణ, బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, టీడీపీ సీనియర్ నేతలు కొమ్మారెడ్డి పట్టాభి, దేవినేని ఉమా, కాల్వ శ్రీనివాసులు హాజరయ్యారు. మాజీ ఎంపీలు గిరీష్ సంఘీ, నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, జయప్రకాష్ నారాయణ్, రాజకీయ నేతలు దేవేందర్‌గౌడ్, మర్రి శశిధర్‌రెడ్డి, వి.హనుమంతరావు, కనుమూరి బాపిరాజు, తీగల కృష్ణారెడ్డి, సినీ ప్రముఖులు మురళీమోహన్, సురేష్‌బాబు, శ్యాంప్రసాద్‌రెడ్డి, బోయపాటి శ్రీను, బండ్ల గణేష్, వేణు, శ్యాంప్రసాద్‌రెడ్డి, రవిబాబు తదితరులు రామోజీరావుకు నివాళులర్పించారు.

రామోజీ సూచనలు జీవితాంతం పాటిస్తా: లోకేశ్

సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, ప్రభుత్వాలను ప్రశ్నించే స్థాయికి ఎదిగిన వ్యక్తి రామోజీరావు అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ కొనియాడారు. రామోజీరావు సూచనలను తాను జీవితాంతం పాటిస్తానని తెలిపారు.



నివాళులర్పిస్తున్న లోకేశ్



రామోజీరావు అంతిమయాత్రలో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, ఎమ్మెల్యే సుజనా చౌదరి, టీ-మంత్రి తుమ్మల

దార్శనికుడిని కోల్పోయాం.. : కమల్‌హాసన్

రామోజీరావు మృతితో ఓ దార్శనికుడిని, సరికొత్తగా ఆలోచించే వ్యక్తిని కోల్పోయామని ప్రముఖ హీరో కమల్ హాసన్ అన్నారు. భారతీయ మీడియా, సినీ రంగాలకు విశేష సేవలందించిన రామోజీ.. ఫిలింసిటీ వంటి గొప్ప కళాఖండాన్ని అందించారని పేర్కొన్నారు. రామోజీ మృతి భారతీయ సినిమాకు తీరని లోటు అని ట్వీట్ చేశారు. రామోజీరావు దూరదృష్టి ఉన్న స్ఫూర్తిదాయక సారథి అని.. మలయాళ నటుడు మోహన్‌లాల్ కొనియాడారు. ఆయన స్థాపించిన ఫిలింసిటీ సినీ నిర్మాణంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని వివరించారు.

రామోజీరావు మృతి తీరని లోటు

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి కీర్తిని విరజిమ్మిన ఆదర్శమూర్తి రామోజీరావు అని కాకతీయ సేవాసమితి డల్లాస్ నిర్వాహకులు కొనియాడారు. రామోజీరావు సంస్మరణ సభను డల్లాస్‌లోని ఫ్రిస్కోలో కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎన్నారైలు మాట్లాడుతూ రామోజీరావు సామాన్య రైతు కుటుంబంలో జన్మించి పట్టుదలతో అనేక సంస్థలను స్థాపించి ఎందరికో ఉపాధి కల్పించి సమాజసేవ చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.



ఫిల్మ్‌సిటీలోని స్మృతి వనం వద్దకు భారీగా తరలివచ్చిన రామోజీరావు అభిమానులు



గౌరవ సూచకంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



రామోజీరావు చితికి నిప్పంటిస్తున్న కుమారుడు కిరణ్

టీడీపీ కార్యకర్త దారుణహత్య

- బొమ్మిరెడ్డిపల్లెలో వేటకొడవళ్లతో నరికి చంపిన వైసీపీ కార్యకర్తలు
- తీవ్ర గాయాలతో బయటపడ్డ మృతుని తమ్ముడు
- పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆమె కుమారుడిపై ఫిర్యాదు
- ఎన్నికల్లో ఓటమికి కారణమయ్యాడనే కక్షతోనే..
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



హత్యకు గురైన గిరినాథ్ చౌదరి (ఫైల్)

వెల్దుర్తి/పత్తికొండ, జూన్ 9: కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలో ఘోరం చోటుచేసుకుంది. ఎన్నికల్లో టీడీపీలో చురుగ్గా పాల్గొని ఓటమికి కారణమయ్యాడన్న కారణంతో టీడీపీ నాయకుడిని వేటకొడవళ్లతో అతి దారుణంగా నరికి చంపారు. పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ దారుణం జరిగింది. మోదుపల్లి గిరినాథ్ చౌదరి (33), అతడి తమ్ముడు కల్యాణ్ చక్రవర్తి బొమ్మిరెడ్డిపల్లెలోని ఎస్సీ కాలనీలో నడిచి వెళ్తుండగా, అక్కడే ఉన్న వైసీపీ కార్యకర్తలు పామయ్య, రమేష్, ప్రదీప్‌లతో పాటు మరో పది మంది గొడవకు దిగారు. 'టీడీపీ గెలిస్తే మాత్రం మీరు ఏం చేయగలరంటూ..' కవ్వింపు చర్యలకు దిగారు. ఈ క్రమంలోనే పక్కా ప్లాన్ ప్రకారం వేటకొడవళ్లతో వారిద్దరిపై దాడి చేశారు. ఈ దాడిలో గిరినాథ్ చౌదరి తల, ముఖం చీరుకుపోయినట్లు నరికేయడంతో రక్తపు మడుగులోపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోదరుడు కల్యాణ్ చక్రవర్తి తలకు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలుకు తరలించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గిరినాథ్ చౌదరి హత్యకు సంబంధించి నిందితులతో పాటు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆమె కుమారుడు రామ్మోహన్‌రెడ్డి, గ్రామ నాయకుడు మధుసూదన్ రెడ్డి కారణమని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరితో పాటు రామకృష్ణ, రమేష్, చిన్నపామయ్య, చక్రపాణిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, చైతన్యరెడ్డి, మురళీధర్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ కూడా హత్యకు కారకులంటూ బాధితులు తమ ఫిర్యాదులో వెల్లడించారు.

పోలింగ్‌రోజు మొదలైన గొడవ

మే 13న పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ వర్గీయులు టీడీపీ వర్గీయులతో ఘర్షణకు దిగి దౌర్జన్యం చేశారు. అయితే ఎన్నికల సమయంలో గొడవలెందుకని టీడీపీ వర్గీయులు ఫిర్యాదు కూడా చేయలేదు. ఎన్నికల ఫలితాల రోజు టీడీపీ శ్రేణులు గ్రామంలో సంబరాలు చేసుకుంటుండగా.. వైసీపీ వర్గీయులు వారితో వాగ్వాదం పెట్టుకున్నారు. టీడీపీ గెలిస్తే.. మీరు మమ్మల్ని ఏమైనా చేయగలరా అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాటలు, ఘర్షణ చోటు చేసుకున్నాయి. ఒకరిద్దరు వైసీపీ కార్యకర్తలకు కూడా గాయాలయ్యాయి. దీంతో ప్రతీకారం తీర్చుకోవడం ఖాయమంటూ వైసీపీ వర్గీయులు తొడలు కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోనే ఈ హత్య జరిగింది.

రేపు కూటమి ఎమ్మెల్యేల భేటీ

- శాసనసభా పక్ష నేతగా చంద్రబాబు ఎన్నిక

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటవి ం తరఫున గెలిచిన ఎమ్మెల్యేల సమావేశం మంగళవారం జరగనున్నది. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో లేదా టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉంది. ఎన్నికల ఫలితాల తర్వాత కూటమి ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించనుండటం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో కూటమి తరఫున శాసనసభా పక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకోనున్నారు. అనంతరం తీర్మానం ప్రతిని కూటమి ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి అందజేయనుంది. ప్రభుత్వం ఏర్పాటుకు తమను ఆహ్వానించాల్సిందిగా గవర్నర్‌ను కోరనుంది. ప్రభుత్వం ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానిస్తూ గవర్నర్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. బుధవారం జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఎమ్మెల్యేల సమావేశంతో ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది.

బరిలోకి బాబు!

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో.. తన ప్రమాణ స్వీకారాన్ని 12వ తేదీకి వాయిదా వేసుకున్నారు. అయితే బాధ్యతలు చేపట్టనప్పటికీ.. ఒక్క రోజు కూడా వృథాచేయడం ఈ విజనరీ నేతకు ఇష్టం ఉండదని.. సీఎస్‌కు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారని అధికార వర్గాలు అంటున్నాయి. తాను బాధ్యతలు చేపట్టేనాటికే ఎంతో కొంత మార్పు కనిపించాలని భావిస్తున్నారు. జగన్ సర్కార్ నిర్వాకంతో కసితో ఓట్లేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు తన నుంచి ఏం ఆశిస్తున్నారో.. తదనుగుణంగా ఆయన అడుగులు వేస్తున్నారు. పాలనలో విశేషానుభవం ఉన్న ఆయన.. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఛిద్రమైన వ్యవస్థలను సరిచేసేందుకు ముందుగా నడుం బిగించారు. ప్రజలు కోరుకున్న అభివృద్ధిని మళ్లీ చేసి చూపించేందుకు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకున్న చంద్రబాబు.. ప్రధానమైన రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తిపై దృష్టి పెట్టారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం పని మొదలుపెట్టింది. ఆయన ఆదేశాలతో అమరావతిలో ఆగిపోయిన వివిధ భవన నిర్మాణ పనులను సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ స్వయంగా పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో సుడిగాలి పర్యటనలు చేపట్టారు. ముందుగా రాజధాని ప్రాంతానికి గతంలో భూమి పూజ జరిగిన ఉద్ధండరాయునిపాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో నివాస భవనాల సముదాయాలను.. హైకోర్టు తదితర ప్రాంతాలను సీఎస్ పరిశీలించారు. రాజధాని ప్రాంతం చిట్టడవిలో మారి ఉండడంతో తొలుత పెద్ద ఎత్తున జంగిల్ క్లియరెన్స్ పనులకు ఆదేశించారు. 200 పొక్లయిన్లు చిట్టడవిగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. రోడ్లు బాగు చేయడంతో పాటు గతంలో జరిగిన నిర్మాణాల వద్ద మళ్లీ పనులు ప్రారంభించారు.

ఆ అధికారులను దూరం పెడుతూ..

వైసీపీతో అంటకాగిన అధికారుల కదలికలపై చంద్రబాబు దృష్టి సారించారు. ముఖ్యంగా సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డిని సెలవుపై వెళ్లాలని ఆదేశించారు. కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను నియమించారు. ఆయన వచ్చీరాగానే సీఎం కార్యాలయంలోని పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తాలను బదిలీ చేశారు. వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ముద్దాడ రవిచంద్రను నియమించారు. జగన్ చేసిన విధ్వంసంలో పాలుపంచుకున్న కొన్ని శాఖల వివాదాస్పద అధికారులను పక్కనబెడుతూ ఉత్తర్వులిస్తున్నారు. వైసీపీ ముద్ర వేసుకున్న అధికారులను కీలక స్థానాల నుంచి తప్పించేందుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. ఇదే విధానంలో కింది స్థాయి సిబ్బంది స్థాన చలనానికీ ఆయా శాఖల అధికారులు ఆదేశాలిస్తున్నారు. కార్యాలయాల నుంచి డాక్యుమెంట్లు మాయం అవ్వకుండా.. ఫైబర్‌నెట్, ఏపీఎండీసీ, బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయాలను సీజ్ చేయించారు. ఏపీఎస్పీ పోలీసులతో పహరా ఏర్పాటు చేశారు. సీఐడీతో ఫైళ్ల తనిఖీలు చేయిస్తున్నారు.

నివేదికలు సిద్ధం..

ఇక 12న సీఎంగా ప్రమాణ స్వీకారం తర్వాత చంద్రబాబు జరిపే సమీక్షలకు కీలక అధికారులు సిద్ధమవుతున్నారు. ఐదేళ్లుగా పడకేసిన పోలవరం ప్రాజెక్టు స్థితిగతులపై వాస్తవాలతో ఇరిగేషన్ అధికారులు నివేదిక రెడీ చేస్తున్నారు. ఇతర సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత వివరాలు కూడా చంద్రబాబు తెలుసుకున్నారు. విద్యుత్ శాఖలో ట్రాన్స్‌కో, జెన్‌కో వ్యవహారాలపైనా సమాచారం తెప్పించుకున్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల కనీసం వీధి దీపాలు వెలగడం లేదని తెలియడంతో వెంటనే చక్కదిద్దాలని ఆదేశాలు జారీచేశారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు ఆస్కారం లేకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలందాయి. విజయవాడలో కొద్ది రోజుల కిందట కలుషిత తాగునీటితో మరణాలు సంభవించిన నేపథ్యంలో సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఇక వీఐపీ రాకపోకల పేరుతో ట్రాఫిక్ నిలిపివేత వంటి చర్యలు వద్దని పోలీసులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా తన కాన్వాయ్ వెళ్తున్న సమయంలో ప్రజలు ఇబ్బంది పడేలా ట్రాఫిక్ ఆపొద్దని ఇప్పటికే సూచించారు. రోజుల వ్యవధిలోనే పాలనలో మార్పు చూపించాలన్న కృతనిశ్చయంతో ఆయన ఉన్నారని.. దానికి అనుగుణంగానే ఉన్నతాధికారులకు సూచనలు, ఆదేశాలు వెళ్తున్నాయని అధికార వర్గాలు, టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.





రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రదేశం ఉద్దండ్రాయునిపాలెం ప్రాంతాన్ని, రాయపూడిలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఇళ్ల భవన సముదాయాలను పరిశీలిస్తున్న సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

రాజధానిలో సీఎస్ సుడిగాలి పర్యటన

- జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని ఆదేశం
- అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనుల పరిశీలన

తుళ్లూరు, జూన్ 9: రాజధాని అమరావతిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. రాజధానిలో అన్నిచోట్లా వీధి లైట్లు వెలగాలని సీఆర్డీయే అధికారులను ఆదేశించారు. ముందుగా ఉద్దండ్రాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన ప్రదేశాన్ని సీఎస్ పరిశీలించారు. అనంతరం రాయపూడి రెవెన్యూలో నిర్మాణం పూర్తికావచ్చిన సీఆర్డీఏ రీజినల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సీఎస్ అమరావతి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రాయపూడిలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను, అఖిల భారత సర్వీసు అధికారుల నివాస సముదాయ భవనాలను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో నివాస భవనాల సముదాయాలను, హైకోర్టు జడ్జీల బంగ్లాలను ఆయన పరిశీలించారు. శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఫౌండేషన్ వరకు వచ్చి ఆగిపోయిన ప్రాంతాల్లో పర్యటించారు. సీఎస్‌తో పాటు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, అదనపు కమిషనర్, సీఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి 25 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. రాజధాని రైతుల వార్షిక కౌలును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. రాజధానిలో చంద్రబాబు అప్పగించిన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తామని ప్రకటించారు. రేయింబవళ్లు జేసీబీ యంత్రాలు జంగిల్ క్లియరెన్స్ పనులలో నిమగ్నమయ్యాయని, ఇప్పటికే 80 యంత్రాలు పనులు చేస్తున్నాయని తెలిపారు. నిర్మాణంలో వినియోగించి తుప్పుపట్టిన ఇనుము విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ పేర్కొన్నారు.

'ఫైర్'లో భారతి పని మనుషులు!

(మొదటి పేజీ తరువాయి)

కొంత పరీక్ష ఉంటుంది. కానీ, అగ్నిమాపక శాఖలో హోంగార్డుకు ఎలాంటి పరీక్షలు లేకుండానే ఇష్టారాజ్యంగా ఉద్యోగాలిచ్చి రాయల సీమ జిల్లాల్లో పోస్టింగులు వేసేశారు. మాజీ సీఎం జగన్‌కు వీరవిధేయుడిగా పేరొందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ బయటికి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు చెబుతూనే.. వైసీపీ రాజ్యాంగాన్ని అమలు చేశారు. ఆయన కొట్టమంటే కొట్టడం, కేసు పెట్టమంటే పెట్టడమే పనిగా భావించి అమలు చేశారు. సీఐడీ ఏడీజీ నుంచి బదిలీ చేసిన తర్వాత అగ్నిమాపక శాఖ డీజీగా పోస్టింగ్ ఇవ్వడంతో అక్కడ కూడా స్వామి భక్తి ప్రదర్శించారు. సీఐడీ ఏడీజీగా జగన్ చెప్పినవన్నీ చేసిన సునీల్ ఆ తర్వాత వైఎస్ భారతి పేరు చెబితే చాలు ఉద్యోగాలిచ్చేశారు. అగ్నిమాపక శాఖలో కేవలం మూడు నెలల్లో 60 మందికి ఉద్యోగాలిచ్చిన సునీల్ కుమార్ ఏమాత్రం మార్గదర్శకాలు పాటించలేదు.

మాదిరెడ్డి హయాంలోనూ!

గతంలో అగ్నిమాపక శాఖలో హోంగార్డుల భర్తీ జరగాలంటే నోటిఫికేషన్ విడుదల చేసేవారు. కనీస విద్యార్హత పదో తరగతిగా ఉండేది. దేహ దారుఢ్యంతోపాటు హెవీ వెహికల్ లైసెన్స్ ఉండే వారికి పోటీ పరీక్ష ద్వారా భర్తీ చేసేవారు. వైసీపీ హయాంలో అలాంటివేవీ పట్టించుకోకుండా అగ్నిమాపక శాఖ మాజీ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ 11 మందిని తీసుకున్నారు. తర్వాత డీజీ అయిన పీవీ సునీల్ కుమార్ ఏకంగా 60 మందికి ఆశ్రయం కల్పించారు. అగ్నిమాపక శాఖలో తీవ్ర చర్చనీయాంశమైన ఈ అడ్డగోలు నియామకాలపై విచారణ జరిపిస్తే ఇప్పటికే ఒక ఏడీజీపై నమోదైన కేసు డీజీపైనా నమోదు అవుతుందని ఉద్యోగులు చెబుతున్నారు. దీంతోపాటు అగ్నిమాపక శాఖ పెట్రోలు బంకుల్లో డబ్బులు కూడా అడ్డగోలుగా వాడేశారని, దానిపైనా విజిలెన్స్ రంగంలోకి దిగితే అడ్డగోలు ఖర్చులు బయటికి వస్తాయని చెబుతన్నారు.

నియమావళి ప్రకారమే ఎన్‌వోసీలు: సునీల్

అగ్నిమాపక శాఖ జారీ చేసిన ఎన్‌వోసీలన్నీ ఎన్‌బీసీ నియమావళి ప్రకారమే జారీ చేశామని ఆ శాఖ డీజీ సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్‌లో ఫైళ్లు మాయం శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. తమ సిబ్బంది తనిఖీ చేసిన తర్వాతే అనుమతులు ఇచ్చామన్నారు. ఆన్‌లైన్ సర్వర్లు ఆపలేదని, ఫైళ్లు డిలీట్ చేసేందుకు అవకాశం ఉండదని వివరించారు. తాను రాక ముందే అగ్నిమాపక శాఖలో ఆన్‌లైన్ విధానం అమల్లో ఉందని, ఎవరైనా అగ్నిమాపక పరికరాల ఏర్పాట్లు చేసుకోకపోతే భద్రత దృష్ట్యా వారికి సూచించామని వెల్లడించారు. సాఫ్ట్‌వేర్ నిపుణుడి ద్వారా ఎలాంటి డేటా డిలీట్ చేయలేదని స్పష్టం చేశారు. అయితే, ఆయన సీసీగా ఉన్న కానిస్టేబుల్ ఈ వ్యవహారాన్ని ఇప్పటికే పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అంతేకాదు, తిరుపతి, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నంలో ఎక్కడెక్కడ లక్షలాది రూపాయలు చేతులు మారాయో వివరించారు. మొత్తం వ్యవస్థను తన చేతిలో పెట్టుకుని, ఎత్తు తగ్గింపులో మతలబు చేసి అర్హులైన అభ్యర్థులకు ఒక్కరికి కూడా అవకాశం లేకుండా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. విజిలెన్స్ విచారణ చేపడితే అక్రమాలు వెలుగులోకి వస్తాయని అగ్నిమాపక శాఖ ఉద్యోగులు చెబుతుండడం గమనార్హం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



SCALING NEW HEIGHTS in JEE ADVANCED 2024

50 YEARS OF BRILLIANCE

ALL INDIA RANK **8** — G.NAVEEN, R.No. 246161014 (R)

ALL INDIA RANK **36** — P.RAKESH KUMAR, R.No. 246025153 (R)

ALL INDIA RANK **39** — K.VINOD, R.No. 246146088 (R)

ALL INDIA RANK **123** — J.SNEHITH SANDESH, R.No. 246192185 (R)

ALL INDIA RANK **125** — V.RAMBABU, R.No. 246174019 (R)

All India Rank	Name	R.No.
127	V.VEDAVACHAN REDDY	246029007 (R)
133	J.SHRETHAN REDDY	246195007 (R)
135	S.ARUN SINGH	246150386 (R)
157	B.DINESH	246177009 (R)
185	M.VENKATESHWARLU	246194092 (R)
299	D.KARTHIK	246018009 (R)
323	T.AKHIL NAIK	246175113 (R)
324	K.SREERAM REDDY	246195226 (R)
397	B.ESHWARI	246197150 (R)
450	N.NITHIN	246195114 (R)
598	D.PRAGNA TEJA	246197108 (R)
621	W.VERONIKA HASINI	246192298 (R)
654	P.NIHAL SRIVATSAV	246196001 (R)
689	T.TEJASWI	246200036 (R)
708	B.RAJESH	246146013 (R)
737	D.NIHARIKA	246160036 (R)
737	B.ANAND SAI	246163068 (R)
751	V.KRANTHI KIRAN	246138023 (R)
901	V.HARILAL	246118153 (R)
966	R.DEEPANSH REDDY	246197175
1003	A.BHAGAWANDAS	246157224 (R)
1043	P.NITHIN NAIK	246199082 (R)
1097	B.ABHILASH RAJU	246171283 (R)
1100	R.AADHI	246157623 (R)
1170	D.VARSHITH	246019048 (R)
1186	M.MALLU NAIK	246029567 (R)
1201	M.SAI SIDDHARDHA	246011037 (R)
1214	A.SAI CHARAN	246150195 (R)
1270	G.APARNAJINI	246197189 (R)
1276	D.MANISH	246197114

LONG TERM JEE (ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2024-25

HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | **WARANGAL:** 9642117378 | **VIJAYAWADA:** 8142111302 | **VIZAG:** 9052222274, 9154854707 | **GUNTUR:** 9154854694 | **TIRUPATI:** 9154854699 | **NELLORE:** 9154854696 | **ANANTHAPURM:** 9154854691 | **KURNOOL:** 9154854695 | **NIZAMABAD:** 9642117110, 096421 15777 | **SRIKAKULAM:** 9154854697 | **BHIMAVARAM:** 9642223762, 7331122579 | **RAJAHMUNDRY:** 9154854693 | **KARIMNAGAR:** 9642117335 | **NALGONDA:** 9573927070 | **ONGOLE:** 8712609156 | **KHAMMAM:** 9121155002 | **ADILABAD:** 9154854690 | **KOTHAGUDEM:** 9154854692 | **NIRMAL:** 9642117835 | **HOSAPETE:** 9154854713.

SR Educational Academy

TELANGANA ● ANDHRA PRADESH ● KARNATAKA

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 55 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శే. ఉ. 6.28; దుర్ముహూర్తం: మ. 12.40-1.32, మ. 3.16-4.09; అమృతఘడియలు: మ. 2.54-4.36; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





ALL INDIA / STATE RANKS	JEE MAIN-2024	JEE ADV-2024	AP EAPCET	TS EAPCET
<=2500	100%	100%	80%	80%
<=5000	100%	100%	60%	60%
<=10000	75%	75%	30%	30%
<=20000	50%	50%	20%	20%
SC/ST/PW BEST RANKERS	60%	60%		

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



దుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

2లో..

- మొక్కులు తీర్చుకున్న ప్రముఖులు
- ఆశీస్సులు అందుకున్న మాజీ మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తి

సోమవారం | 10-6-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

విస్తరిస్తారా..?



కమిషనరేట్ పరిధి పెంపుపై ఊహాగానాలు

తూర్పున ఒకపక్క ఉయ్యూరు. మరోపక్క గన్నవరం. పశ్చిమలో ఇబ్రహీంపట్నం. ఒకప్పటి విజయవాడ పోలీస్ కమిషనరేట్ సరిహద్దులు ఇవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల విభజన ప్రతిపాదనతో ఈ సరిహద్దులు చెరిగిపోయాయి. ఈ విభజన ప్రభావం విజయవాడ పోలీసు కమిషనరేట్‌పై పడింది. విజయవాడ నగరాన్ని అనుకుని ఉన్న పెనమలూరు, కంకిపాడు జిల్లా ఎస్పీ పరిధిలోకి వెళ్లిపోయాయి. విజయవాడ విమానాశ్రయం ఉన్న గన్నవరం పరిస్థితి అంతే. తూర్పున ఉన్న ముక్కలు తెగిపోయి, పశ్చిమాన ఉన్న గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాలు వచ్చి కలవడంతో కమిషనరేట్ రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పుడు ఏడీజీ స్థాయి అధికారి కమిషనర్‌గా ఉండేవారు. ఆ హోదాను ఐజీ స్థాయికి కుదించేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరుతుండడంతో పోలీసు కమిషనరేట్ విస్తరణపై ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. మళ్లీ పోలీసు కమిషనరేట్ రూపురేఖలు మారే అవకాశం ఉందని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

- వైసీపీ పాలనలో తగ్గిన హోదా
- కూటమి అధికారంలోకి రావడంతో పరిధిపై చర్చ
- గన్నవరం కమిషనరేట్ పరిధిలోకి వచ్చే అవకాశం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : విజయవాడ నగరంలో కృష్ణా జిల్లా ఎస్పీ పరిధిలో ఉండేది. 1983లో విజయవాడ కేంద్రంగా కృష్ణా అర్బన్ జిల్లా ఏర్పాటు చేశారు. 1989లో అర్బన్ జిల్లాను అప్‌గ్రేడ్ చేసి కమిషనరేట్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధాని చేశారు. సీఆర్డీఏ పరిధిలో ఉన్న విజయవాడ రాజధానికి చెంతనే ఉండడంతో విజయవాడ పోలీసు కమిషనర్ హోదాను అప్‌గ్రేడ్ చేశారు. అదనపు డీజీ స్థాయి అధికారిని పోలీసు కమిషనర్‌గా నియమించారు. ఏబీ వెంకటేశ్వరరావు, గౌతమ్‌సవాంగ్, సీహెచ్ ద్వారకాతిరుమలరావు వంటి అధికారులు ఏడీజీ స్థాయి హోదాలో కమిషనర్లుగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2022లో జిల్లాల పునర్విభజన చేపట్టింది. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిని పరిగణనలోకి తీసుకుని జిల్లాల విభజన చేసింది. అప్పటి వరకు పోలీసు కమిషనరేట్‌కు ఐదు జోన్లు ఉండేవి. గన్నవరం, ఆత్కూరు, తోట్లవల్లూరు, ఉయ్యూరు, పవిడిముక్కల తూర్పు జోన్ పరిధిలో ఉండేవి. పెనమలూరు, కంకిపాడు సెంట్రల్ జోన్ పరిధిలో ఉండేవి. జిల్లాల విభజన చేసిన తర్వాత తూర్పుజోన్ పూర్తిగా కమిషనరేట్ నుంచి కృష్ణాజిల్లా ఎస్పీ పరిధిలోకి వెళ్లిపోయింది. సెంట్రల్ జోన్ ఉన్న పెనమలూరు, కంకిపాడు పీఎస్‌లను జిల్లాకు ఇచ్చేయాల్సి వచ్చింది. పశ్చిమ జోన్‌లో ఇబ్రహీంపట్నం వరకు కమిషనరేట్ పరిధి ఉండేది. మైలవరం నుంచి జగ్గయ్యపేట వరకు ఉన్న ప్రాంతమంతా జిల్లా ఎస్పీ పరిధిలో ఉండేది. తూర్పులో సగభాగాన్ని కోల్పోయిన కమిషనరేట్‌లోకి ఈ ప్రాంతమంతా వచ్చి కలిసింది. దీన్ని ఇప్పుడు రూరల్ డీసీపీగా పరిధిగా వ్యవహరిస్తున్నారు.

పరిధి ఒకరిది... బందోబస్తు మరొకరిది...

వైసీపీ చేసిన జిల్లాల పునర్విభజనలో శాంతిభద్రతల అంశాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ విజయవాడ పోలీసు కమిషనరేట్ విభజన. విజయవాడ విమానాశ్రయం గన్నవరంలో ఉంది. ఈ ప్రాంతమంతా ఒకప్పుడు కమిషనరేట్ పరిధిలో ఉండేది. విభజనతో జిల్లా పరిధిలోకి వెళ్లింది. ఈ విమానాశ్రయంలో భద్రతను సీఆర్పీఎఫ్ పర్యవేక్షిస్తోంది. బయట ప్రాంతమంతా స్థానిక పోలీసుల పర్యవేక్షణలో ఉంటుంది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు రోడ్డుమార్గాన విమానాశ్రయానికి చేరుకునేవారు. కమిషనరేట్‌తోపాటు జిల్లా ఎస్పీ పరిధిలో ఉన్న ప్రాంతంలోనూ విజయవాడ పోలీసులు బందోబస్తు నిర్వహించాల్సి వచ్చేది. ఇతర వీఐపీలు విజయవాడకు వచ్చినప్పుడు ఇదే పరిస్థితి. ప్రముఖుల రాకపోకల సమయంలో బందోబస్తును పర్యవేక్షించడానికి మచిలీపట్నం నుంచి జిల్లా ఎస్పీ సుమారుగా 60 కిలోమీటర్లు ప్రయాణించి గన్నవరం చేరుకోవాల్సి ఉంటుంది. ప్రముఖుల రాకపోకల సమయంలో రహదారులకు ఇరువైపులా ఉండే పోలీసులను, తనిఖీలు నిర్వహించే బాంబు స్క్వాడ్‌ను మచిలీపట్నం నుంచి పంపాల్సిన పరిస్థితి ఉంది. విజయవాడ పోలీసులు నగర బహిష్కరణ చేసిన రౌడీషీటర్లు అటు గన్నవరం, ఇటు పెనమలూరులో తలదాచుకుంటున్నారు. విభజన జరిగిన సమయంలో కమిషనరేట్‌ను యథాతథంగా ఉంచాలని ప్రతిపాదనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరుతుండటంతో కమిషనరేట్ రూపురేఖల్లో మార్పులు ఉండొచ్చన్న అభిప్రాయాన్ని పోలీసు వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



వేగంగా సభ ఏర్పాట్లు

చకచకా..

చంద్రబాబు ప్రమాణస్వీకారం సభ ఏర్పాట్లు వేగవంతం

గన్నవరం : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణాస్వీకారం ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. గన్నవరం మండలం కేసరపల్లి మేధా టవర్స్ ప్రక్కన జరిగే పనులను టీడీపీ నేతలు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జర్మన్ హ్యాంగర్స్‌తో భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 8 అడుగుల ఎత్తుతో స్టేజీని సిద్ధం చేస్తున్నారు. స్టేజీ పనులను తిరుపతి జేసీ ధ్యాన్‌చందర్, వైజాగ్ వీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యవేక్షిస్తున్నారు. 800 అడుగుల పొడవు, 420 వెడల్పు గల జర్మన్ హ్యాంగర్స్‌తో భారీ టెంట్‌ను వేస్తున్నారు. ఆదివారం టీడీపీ నేత అచ్చెన్నాయుడు, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్త, ప్రత్యేకాధికారులు ప్రద్యుమ్న, బాబు.ఎ, వీర పాండ్యన్, వ్యవసాయ శాఖ కమీషనర్ హరికిరణ్, రాష్ట్ర అదనపు డీజీపీ బాగ్చీ, ఐజీలు రాజశేఖర్‌బాబు, అశోక్ కుమార్, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సీపీ రామకృష్ణ, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు.

అధికారులకు సీఎస్ సూచనలు

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గన్నవరం మండలం కేసరపల్లి మేధా టవర్స్ పక్కన జరుగుతున్న ప్రమాణాస్వీకార ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. సంబంధిత అధికారులకు సీఎస్ సూచనలు చేశారు. ప్రధాని మోదీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసన సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు వస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు గన్నవరం జాతీయ రహదారి పక్కనే, వెటర్నరీ కళాశాల, సావరగూడెం రోడ్డు ఎలిట్ విస్టాస్, మేధా టవర్స్ ఇతర లేఅవుట్‌లో ఎంపిక చేసిన పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఎలిట్ విస్టాస్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, న్యాయమూర్తులు, తదితర ప్రముఖులకు పార్కింగ్ స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రధాన మంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధాన సభా వేదిక వద్దకు చేరుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచన చేశారు.

చకచకా.. అమరావతి



ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్, జూన్ 9 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను భక్తులు ఆదివారం విశేషంగా దర్శించుకున్నారు. వేకువజామునుంచే అమ్మవారిని దర్శించుకునడానికి భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాలనుంచి తరలి వచ్చిన భక్తులు వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయకమిషనర్ సత్యనారాయణ స్వయంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు..

కనకదుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు కుటుంబసభ్యులు కలిసి దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆలయ మర్యాదలు కల్పించగా.. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.

మాజీమంత్రులు నిమ్మకాయల చిన రాజప్ప, యనమల రామకృష్ణుడు, మండలి బుద్దప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు. వీరిలో చిన్నరాజప్ప, మండలి బుద్ద ప్రసాద్‌లు తాజాగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలు అందజేశారు. వీరికి టీడీపీ బీసీ, మైనార్టీ నాయకుడు నాగుల్‌మీరా, కాంద్రేగుల రవీంద్రలు స్వాగతం పలికారు.

ఆదివారం దుర్గమ్మ దర్శనార్థం వచ్చిన నూతన దంపతులకు అమ్మవారి కుంకుమ ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు. ఆలయంలో అన్నవితరణకు విజయవాడ కానూరుకు చెందిన చిట్టూరి యఘ్నేశ్వర నారాయణ గుప్త, ఆయన కుటుంబసభ్యులు రూ. 1,01,116 విరాళం అధికారులకు చెక్కు రూపంలో అందజేశారు.

దుర్గమ్మ ఆదాయం రూ.51.03 లక్షలు

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఊహించని విధంగా భక్తుల రాకతో ఆదాయం వృద్ధి చెందింది. దేవస్థానం విడుదల చేసిన ప్రకటన మేరకు రాత్రి 8.30 గంటల వరకు వివిధ దర్శన రుసుం టికెట్‌ల ద్వారా రూ.51,03,032మేరకు ఆదాయం లభించింది. రూ.500 దర్శనం టికెట్ ద్వారా రూ.28,52,600లు, రూ.300 టికెట్ ద్వారా రూ.13,37,000లు, రూ.100 టికెట్ ద్వారా రూ.8,93,800లు ఆదాయం చేకూరింది. 4,601 మంది కేశఖండన శాలలో తమ తలనీలాలను సమర్పించారు. 68,487 లడ్డూ ప్రసాదాలను, 33,345 పులిహోర ప్రసాదం ప్యాకెట్‌లను విక్రయించారు. రూ.3,02,757 విరాళాల ద్వారా సమకూరింది.



దుర్గగుడికి వీరమహిళలు, నేతల పాదయాత్ర

వన్‌టౌన్ : జనసేనాధిపతి పవన్‌కల్యాణ్ పిఠాపురంలో భారీ విజయం సాధించినందుకు జనసేన వీరమహిళలు, నాయకులు ఆదివారం మంగళగిరి జనసేన కార్యాలయం నుంచి విజయవాడ దుర్గగుడి వరకు పాదయాత్ర నిర్వహించి మొక్కును తీర్చుకున్నారు. తాడేపల్లి మండల జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వీరంతా పాదయాత్ర నిర్వహించారు. జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



భక్తులతో కిటకిటలాడిన సుబ్బారాయుడి ఆలయం

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మోకాళ్లపై తిరుమల వెంకన్నకు మొక్కు చెల్లింపు

ఘంటసాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావాలని ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో టీడీపీ నాయకులు బోయిన మణి, కుంపటి చిట్టిబాబు, సుంకర వినయ్ కుమార్‌లు ఆదివారం తిరుమల వెళ్లి మోకాళ్లపై మెట్లెక్కి మొక్కు తీర్చుకున్నారు.



నేడు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రతినిధుల అభినందన సభ

విజయవాడ కల్చరల్, జూన్ 9 : ప్రజాస్వామ్య ప్రక్రియలో జాతీయంగా జరిగే ప్రత్యక్ష ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడంలో చేసిన కృషికి కారణంగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ప్రతినిధులను ఈనెల 10వ తేదీ సోమవారం సిద్ధార్థ ఆడిటోరియంలో సత్కరించనున్నట్టు జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి నిర్వాహకులు గోళ్ల నారాయణరావు తెలిపారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ప్రధాన నగరాలు, పట్టణాలలో ఓటు వినియోగంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడమే ప్రధాన లక్ష్యంగా సాగిందన్నారు. ఏడాది నుంచి ప్రధానంగా యువ ఓటర్లను చైతన్య పరచడంలో జరిపిన కృషి ఎంతో అభినందనీయమన్నారు. మాజీ న్యాయమూర్తులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన విశ్రాంత ఉన్నతాధికారులు, ప్రజాసేవ కాంక్ష కలిగిన వివిధ వర్గాలకు చెందిన వారితో ఏర్పాటు చేసిన సిటిజెన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ బృందానికి సోమవారం సాయంత్రం 4 గంటలకు సిద్ధార్థ ఆడిటోరియంలో ఆత్మీయ అభినందన సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఇటీవల జరిగిన ఎన్నికల తీరు తెన్నులు-సరళిపై ఏపీ ఎలక్షన్ వాచ్ కన్వీనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

జేఈఈ ప్రవేశ పరీక్షలో శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం : జేఈఈ అడ్వాన్సడ్ 2024 ప్రవేశ పరిక్ష ఫలితాలలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన సీనియర్ ఎంపీసీ విద్యార్థులను ఆదివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మొగల్రాజపురం శారద విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, ఎండీ వై.శారదా దేవి అభినందించారు. ఎ.సంపత్ (729), కె.నాగ రాహుల్ ధ్రువ (3670), యం.నాగలక్ష్మీదేవి (536), పి.పవిత్ర (5544), పి.వెంకట ఫణికుమార్ (7689) తదితరులు మంచి ర్యాంకులు సాధించారని చెప్పారు. సీటు వచ్చే విధంగా విద్యార్థులు మార్కులు సాధించడం అభినందనీమన్నారు. పరిమితమైన విద్యార్థులతో మంచి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. వత్తిడి లేని విద్య క్రమశిక్షణ, అధ్యాపకులు సలహాలు, సూచనలు ప్రశాంత వాతావరణం, ఆన్‌లైన్ పరిక్షా ప్రణాళిక, విద్యార్థుల శ్రద్ధ, తల్లిదండ్రుల సహకారం కారణమని కళాశాలల అడ్వైజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జీవీ రావు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఎ.సంపత్ 729 | కె.నాగరాహుల్‌ధ్రువ 3670 | యమ్. లలితాదేవి 5366 | పి.పవిత్ర 5544 | పి.వి ఫణికుమార్ 7689

- రాజధాని ప్రాంతంలో సీఎస్ నీరబ్ కుమార్ సుడిగాలి పర్యటన
- 12న కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం.. శరవేగంగా పనుల నిర్వహణ

కృష్ణలంక, జూన్ 9 : అమరావతి రాజధాని ప్రాంతంలో ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సీఆర్‌డీఏ అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఈనెల 12న కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో సీఎస్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకొంది. గత చంద్రబాబు ప్రభుత్వం అమరావతి రాజధానిని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టగా గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఐదేళ్లుగా రాజధాని ప్రాంతంలో నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ పనులన్నీ శరవేగంగా పునఃప్రారంభం అయ్యేందుకు అవకాశం వున్నందున సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ చార్జి తీసుకొన్న రెండు రోజుల్లోనే రాజధాని ప్రాంతంలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకొంది. అమరావతి రాజధాని నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొంటోంది. ఇప్పటికే గత నాలుగైదు రోజులుగా రాజధాని ప్రాంతంలో 83 జేసీబీలు, టిప్పర్లు వంటి యంత్రాలతో రాజధాని శంకుస్థాపన ప్రాంతంలోను, సీడ్ యాక్సిస్ రహదారి, కరకట్ట రహదారి సహా ఇతర మాస్టర్ ప్లాన్‌లోని ప్రధాన రహదారులు వెంబడి చిన్న చిన్న మరమ్మతులు నిర్వహించడం, తుప్పలు తొలగించడం, విద్యుత్ దీపాల పునరుద్ధరణ వంటి పనులను సీఆర్‌డీఏ అధికారులు చేపట్టారు.

ఈనెల 12న నూతన ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే అమరావతి రాజధాని నిర్మాణాన్ని శరవేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్న నేపథ్యంలో సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ పర్యటన నిర్వహించారు.



రాజధాని ప్రాంతంలో నిర్మాణ పనులను, ప్లాన్‌ను సీఆర్‌డీఏ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న సీఎస్

గతంలో 2015లో అమరావతి రాజధానికి శంకుస్థాపన జరిగిన సమయంలో ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా వుండటంతో ఆయనకు రాజధాని నిర్మాణానికి సంబంధించిన పనులపై పూర్తి అవగాహన వుంది.

సీఎస్ పర్యటనలో భాగంగా రాజధాని ప్రాంతంలో అసంపూర్తి నిర్మాణ పనులతో మధ్యలో ఆగిపోయిన వివిధ భవన నిర్మాణాలను పరిశీలించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి సంబంధించి గతంలో భూమి పూజ జరిగిన ఉద్దండరాయుని పాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. తదుపరి అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యే క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో ఉద్యోగుల నివాస భవన సముదాయాలను సీఎస్ పరిశీలించారు. అలాగే 10 ఎంఎల్డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, హేపీ నెస్ట్ వంటి నిర్మాణాలను పరిశీలించారు.

అదేవిధంగా ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న హైకోర్టు అదనపు భవన సముదాయాన్ని కూడా సీఎస్ పరిశీలించారు.

అనంతరం నూతన ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే అమరావతి రాజధాని ప్రాంతంలో పనులను శరవేగంగా ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ సీఆర్‌డీఏ అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో సీఎస్‌తో పాటు సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, అదనపు కమిషనర్, ఎస్ఈ ఇతర ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



రాజధాని ప్రాంతాలను పరిశీలిస్తున్న సీఎస్





రాజధాని శంకుస్థాపన జరిగిన సమయంలో ప్రధాని మోదీ, అప్పటి సీఎం చంద్రబాబుకు వివరాలు తెలియజేస్తున్న నీరబ్‌కుమార్ ప్రసాద్ (ఫైల్)

పోలవరం, అమరావతి నిర్మాణమే ప్రథమ లక్ష్యం

- కేశినేని శివనాథ్(చిన్ని)

వన్‌టౌన్, జూన్ 9 : పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేయడమే తమ ముందున్న ప్రథమ లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రిగా మోదీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రజల కలల రాజధాని అమరావతి నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, కేంద్రంలో టీడీపీకి లభించిన ప్రాధాన్యత, గన్నవరంలో చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు తదితరాలపై ఆయన స్పందించారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర క్యాబినెట్‌లో ఇద్దరు ఎంపీలకు అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఎంపీలందరూ సమన్వయంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఆంధ్రప్రజల కలల రాజధాని అమరావతి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఇందుకు కేంద్రంలోని ఏఏ శాఖల నుంచి నిధులు రావాలో తెలుసుకుని వాటిని సాధించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేయడమే తమ ముందున్న ప్రథమ లక్ష్యమన్నారు. జగన్‌పై ప్రజలు ఓట్ల రూపంల తిరుగుబాటు చేసారని వ్యాఖ్యానించారు.



పార్లమెంట్ భవన్‌లో చంద్రబాబునాయుడితో కేశినేని శివనాథ్(చిన్ని)

చంద్రబాబును కలిసిన కేశినేని శివనాథ్

భారత ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకార మహోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం జరిగింది. మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం పార్లమెంట్ భవన్‌లో కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ జీఎం హరీష్ బాలయోగి, వైశాఖ ఎంపీ శ్రీభరత్‌తో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును కలిసారు.

ప్రత్యేక హోదా తెచ్చేందుకు ఎంపీలు కృషి చేయాలి

- కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జూన్ 9 : ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ముగ్గురు ఎంపీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేందుకు కృషి చేయాలని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర మంత్రి వర్గంలో కింజారపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మకు చోటు దొరకడం ముదావహమన్నారు. కింజారపు రామ్మోహన్‌నాయుడు మూడు పర్యాయాలు శ్రీకాకుళం నుంచి ఎంపీగా గెలుపొంది ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రైల్వేజోన్ తీసుకురావడంతో పాటు విభజన హామీలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్య పేట చరిత్రను తిరగరాసిన తాతయ్య

- మూడోసారి గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు

జగ్గయ్యపేట, జూన్ 8 : జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఒకసారి వద్దని ఓటరు తీర్పు చెప్పాక మళ్లీ ఆ అభ్యర్థి గెలిచిన దాఖలాలు లేవు.. గత 2019 ఎన్నికలలో ఆ రికార్డును చేరిపేసిన సామినేని ఉదయభాను సరసన శ్రీరాం తాతయ్య కూడా చేరారు. అప్పటి వరకు ఓటమి ఎరుగని శ్రీరాం తాతయ్య 2019 ఎన్నికల్లో అనూహ్యంగా ఓటమి చవిచూశారు. ఒకసారి ఓడిపోయిన వారిని తిరిగి అందలం ఎక్కించని పేట ఓటర్లు 2024లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉదయభానును కాదని తాతయ్యకే మూడోసారి పట్టం కట్టారు. ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన శ్రీరాం తాతయ్య అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు.

చరిత్రను పరిశీలిస్తే.. 1951లో జగ్గయ్యపేట నియోజకవర్గం ఏర్పడింది. తొలి ఎమ్మెల్యేగా పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ఎన్నిక కాగా 1957లో పునర్విభజనతో కనుమరుగైన నియోజకవర్గం 1962లో మళ్లీ పునరుద్ధరించబడి ఎస్సీకి రిజర్వ్‌గా కాగా గాలేటి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. 1967లో జనరల్ కాబడిన నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి, స్వాతంత్ర సమరయోధుడు రేపాల బుచ్చిరామయ్య శ్రేష్టి విజయం సాధించారు. 1972లో ఆయన కాంగ్రెస్ తరపున పోటీచేయగా ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ముక్త్యాల రాజా వీఆర్‌జీకే ఎం.ప్రసాద్ విజయం సాధించారు. కొద్దికాలానికే రాజా మృతి చెందటంతో జరిగిన ఉప ఎన్నికలో రాజా సతీమణి, కాంగ్రెస్ నుంచి రేపాల పోటీ చేయగా, మళ్లీ రాజా సతీమణి రాజ్యలక్ష్మమ్మ విజయం సాధించింది. 1978లో కాంగ్రెస్ తరపున బొద్దులూరి రామారావు విజయం సాధించగా, 1983లో టీడీపీ అభ్యర్థి అక్కినేని లోకేశ్వరరావు చేతిలో పరాజయం పొందారు. ఆ తర్వాత ఆయన రాజకీయ అవకాశాలు దక్కలేదు. 1985లో తెలుగుదేశం అభ్యర్థిగా నెట్టెం రఘురాం పోటీ చేయగా, కాంగ్రెస్ తరపున ముక్కపాటి వెంకటేశ్వరరావు పోటీ చేసి పరాజయం పొందారు. అదే ముక్కపాటి తిరిగి 1994లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి నెట్టెం రఘురాం విజయం సాధించారు. ముక్కపాటిని ఓడించిన ప్రజలు మళ్లీ పట్టం కట్టలేదు. 1999, 2004లలో టీడీపీ అభ్యర్థిగా నెట్టెం రఘురాం, కాంగ్రెస్ అభ్యర్థి సామినేని ఉదయభానులు పోటీ చేయగా ఉదయభానును విజయం వరించింది. 1999లో మూడుసార్లు వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచిన నెట్టెం పరాజయం పొందాక మళ్లీ ప్రజల మద్దతు పొందలేకపోయారు. 2009, 2014లలో టీడీపీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్య బరిలో నిలవగా కాంగ్రెస్ అభ్యర్థిగా, రెండోసారి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఉదయభాను రెండుసార్లు పరాజయం పొందారు. 2019లో పాత సెంటిమెంట్‌ను అధిగమించి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఉదయభాను, తెలుగుదేశం అభ్యర్థి శ్రీరాం తాతయ్యను 4778 ఓట్ల తేడాతో ఓడించి చరిత్రను తిరగ రాశారు. అదే బాటలో 2024లో వైసీపీ అభ్యర్థి ఉదయభానుపై మూడోసారి పోటీలో నిలిచిన టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య 15977 ఓట్ల తేడాతో ఓడించారు. ఒకసారి ఓడిన వారిని జగ్గయ్యపేట ప్రజలు ఆధరించరన్న అపవాదును పొగొట్టి ఉదయభాను సరసన నిలిచారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన నెట్టెం రఘురాం, సామినేని ఉదయభానుల సరసన శ్రీరాం తాతయ్య నిలిచారు.



సెంటిమెంట్‌ను బ్రేక్ చేసిన తాతయ్య

జగ్గయ్యపేట చరిత్రలో మునిసిపల్ చైర్మన్‌లుగా పనిచేసిన వారికి రాజకీయ భవిష్యత్ మృగ్యం అన్న అపవాదు, సెంటిమెంట్‌ను తాతయ్య తుడిచేశారు. జగ్గయ్యపేట పురపాలక సంఘంగా ఏర్పడినప్పడి నుంచి పనిచేసిన చైర్మన్‌లు ఎవరు తర్వాత రాజకీయాల్లో రాణించలేదు. ప్రప్రథమ మునిసిపల్ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీరాం బదరీనారాయణ తర్వాత వ్యాపారాలపై దృష్టి సారించారు. ఆ తర్వాత మహిళలకు రిజర్వ్ కావటంతో కాంగ్రెస్ తరపున నూతనంగా రాజకీయాలలోకి వచ్చి విజయం సాధించిన హనుమంతు రత్నకుమారి ఐదేళ్ల తర్వాత రాజకీయాల్లో ఇమడలేకపోయారు. బీసీలకు రిజర్వ్ కావటంతో తర్వాత వ్యాపారవేత్త కొమ్మవరపు వెంకటనారాయణ కాంగ్రెస్ నుంచి ఎన్నికైనా, తర్వాత క్రియాశీలకంగా వ్యవహరించలేక తెరమరుగయ్యారు. ఆ తర్వాత జనరల్‌గా మారిన మునిసిపాలిటికి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ తరపున మునిసిపల్ చైర్మన్‌గా ఘన విజయం సాధించి నామ మాత్రంగా (టీడీపీ) ప్రతిపక్షాన్ని మిగిల్చిన శ్రీరాం తాతయ్య అనూహ్యంగా 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలో చేరి ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్య బరిలో నిలిచి కాంగ్రెస్ అభ్యర్థి సామినేని ఉద యభానును 9678 ఓట్ల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించారు. మునిసి పల్ చైర్మన్ చేసిన వారికి రాజకీయ భవిష్యత్ ఉండదన్న అపప్రదను తొలగించి చైర్మన్ నుంచి ఎమ్మెల్యేగా పదోన్నతి సాధించారు. పేట చరిత్రలో ఎమ్మెల్యేగా ఓడి గెలిచిన వారు లేరన్న రికార్డును తుడిపేసి ఉదయభాను సరసన నిలిచిన తాతయ్య -నెట్టెం, ఉదయభానులతో సమానంగా మూడుసార్లు ఎన్నికై తాజా గెలుపుతో రికార్డును సమం చేశారు.



రామోజీ అంత్యక్రియల్లో పాల్గొన్న కొల్లు రవీంద్ర, లోకేశ్

రామోజీరావు అంత్యక్రియలకు కృష్ణాజిల్లా నేతలు

మచిలీపట్నం టౌన్, జూన్ 9 : పద్మభూషణ్, ఈనాడు పత్రిక వ్యవస్థాపకుడు చెరుకూరి రామోజీరావు అంత్యక్రియల్లో ఆదివారం మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. పత్రిక, చలనచిత్ర రంగానికి రామోజీరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. రామోజీరావు మృతికి టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్‌తో పాటు గోపు సత్యనారాయణ, సనకా నాగులు, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు.



రామోజీరావు అంతిమయాత్రలో వెనిగండ్ల

తెలుగుజాతికి స్ఫూర్తి : వెనిగండ్ల

గుడివాడ : తెలుగుజాతికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి రామోజీరావు అని, అలాంటి మహనీయుడు మృతి బాధాకరమని ఎమ్మెల్యేగా గెలిచిన వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళ్ళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, అనునిత్యం సమాజహితం కోసం, తెలుగు జాతి కోసం పనిచేసిన వ్యక్తి రామోజీరావు అని, సాధారణ కుటుంబ నుంచి వచ్చి అసాధారణ వ్యక్తిగా ఎదిగారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే రావి మాట్లాడుతూ, వ్యక్తిగతంగా రామోజీ కుటుంబంతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు.

ఆధ్యాత్మికతపై అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్, జూన్ 9: ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనపై అవగాహన కల్పించడం చాలా అవసరమని ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించడానికి జంక్షన్ వచ్చిన చాగంటి కోటేశ్వరరావు ముందుగా స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీ కాకాని బాబు అరుణ గృహానికి విచ్చేశారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యం పూజా కార్యక్రమాలు, సామూహిక వ్రతాలు నిర్వహించడం అభిలషణీయమని పేర్కొంటూ కాకాని అరుణ బాబును,కుటుంబ సభ్యుల్ని,ఆలయ నిర్వాహకుల్ని అభినందించారు. ఈ సందర్భంగా కాకాని అరుణబాబు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బెయిలీ బ్రిడ్జి

కూచిపూడి : కాజ గ్రామంలో 12 సంవత్సరాల క్రితం ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన బెయిలీ బ్రిడ్జి ప్రమాదకరస్థితికి చేరింది. వాహనదారులు, ప్రజలు ఈ వంతెనపై ప్రయాణించటానికి భయ‘ఎడుతున్నారు. కాజ గ్రామంలో ఐనంపూడి డ్రెయిన్‌పై 50 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన శిథిలమవ్వటంతో తాత్కాలికంగా బెయిలీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. తేలికపాటి వాహనాలకు మాత్రమే వంతెనపై అనుమతి ఉంది. మొవ్వ నుంచి జిల్లా కేంద్రం మచిలీపట్నం వెళ్లటానికి ఇది ప్రధాన రహదారి కావటంతో దీనికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం బెయిలీ బ్రిడ్జి ప్లాట్‌పారం పూర్తిగా శిథిలమవ్వటంతోపాటు తేలికపాటి వాహనాలకే వంతెన ఊగిపోతూ తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు : మాజీ ఎంపీపీ నారాయణరావు



వంతెనపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించటం లేదని కాజ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తాతా నారాయణరావు వాపోయారు. అనేక పర్యాయాలు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పినప్పటికీ ఫలితం లేకుండాపోయిందన్నారు. బెయిలీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పుడే రెండు సంవత్సరాల వ్యవధిలో శాశ్వత వంతెన నిర్మాణం చేస్తామని అధికారులు చెప్పి, ఆ దిశ ప్రయత్నాలు చేయలేదన్నారు. ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకుని శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాల్సిందిగా నారాయణరావుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

లోకేశ్‌కు అభినందన

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 9: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు బలంగా నమ్మారని టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. ఉండవల్లిలోని నివాసంలో నారా లోకేశ్‌ను ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో లోకేశ్ తిరుగులేని మెజారిటీతో గెలిచి రికార్డు సృష్టించారన్నారు.


లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గొట్టుముక్కల రఘురామరాజు

మెగా మెడికల్ క్యాంప్

పాతరాజరాజేశ్వరి పేట, జూన్ 9: వించిపేట గాంధీబొమ్మ సెంటర్‌లోని శ్రీవిద్యాంజలి హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. ముఖ్య అతిథి టీడీపీ నాయకుడు ఎంఎస్ బేగ్ మందులను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తూర్పులో డబుల్ హ్యాట్రిక్

- వరుసగా మూడోసారి గద్దెకు గెలుపు, వైసీపీ అభ్యర్థికి ఓటమి
- కుట్రలు, తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టిన ఓటర్లు
- విజయోత్సవంలో మాజీ కార్పొరేటర్ చందన సురేష్

కృష్ణలంక, జూన్ 9: "ఎవరెన్ని కుట్రలు పన్నినా, తప్పుడు ప్రచారాలు చేసినా తూర్పు నియోజకవర్గ ఓటర్లు వాటిని తిప్పికొట్టారు. వరుసగా మూడోసారి గద్దె రామ్మోహన్‌కు హ్యాట్రిక్ విజయం అందించారు. వైసీపీ అభ్యర్థికి హ్యాట్రిక్ ఓటమిని నియోజకవర్గంలో అందించారు. దీంతో తూర్పులో డబుల్ హ్యాట్రిక్ వచ్చింది." అని మాజీ కార్పొరేటర్ చందన సురేష్ అన్నారు. ఆదివారం కృష్ణలంక 22వ డివిజన్‌లో చందన సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బొప్పన భవకుమార్, జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు పాల్గొన్నారు. తొలుత రామోజీరావు మృతికి సంతాపంగా ఐదు నిమిషాలు మౌనం పాటించారు. పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేకు కట్ చేశారు. తూర్పు నియోజకవర్గంలో పనిచేసే వారికే ప్రజలు పట్టం కడతారని గద్దె రామ్మోహన్ భారీ మెజార్టీతో గెలవడంతో మరోసారి రుజువైందని చందన సురేష్ అన్నారు. వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, పెద్ది అన్నారావు, మహ్మద్ హాజీ, లడ్డు, తోట శ్రీను, కొవ్వూరి కిరణ్, నడికొప్పుల శివ, క్రాంతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.



22వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న గద్దె రామ్మోహన్, రామలింగేశ్వరనగర్ రంగా పార్క్‌లో వీఎం రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న గద్దె రామ్మోహన్

గెలిపించినందుకు కృతజ్ఞతలు

పటమట: తూర్పు ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించి నందుకు ఎస్ఎస్ఎం వాకర్స్‌కు గద్దె రామ్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఉదయం ఎస్ఎస్ఎం స్కూల్‌లో వాకర్స్‌ను కలిసి తన విజయానికి సహకరించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఎస్ఎం స్కూల్, లయోలా కాలేజ్, పటమట హైస్కూళ్లలో వాకర్స్‌కు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తానని, అధునాతన వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనను వాకర్స్ సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు వెంకయ్యబాబు, సత్యనారాయణ, కృష్ణారావు పాల్గొన్నారు.


గద్దె రామ్మోహన్‌ను సత్కరిస్తున్న ఎస్ఎస్ఎం వాకర్స్

రామలింగేశ్వరనగర్‌లో విజయోత్సవ ర్యాలీ

రామలింగేశ్వరనగర్: గద్దె రామ్మోహన్ ఘన విజయం సాధించడంతో 15వ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రంగా పార్కులో వంగవీటి మోహనరంగా విగ్రహానికి గద్దె రామ్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, గాదిరెడ్డి అమ్ములు, హయ్యద్ ఖాన్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెత్తపన్ను వసూలు నిలిపివేత హర్షణీయం

- కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్

పటమట, జూన్ 9: చెత్త పన్ను వసూళ్లను కూటమి ప్రభుత్వం వచ్చాక రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పారని, ఆ మాట ప్రకారం విజయవాడ కార్పొరేషన్‌లో చెత్త పన్ను వసూలు నిలిపేశారని కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ తెలిపారు. దీనిపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్ తనకు అనుకూలమైన సంస్థలకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని చెత్త ఆటోల పేరుతో దోచిపెట్టారని ఆరోపించారు. చెత్త పన్ను వసూళ్లను మొదటి నుంచి టీడీపీ, జనసేన పార్టీలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయని, తాము అనేక దఫాలుగా కార్పొరేషన్‌లో చెత్తపన్ను ఉపసంహరించుకోవాలని పాలకపక్షాన్ని కోరినా పట్టించుకోలేదన్నారు. జగన్ తన సన్నిహితుల ద్వారా 2,164 ఆటోలు కొనిపించి, స్వచ్ఛాంధ్ర పేరుతో రాష్ట్రంలోని నగరపాలక, పురపాలక సంఘాలకు ఇచ్చి ప్రజల నుంచి వినియోగ రుసుం పేరుతో ఒక్కో ఆటోకు రూ.65వేలు కిరాయిలు చెల్లించి వారికి మేలు చేశారన్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల ముందు తాము వైసీపీ గెలిస్తే చెత్త పన్ను తెస్తుందని చెప్పినా ప్రజలు వారికే పట్టం కట్టారని, అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్తపన్నులు వసూలు చేయడం మొదలు పెట్టారని, ఆస్తి పన్నులు పెంచారని అన్నారు. వైసీపీ మోసాన్ని ప్రజలు జీర్ణించు కోలేదని దాని ఫలితమే కూటమి ఘన విజయమన్నారు.

దుర్గగుడి లడ్డూ ప్రసాదాల కౌంటర్‌లో
అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతివాటం

వన్‌టౌన్, జూన్ 9: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహామండపం దిగువన ఉన్న లడ్డూ ప్రసాదాల కౌంటర్‌లో పనిచేస్తున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతివాటం ప్రదర్శిస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. భక్తులకు తక్కువ లడ్డూలు ఇస్తున్నాడని, చిల్లరనూ తగ్గించి ఇస్తున్నాడని ఇదివరకు భ్రమరాంబ ఈవోగా పనిచేసిన సమయంలో రెండుసార్లు ఆ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అండదండలతో మళ్లీ లడ్డూ కౌంటర్‌లో చేరాడు. ఇటీవల ముగ్గురు భక్తులకు లడ్డూలు విక్రయించినప్పుడు తక్కువగా ఇవ్వడం, ఇవ్వాల్సిన చిల్లర ఇవ్వకపోవడంతో వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ ఉద్యోగి ఇష్టానుసారంగా భక్తులను దోచుకుంటున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రసాదాల పోటు నుంచి వచ్చే లడ్డూ స్టాక్‌లో కూడా అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రసాదాల కౌంటర్‌ల వద్ద అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం వలన కౌంటర్లలో విధులు నిర్వహించే పలువురు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా భక్తులను మోసం చేస్తున్నారని తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వంలో యువతకు ఉపాధి కల్పిస్తాం

వన్‌టౌన్, జూన్ 9: కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ అన్నారు. విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్, పశ్చిమ ఎమ్మెల్యేగా సుజనా చౌదరి విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ వించిపేటలోని తన కార్యాలయంలో ఎంఎస్ బేగ్ కేక్ కట్ చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపులో తెలుగుయువత పాత్ర కీలకపాత్ర పోషించిందన్నారు. షైలపల్లి రాజు, షైలా సతీష్, తమ్మిన శేఖర్, బెవర సాయి పాల్గొన్నారు.


వించిపేటలో కేక్ కట్ చేస్తున్న ఎంఎస్ బేగ్

నెహ్రూ బొమ్మసెంటర్‌లో విజయోత్సవాలు

చిట్టినగర్: ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజ యం సాధించడాన్ని పురస్కరించుకుని టీడీపీ 51వ డివిజన్ నాయకుడు ఈది నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నెహ్రూబొమ్మ సెంటర్‌లో నిర్వహించిన విజయోత్సవంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ కేక్ కట్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని మరచి ప్రజలపై పన్నుల భారాలను మోపిందని, అందుకే ప్రజలు ఏకపక్షంగా కూటమిని గెలిపించారని అన్నారు. చంద్రన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తమ్మిన శేఖర్, రవికుమార్, ఎర్రరెడ్డి, పీతల కనకరావు, సారిపల్లి దుర్గారావు, వి.రాము, ధర్మ పాల్గొన్నారు.

టీ-20 చాంపియన్‌గా పశ్చిమ గోదావరి



విజయవాడ స్పోర్ట్సు, జూన్ 9: మూలపాడు ఏసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ సెంట్రల్ జోన్ పురుషుల సీనియర్ టీ-20 అంతర జిల్లాల క్రికెట్ టోర్నీలో ఎనిమిది పాయింట్ల(నెట్‌రన్ రేట్ 0.9)తో పశ్చిమగోదావరి జిల్లా చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం ప్రకాశంపై జరిగిన చివరి మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి జిల్లా నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాట్‌పట్టిన ప్రకాశం 20 ఓవర్లలో 146/4 పరుగులు చేయగా, అనంతరం బరిలో దిగిన పశ్చిమ జట్టు 19.2 ఓవర్లలో 147/6 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. కృష్ణా-గుంటూరు మ్యాచ్‌లో గుంటూరు 3 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కృష్ణా టీమ్ 20 ఓవర్లలో 151/8 పరుగులు చేయగా, గుంటూరు 17.1 ఓవర్లలో 157/7 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. రన్‌రేట్ ఆధారంగా కృష్ణా రెండోస్థానంలో, గుంటూరు మూడో స్థానంలో నిలిచాయి.

అచ్చెన్నాయుడికి అభినందన

పాయకాపురం, జూన్ 9: నిత్యం అబద్ధాలాడే జగన్‌కు రాష్ట్ర ప్రజలు తగినరీతిలో గుణపాఠం చెప్పారని టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. టెక్కలి ఎమ్మెల్యేగా గెలుపొందిన కింజారపు అచ్చెన్నాయుడును నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం పరుచూరి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందినందుకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో దారితప్పిన వ్యవస్థలను చంద్రబాబు బాగుచేస్తారని పేర్కొన్నారు.


అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు చెబుతున్న పరుచూరి ప్రసాద్

పార్కు బోర్డుపై పేరు తొలగించిన ముగ్గురు అరెస్టు

విద్యాధరపురం, జూన్ 9: భవానీపురం క్రాంబ్వే రోడ్డులోని ఓ పార్కు బోర్డుపై వైఎస్సార్ పేరును తొలగించిన కేసులో భవానీపురం పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. 41వ డివిజన్‌కు చెందిన పొనుగుపాటి వెంకటనవీన్, 41వ డివిజన్‌కు చెందిన జె.జయబాలన్, 45వ డివిజన్‌కు చెందిన ఎ.చైతన్య శనివారం ఉదయం క్రాంబ్వే రోడ్డులోని వైఎస్సార్ పార్కు బోర్డుపై వైఎస్సార్ అక్షరాలను తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు.

ఓ వర్గం దేవుడు పేరు తొలగిస్తారా?

- అరెస్టైన వారిపై వెస్ట్ ఏసీపీ ఓవరాక్షన్

క్రాంబ్వే రోడ్డులోని పార్కు బోర్డుపై వైఎస్సార్ అక్షరాలు తొలగించిన కేసులో వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఓవరాక్షన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో అరెస్టైన వెంకటనవీన్, జయబాలన్, చైతన్యలను అసభ్యకరంగా దూషించి, ఓ వర్గానికి చెందిన దేవుడి పేరును తొలగిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని, స్వయంగా ఆయనే ఆరు సెక్షన్లను నమోదు చేయించారని అరెస్టైన వారు ఆరోపించారు. 41 నోటీసు ఇచ్చే కేసులో ఆరు సెక్షన్లు ఎలా పెడతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

అభాగ్యుడికి సపర్యలు

భవానీపురం, జూన్ 9: భవానీపురం బైపాస్ డివైడర్ వద్ద కదల్లేక అచేతనంగా ఉన్న ఊరు, పేరు సరిగ్గా చెప్పలేని ఓ అభాగ్యుడిని చూసి లయన్స్ గెలాక్సీ క్లబ్ డ్రిస్టిక్ట్ చైర్మన్, సోషల్ వర్కర్ నారిండి కిషోర్ చలించిపోయారు. అతన్ని ఎత్తుకుని సురక్షితంగా చెట్టు కింద కూర్చోపెట్టి సపర్యలు చేశారు. మంచి భోజనం పెట్టించి, అతడిని ఆదుకోవాలని మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి చెప్పారు. రెండు రోజులుగా వృద్ధుడు రోడ్డు మీద మతిస్థిమితం లేకుండా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారని, హిందీలో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాడని, వివరాలేమి తెలియలేదని కిషోర్ చెప్పారు. అనాథ ఆశ్రమం లేదా వీఎంసీ అధికారులు చేరదీయాలని కోరారు.


వృద్ధుడిని ఎత్తుకుని తెస్తున్న నారిండి కిషోర్

బైకు కాల్చివేత

వన్‌టౌన్, జూన్ 9: వైసీపీ తూర్పు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్న పిల్లి వెంకటేశ్వరరావుకు చెందిన ఏపీ 16సీఎల్9681 పల్సర్ బైకును గుర్తు తెలియని దుండగులు కాల్చివేసినట్లు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పిల్లి వెంకటేశ్వరరావు ఫకీరుగూడెంలోని తన ఇంటి ముందు బైక్ పార్క్ చేశాడు. శనివారం రాత్రి ఒకటిన్నర గంటల సమయంలో పెద్ద శబ్దం రావడంతో తాను, తన భార్య బయటకు వచ్చి చూడగా బైకు కాలిపోతుండడంతో నీళ్లు పోసి ఆర్పేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు దురాగతానికి పాల్పడ్డారని, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం, జూన్ 9: భవానీపురం పరిధిలోని 11కేవీ ఐరన్ యార్డ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం పలు ప్రాంతాల్లో సూచించిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ ఆఫీస్ ఎదురు, పాత ఎంఐజీ బ్లాకులు, ఎల్ఐజీ బ్లాకులు, ఐరన్‌యార్డ్, రిలయన్స్ పక్కన, పడమట వారి వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పాయకాపురం: పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా రాధానగర్, బర్మాకాలనీ, విశాలాంధ్రకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వృద్ధుడి కుటుంబానికి 'దీవెన' సహాయం

విజయవాడ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడికి దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరపున నిత్యావసర సరుకులను అందజేసింది. జక్కంపూడి కాలనీలో నివాసం ఉంటున్న మచ్చ తాతారావు కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న దీవెన ఫౌండేషన్ రూ.2 వేలు, నిత్యావసర సరుకులను అందజేసింది. పెన మలూరు హెడ్ కానిస్టేబుల్ తరుణ్, రవి సహాయం చేశారు.



ధర్మపథం వేదికపై శాస్త్రీయ నృత్య ప్రదర్శన

వన్‌టౌన్, జూన్ 9: దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ధర్మపథం వేదికపై ఆదివారం పీఎస్వై రాజేశ్వరి ఆధ్వర్యంలో రాజేశ్వరి నృత్యనికేతన్ కళాకారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసి అలరించారు. వివిధ సంప్రదాయ కీర్తనలకు నాట్యప్రదర్శన చేశారు. వినాయకుడు, లక్ష్మీ, సరస్వతి వేషధారణలు నృత్యప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. తిలోత్తమ, భవ్య, భవాని, గోమతి, చైత్ర, సన, షణ్ముఖ, ప్రవల్లిక, కృత్తిక, మాధవి, దీక్షిత, వేదిత పాల్గొన్నారు.

రామోజీరావుకు సర్వోదయ ట్రస్ట్ సభ్యుల నివాళి

గవర్నర్‌పేట, జూన్ 9: స్వాతంత్ర్య సమరయోధుల కృష్ణాజిల్లా సంఘం ఆధ్వర్యంలోని సర్వోదయ ట్రస్ట్‌కు చెందిన సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో రామోజీరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ జీవీ మోహన్‌ప్రసాద్, సభ్యులు మట్టా జయకర్, ఎస్ఆర్‌వి డాక్టర్ నగేష్ చెన్నుపాటితో కూడిన బృందం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వర్మపై దాడి.. పవన్ సీరియస్..!

- వన్నెపూడి ఘటనపై విచారణకు ఆదేశం
- కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌కు బాధ్యతలు
- వారం రోజుల్లో పిఠాపురానికి జనసేనాని
- నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు
- జనసైనికులు సంయమనం పాటించాలి: నాగబాబు



అమరావతి (ఆంధ్రజ్యోతి), పిఠాపురం, జూన్ 9: పిఠాపురంలో జనసేన గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన మాజీ ఎమ్మెల్యే వర్మపై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన దాడిని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ సంఘటన వెనుక ఎవరున్నారు..? అనే దానిపై వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీనిపై విచారణ జరిపే బాధ్యతలను పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ అప్పగించారు. ప్రస్తుతం ఆయన నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి ఆదివారం ఢిల్లీ వెళ్లారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఈ నెల 12న జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బిజీబిజీగా ఉంటారు. అనంతరం ఆయన పిఠాపురం వెళ్లి అక్కడ పరిస్థితిని చక్కదిద్దనున్నారు. ఈ లోగా సంఘటనకు కారణాలు, ఇతర అంశాలపై పార్టీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నివేదిక సిద్ధం చేయాని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగానే పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఈ ఘటనలో పాలొన్నట్టు తెలిస్తే మాత్రం వారిపై తీవ్ర చర్యలు ఉంటాయన్న హెచ్చరికలు పంపించారు. తప్పు చేసిన ఎంతటి వారైనా ఉపేక్షించది లేదని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఇప్పటికే హెచ్చరించారు. అధినేత పవన్ కల్యాణ్ వచ్చిన తర్వాత ఘటనపై తుదినిర్ణయం తీసుకోనున్నారు.

ఘటనపై వివరాలు సేకరిస్తున్నాం: నాగబాబు

వన్నెపూడిలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మపై జరిగిన దాడి, తదనంతర పరిణామాలు పార్టీ దృష్టికి వచ్చాయని, దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆదివారం తెలిపారు. పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఇందులో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుచేసిన వారిని ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తాటిపర్తి గ్రామంలో జరిగిన సంఘటన గురించి తమకు సమాచారం ఉందని, పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక నేతలతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. జనసైనికులందరూ సంయమనం పాటించాలని కోరారు. సాధ్యమైనంత వరకూ తాను కూడా నియోజకవర్గంలోనే అందుబాటులో ఉంటానని, సమస్యలు ఏమైనా ఉంటే కూర్చొని పరిష్కరించుకుందామని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మారు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మి ఓటు వేశారని, దీనిపై చర్చ ఎందుకని అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఓడిపోవడంపై స్పందిస్తూ 'ఇది ప్రజాతీర్పు అన్నారు. ఆ తీర్పుకు శిరసా వహించాల్సిందే. సీన్ ఈజ్ ఓవర్ అన్నారు. 40 శాతం ఓట్లు వచ్చాయని ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి తెలిపారని, అక్కడినుంచి నిలబడి వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతామని చెప్పారు. ఇదే తమ ప్రధాన అజెండా అని చెప్పారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి గిరిజనులంతా తరలిరావాలి: ధారునాయక్

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడి ప్రమాణస్వీకార కార్యక్రమానికి గిరిజనులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఘనవిజయం సాధించిన కూటమి తరపున ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించే దినంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. 16గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ సర్కార్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపిన గిరిజనులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో గిరిజనులు ఎదుర్కొన్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

వీసీలు స్వచ్ఛందంగా తప్పుకోవాలి: ఏఎస్ రామకృష్ణ

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులందరూ వెంటనే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం బలవంతంగా తొలగించక ముందే స్వచ్ఛందంగా తప్పు కోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, ముఖ్యంగా ఆంధ్రావర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, నాగార్జున వర్సిటీ వీసీ రాజశేఖర్ వైసీపీ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొన్నారు. వర్సిటీల్లో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంపై దృష్టి పెట్టకుండా, వర్సిటీలను వైసీపీ కార్యాలయాలుగా మార్చారు. అత్యుత్సాహంతో వర్సిటీల్లో వైఎస్సార్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ఘన విజయంతో అధికారం చేపడుతున్నా, ఇంకా ఏ ముఖం పెట్టుకుని, వీసీ పదవుల్లో కొనసాగుతారని మండిపడ్డారు.

బాబు పాలనలో ఏపీ అభివృద్ధి చెందాలి

- కాబోయే సీఎంకు నవీన్ పట్నాయక్ అభినందనలు

భువనేశ్వర్, జూన్ 9: టీడీపీ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కాలని బీజేడీ చీఫ్, ఒడిసా ఆపద్ధర్మ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించినందుకు చంద్రబాబును అభినందించారు. చంద్రబాబుతో మాట్లాడి అభినందనలు తెలియజేశానని ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. తన రాజకీయ జీవితంలో చంద్రబాబుతో సుదీర్ఘ అనుబంధం ఉందని నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించగా, వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే.

హైవేపై ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- బెంబేలెత్తిన వాహనదారులు.. కాంట్రాక్టర్ కక్కుర్తే కారణం
- కత్తిపూడి- ఒంగోలు హైవేపై తప్పిన పెను ప్రమాదం



గుడివాడ, జూన్ 9: కాంట్రాక్టర్ కక్కుర్తి ఫలితంగా ఏకంగా జాతీయ రహదారి పైనే విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిపై ఒక్కసారిగా స్తంభాలు వంగిపోవడంతో వాహనదారులు బెంబెలెత్తిపోయారు. గుడివాడ మండలం రామనపూడి గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం సుమారు 11.30 గంటలకు ఒక్కొక్కటిగా 7 స్తంభాలు నెలకొరిగాయి. అయితే ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒరిగిన స్తంభాలు దాదాపుగా రహదారికి సగానికి పైగా ఆక్రమించడంతో ప్రమాదకరంగా మారాయి. కాగా, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. విద్యుత్ అధికారులు తీరిగ్గా సాయంత్రం 5 గంటలకు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి వైర్లను కత్తించారు. స్తంభాలను యథావిధిగా వదిలేశారు. కనీసం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయలేదు. దాదాపు ఐదున్నర గంటలపాటు ప్రజలు ఆ ప్రాంతంలో బిక్కుబిక్కు మంటూ గడిపారు. ఇక, ఈ స్తంభాలను వైసీపీ ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్ నాసి రకంగా వేశారు. స్తంభాలు నిలబెట్టే క్రమంలో సరైన ఫౌండేషన్ వేయలేదు. కక్కుర్తిగా పనులు చేపట్టడంతో అవి ఒరిగిపోయాయి. కాంట్రాక్టర్ వైసీపీ ముఖ్య అనుచరుడు కావడంతో అధికారులు నోరుమెదపలేక పోయారన్న ప్రచారం సాగుతోంది.



గేట్లకు రోప్ లేకుండా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు



అసంపూర్తిగా జీడీపీ ఆనకట్ట బలోపేతం పనులు

'గాజులదిన్నె'కు గండం!

- గేట్లు పెట్టారు.. రోప్ కనెక్షన్లు మరిచారు
- వరద పోటెత్తితే గేట్లు తెరిచే అవకాశమే లేదు
- 30 కోట్ల బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టరు
- జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ముప్పు
- మరో 'అన్నమయ్య డ్యాం' కాకముందే స్పందించాలి
- సాగునీటి నిపుణులు, రైతుల వినతులు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల మనుగడ ప్రమాదంలో పడింది. జగన్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం కారణంగా ఇప్పటికే కడప జిల్లాలో అన్నమయ్య డ్యాం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అక్కడో ప్రాజెక్టు ఉందనే ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో గాజులదిన్నె జలాశయానికీ అలాంటి ముప్పే పొంచి ఉంది. ప్రాజెక్టు ఆధునీకరణ, మరమ్మతుల్లో భాగంగా కొత్త గేట్లు బిగించారు. అయితే వాటి నిర్వహణకు వీలుగా రోప్స్, లైనాప్ ప్లేట్లు వంటివి ఏర్పాటు చేయలేదు. డ్యాం ఎగువన వర్షాలు పడుతున్నాయి. వరద పోటెత్తితే గేట్లు ఎత్తే అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టుకు ప్రమాదం తప్పదని సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు జగన్ ప్రభుత్వంలో రూ.30 కోట్లు బిల్లులు చెల్లించకపోవడంతో ఆరు నెలలు క్రితమే కాంట్రాక్టరు చేతులెత్తేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించకపోతే గాజులదిన్నె కూడా అన్నమయ్య ప్రాజెక్టు తరహాలో ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయలసీమ జిల్లాల్లోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో కర్నూలు జిల్లా గాజులదిన్నె (దామోదరం సంజీవయ్య సాగర్) ప్రాజెక్టు ఒకటి. కర్నూలు జిల్లా గోనేగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ, డోన్ మండలాల్లోని పలు గ్రామాల్లో రబీ పంటలకు 24,372 ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరం, కృష్ణగిరి, డోన్ పట్టణాలతో పాటుగా 125 గ్రామాలకు తాగునీరు ఈ ప్రాజెక్టు ద్వారానే అందుతోంది. బండగట్టు రక్షిత మంచినీటి పథకం ద్వారా పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 80 గ్రామాలకు పైగా తాగునీరు అందించాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా కాలువ నుంచి 3 టీఎంసీల నీటిని కేటాయించారు. దీంతో జలాశయం సామర్థ్యం 7.5 టీఎంసీలకు పెంచాలనే లక్ష్యంగా రూ.108 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ తర్వాత జగన్ ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సవరించి 5.5 టీఎంసీల సామర్థ్యానికి పెంచుతూ రూ.37 కోట్లతో ఆనకట్ట బలోపేతం, ఎత్తు పెంచడం వంటి పనులు చేపట్టారు. మరో రూ.12కోట్లతో కొత్త గేట్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులను బీఎస్‌వీ కన్‌స్ట్రక్షన్, శ్రీశ్రీ విఙ్ఞేశ్వర కన్‌స్ట్రక్షన్ సంస్థలు దక్కించుకోగా.. విజయవాడకు చెందిన కాంట్రాక్టరు కోటిరెడ్డి సబ్ కాంట్రాక్టు తీసుకుని 2022 ఏప్రిల్ 26న పనులు చేపట్టారు.



ప్రాజెక్టుకు కొత్తగా ఏర్పాటు చేసిన గేట్లు

భారీ వరదొస్తే తిప్పలే

గాజులదిన్నె ప్రాజెక్టు ఆరు గేట్ల డిశ్చార్జ్ కెపాసిటీ (వరద విడుదల సామర్థ్యం) 80 వేల క్యూసెక్కులు. ఈ గేట్లకు దశాబ్దాలుగా మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపట్టాయి. నిర్వహణ కష్టంగా మారింది. కొత్త గేట్ల ఏర్పాటులో భాగంగా 2023 సెప్టెంబరులోనే ఫ్యాబ్రికేషన్ (తయారీ), ఎరక్షన్ (పాతవాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చడం) వంటి పనులు పూర్తి చేశారు. వాటిని కిందకు, పైకి ఎత్తేందుకు(లిఫ్ట్) వీలుగా రోప్ కనెక్షన్లు, లైనాప్‌ప్లేట్స్ వంటి కీలకమైన పనులు చేయాల్సి ఉంది. చిన్న పనులే అయినా గేట్ల నిర్వహణలో ఇవే కీలకం. ఆనకట్ట బలోపేతం, గేట్ల ఏర్పాటు పనులకు దాదాపు రూ.30 కోట్ల మేర బిల్లుల చెల్లింపునకు జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు చేయలేనంటూ కాంట్రాక్టరు చేతులెత్తేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైంది. రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. కర్నూలు జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. కాగా ఆదివారం (9వ తేదీ) నాటికే 97.9 మి.మీ. కురిసింది. 3శాతం అధిక వర్షపాతం నమోదైంది. జలాశయం ఎగువన పత్తికొండ మండలంలో 89.9 మి.మీ.కు గానూ 154.6 మి.మీ. (72% అధికం), ఆలూరు ప్రాంతంలో 77.5 మి.మీ.కు గానూ 108.2 మి.మీ.(40% అధికం), మద్దికెర మండలంలో 70.2 మి.మీ.కు గానూ 77.4 మిల్లీమీటర్లు (10% అధికం) వర్షం పడింది. రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అదే జరిగితే డ్యాంకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఎఫ్ఆర్ఎల్ లెవల్ దాటి వరద పోటెత్తితే గేట్లు ఎత్తాల్సి వస్తుంది. కొత్తగేట్లకు రోప్స్, లైనాప్ ప్లేట్ల పనులు చేయకపోవడంతో ఆనకట్టకు గండి కొట్టకపోతే కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. కడప జిల్లాలో 2022 నవంబరులో అధిక వరద అన్నమయ్య ప్రాజెక్టుకు పోటెత్తడంతో ఒక గేటు రోప్ తెగిపోయి అడ్డంగా ఇరుక్కుపోవడంతో పైకి ఎత్తలేని పరిస్థితి. సామర్థ్యానికి మించి వరద రావడంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. అలాంటి పరిస్థితులు రాకముందే గాజలదిన్నె ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తిచేసి నిర్వహణకు అనుకూలంగా రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

తక్షణమే మరమ్మతులు చేపడతాం

గాజులదిన్నె ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేశాం. రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. భారీ వరదలు వస్తే ఆనకట్టకు ప్రమాదం ఉన్న మాట నిజమే. కాంట్రాక్టరుపై ఒత్తిడి తెచ్చి తక్షణమే మిగిలిన పనులు చేయిస్తాం. ప్రాజెక్టుకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

- కబీర్‌బాషా, సీఈ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, కర్నూలు



వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తి 99 కోట్లు

- అసెంబ్లీలో 79% మంది నేరచరితులే
- 138 మందిపై క్రిమినల్ కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాజాగా ఏపీ అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేలలో 138 (79%) మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వీరిలో 98 మందిపై సీరియస్ క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మొత్తం ఎమ్మెల్యేల్లో 162 మంది సంపన్నులు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 174 మంది అఫిడవిట్లను విశ్లేషించిన ఏడీఆర్ శనివారం ఓ నివేదిక విడుదల చేసింది. టీడీపీ తరపున పుట్టపర్తి ఎమ్మెల్యేగా గెలిచిన పల్లె సింధూర రెడ్డి అఫిడవిట్‌ను విశ్లేషించలేదు. 2019లో ఎమ్మెల్యేలుగా గెలిచినవారిలో 96 (55%) మందిపై క్రిమినల్ కేసులుండగా ఈసారి వారి సంఖ్య మరింత పెరిగింది. ముగ్గురిపై హత్య, 32మందిపై హత్యయత్నం కేసులు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. 22మందిపై మహిళలపై దాడులకు పాల్పడిన కేసులు ఉండగా, ఒక ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు నమోదైంది. పార్టీలవారీగా చూస్తే టీడీపీ తరఫున గెలిచిన 134మంది ఎమ్మెల్యేల్లో 115 మంది, బీజేపీ టికెట్‌పై గెలిచిన 8 మంది, జనసేన తరపున విజయం దక్కించుకున్న 10 మంది, వైసీపీ తరపున గెలిచిన ఆరుగురిపై క్రిమినల్ కేసులున్నాయి. సీరియస్ క్రిమినల్ కేసులు నమోదైన వారిలో టీడీపీలో 82మంది, బీజేపీలో ఐదుగురు, జనసేనలో ఏడుగురు, వైసీపీలో నలుగురు ఉన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేల ఆస్తులే ఎక్కువ

గత అసెంబ్లీ ఎన్నికలలో 163 మంది కోటీశ్వరులు గెలవగా ఈసారి 162మంది గెలిచారు. టీడీపీలో 127, జనసేనలో 18, వైసీపీలో 9, బీజేపీలో 8 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులేనని ఏడీఆర్ తెలిపింది. ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ ఈసారి రూ.65.07 కోట్లు ఉండగా, గత అసెంబ్లీలో రూ.27.87 కోట్లుగా ఉంది. టీడీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.67.97 కోట్లు ఉండగా, వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.99.19 కోట్లుగా ఉంది. బీజేపీ శాసనసభ్యుల సగటు ఆస్తుల విలువ రూ.34.29 కోట్లు, జనసేన ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.40.43 కోట్లుగా ఉంది.

- టీడీపీ అధినేత చంద్రబాబు రూ.931 కోట్ల ఆస్తితో అగ్రస్థానంలో ఉన్నారు. రెండోస్థానంలో నారాయణ రూ.824 కోట్లు, వైఎస్ జగన్ రూ.757 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు.
- మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎం. ఎస్ రాజుకు అందరికంటే అతి తక్కువగా రూ.12 లక్షల ఆస్తి ఉంది.
- రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే మిరియాల శిరీష రూ.19 లక్షలు, కర్నూల్ ఎమ్మెల్యే జయసూర్యకు రూ.21 లక్షల ఆస్తులున్నాయి.
- పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ కుటుంబ ఆదాయం దాదాపు రూ.73 కోట్లు ఉంది.
- విద్యార్హతల వారీగా చూస్తే.. 49 మంది ఎమ్మెల్యేలు 5 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు.
- 122 మంది డిగ్రీ ఆపై ఉన్నత విద్యావంతులు. ముగ్గురు డిప్లొమా చేశారు.
- వయసుల వారీగా చూస్తే.. 12 మంది 25-40 ఏళ్ల మధ్య, 118 మంది 41-60 ఏళ్ల మధ్య 43 మంది 61-80 ఏళ్ల మధ్య ఉన్నారు. ఒక ఎమ్మెల్యే వయసు 82 ఏళ్లు.

సీఐడీ ఆధీనంలో 'బేవరేజెస్'

- కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు
- ఫైళ్లు క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో జరిగిన అవకతవలను నిగ్గుతేల్చేందుకు సీఐడీ దూకుడు పెంచింది. రెండు రోజులుగా విజయవాడ ప్రసాదంపాడులోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు చేస్తోంది. బేవరేజెస్ ఎండీ కార్యాలయం మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోపిడీయే లక్ష్యంగా ప్రభుత్వ షాపుల ద్వారా అమ్మకాలు సాగించి, కమీషన్లు కొల్లగొట్టిన వైనంపై విచారణ చేస్తోంది. ఇష్టానుసారం ధరలు పెంచేసి, కమీషన్ల రూపంలో వేల కోట్లు దండుకున్న వ్యవహారంలో ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. ఐదు అంతస్తులున్న భవనంలో మొదటి రెండు ఫ్లోర్లు ఎక్సైజ్ కార్యాలయంగా వాడుకుంటున్నారు. పై మూడంతస్తులు కార్పొరేషన్‌కు సంబంధించినవి. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కార్యాలయానికి వచ్చి ఫైళ్లు తీసుకెళ్లినట్లు ఫిర్యాదు అందడంతో ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సీఐడీ సోదాలు చేపట్టింది. అక్కడినుంచి వచ్చిన తర్వాత బేవరేజెస్ ఎండీ కార్యాలయాన్ని సీజ్ చేసింది. బయట పోలీసుల్ని కాపలా పెట్టి సీఐడీ అధికారులు లోపల సోదాలు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సోదాలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జగన్ హయాంలో ఒక బాక్సు(కేసు) లిక్కర్‌పై రూ.250, బీరు కేసుపై రూ.150 చొప్పున వసూళ్లు చేసినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నారు. ఏడాదికి నాలుగు కోట్ల కేసులకు తగ్గకుండా ఐదేళ్లలో 20 కోట్ల కేసుల మద్యం విక్రయించి వేల కోట్లు దండుకున్న అక్రమార్కులను గుర్తించే పనిలో ఉన్నారు. కమీషన్ల రూపంలో దోచుకున్న వేల కోట్లలో జగన్‌కు వాటా వెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఆ డబ్బు దాచి, అందులో కొంత ఎన్నికల్లో ఖర్చు చేశారని, మిగిలిన డబ్బంతా బెంగళూరుకు తరలించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు ఇలా..

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 2019 అక్టోబరులో ప్రభుత్వ మద్యం షాపుల్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 3500 మద్యం షాపలను పూర్తిగా ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు. మద్యం షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలనేది ప్రభుత్వమే నిర్ణయించేది. లిక్కర్ కేసుపై రూ.250, బీరు కేసుపై రూ.150 కమీషన్‌గా ఇవ్వాలని మద్యం కంపెనీలకు వైసీపీ పెద్దలతో ప్రతిపాదన పెట్టించింది. ఇందుకు కంపెనీలు అంగీకరించలేదు. దీంతో... 'మీకు నష్టం జరగకుండా మద్యం ధర పెంచుతాం. ఆ పెంచిన ధరను తిరిగి కమీషన్ రూపంలో ఇవ్వండి' అనే విధానం తెచ్చారు. అందుకు కొన్ని కంపెనీలు అంగీకరించాయి. ప్రముఖ బ్రాండ్ల ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం ఒప్పుకోలేదు. దీంతో ఆయా కంపెనీల బ్రాండ్లను షాపుల్లో విక్రయించడం ఆపేశారు. 2020 జనవరి నుంచి వైసీపీ ప్రభుత్వ మద్యం షాపుల్లో జగనన్న బ్రాండ్లను విక్రయించింది. అలా అమ్మిన ప్రతి లిక్కర్ కేసు నుంచి వైసీపీ పెద్దలకు ముడుపులు అందాయి. గత ఐదేళ్లలో అమ్ముడైన లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలు వ్యవహారాన్ని హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఫార్మా కంపెనీకి రూ.300కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి మొత్తం సీజ్ చేయడంతో దుకాణాన్ని బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు అంటున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ పెద్దల సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్రంగా వ్యవహరించారు. ఆ తర్వాత అనేక మంది వచ్చారు. సీఐడీ వీరందరికీ నోటీసులు పంపి విచారించే అవకాశం ఉంది. మద్యం బాటిళ్ల కేసులపై కమీషన్లు, ఇటు కార్పొరేషన్‌లో వసూళ్లు కలిపి మొత్తంగా 5 వేల కోట్లకు పైగానే దోపిడీ చేసినట్లు తెలుస్తోంది.

రెండు రాష్ట్రాల్లో ఎంత తేడా...

మేన్షన్ హౌస్ బ్రాందీ 180మి.లీ. క్వార్టర్ బాటిల్ కేసు (48 సీసాలు) ఏపీ బేవరేజెస్ కంపెనీల నుంచి రూ.1697కు కొనుగోలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం దాన్ని రూ.1094కు తీసుకుంది. అంటే ఓ కేసు ధరలో వ్యత్యాసం రూ.603. ఈ మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కు అనధికారికంగా చేరినట్టు ఆరోపణలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వం మద్యం షాపుల్లో ఒక్కో క్వార్టర్ బాటిల్‌ను రూ.220కి విక్రయించగా, తెలంగాణలో రూ.170కే అమ్మారు. ఇలా పేదలకు అధిక ధరలకు మద్యం అంటగట్టి వేల కోట్లు వెనకేసుకున్నారు.

వాసుదేవరెడ్డి నుంచి సజ్జల దాకా..

జగన్ పాలనలో మద్యం దోపిడీ తతంగం నడిపించేందుకు ఎక్సైజ్, బేవరేజెస్ కార్పొరేషన్‌లో పలువురు కీలకంగా పనిచేశారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకు మాత్రమే ఎండీ వాసుదేవరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డర్లు వెళ్లేవి. తమకెందుకు ఇవ్వరని ఇతర ఉత్పత్తిదారులు ప్రశ్నిస్తే.. ఏదో మమ అనిపించేవారు. ఆ బ్రాండ్లను షాపుల్లో పెట్టి అమ్మకుండా, వాటిని ఎవరూ కొనట్లేదని వెనక్కి పంపేవారు. ఏ రోజు ఏ బ్రాండ్లు ఎక్కువ అమ్మాలన్నది సజ్జల రామకృష్ణారెడ్డి నిర్ణయించేవారు. ప్రతిరోజూ ఉదయం సజ్జల నుంచి బ్రాండ్ల చార్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్‌కు వెళ్లేది. ఆయన దాన్ని మద్యం డిపో మేనేజర్లు, షాపుల్లో సేల్స్‌మెన్‌కు పంపేవారు. దాని ప్రకారం మద్యం విక్రయించేవారు. మద్యం కంపెనీలకు బకాయిల విడుదల వ్యవహారాలను కార్పొరేషన్‌లో పదవీ విరమణ చేసిన వేణుగోపాల్ చూసేవారు. ప్రతి బిల్లులో 20శాతం కమీషన్ తీసుకుని బకాయిలు విడుదల చేసేవారు. మరో రిటైర్డ్ అధికారి శ్రీనివాసరెడ్డి 3నెలలుగా స్టాకు అమ్ముడు పోలేదనే కారణాన్ని చూపి ఎడాపెడా కంపెనీల నుంచి గ్రౌండింగ్ చార్జీలు వసూలు చేశారు.

బెట్టింగులే బలిగొన్నాయా?!

- అనుమానాస్పద స్థితిలో వైసీపీ నాయకుడి మృతి
- ఎన్నికల ఫలితాల రోజు నుంచి అజ్ఞాతంలోనే..

నూజివీడు టౌన్, జూన్ 9: ఏలూరు జిల్లా నూజివీడు మండలం తూర్పుదిగవల్లి వైసీపీ నాయకుడు జగ్గవరపు వేణుగోపాలరెడ్డి ఆదివారం అనుమానాస్పద స్థితిలో తన మామిడి తోటలోని షెడ్డు వద్ద మృతి చెందారు. తూర్పు దిగవల్లి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి భర్త అయిన వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీల గెలుపు, ఓటములపై పలు బెట్టింగ్‌లకు మధ్యవర్తిగా వ్యవహరించినట్టు సమాచారం. దాంతో పాటు తాను సైతం భారీగా బెట్టింగులు కాసి డబ్బు కోల్పోయినట్టు చెప్పుకొంటున్నారు. దాదాపు 30 కోట్ల రూపాయల వరకు ఎన్నికల బెట్టింగుల్లో మధ్యవర్తిగా లేదా ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల రోజు నుంచి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు కనిపించలేదు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం పలువురు పందెం రాయుళ్లు వేణుగోపాల్‌రెడ్డి ఇంటిపై దాడి చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున అతడు తన మామిడి తోటలోని షెడ్డు వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి నూజివీడు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండడంతో గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.



వేణుగోపాల్‌రెడ్డి



జిమ్‌కు తిరిగి ఎన్‌టీఆర్ పేరు ఏర్పాటు చేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్, సాయి తదితరులు

మళ్లీ 'ఎన్టీఆర్ జిమ్'గా..

- గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో వైసీపీ శిలాఫలకాల ధ్వంసం
- వందలాదిగా పాల్గొన్న వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు
- 'ఎన్టీఆర్'ని టచ్ చేస్తే తీవ్ర పరిణామాలు: బ్రాహ్మణ చైతన్య వేదిక

గుంటూరు, జూన్ 9: గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ జిమ్ పేర్లను మార్చేందుకు గత వైసీపీ పాలకులు చేసిన కుట్రలను బ్రాహ్మణ చైతన్య వేదిక భగ్నం చేసింది. ఆ మేరకు స్టేడియంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం ధ్వంసం చేశారు. స్టేడియంలోని జిమ్ నూతన భవనంపై 'ఎన్టీఆర్ జిమ్' అంటూ భారీ అక్షరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ మాట్లాడుతూ ఎవరైనా అన్న ఎన్టీఆర్ పేరును టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ స్టేడియంను వైఎస్సార్ స్టేడియంగా పేరు మార్చేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులతో అధికారులు కుట్రపన్నారన్నారు. అందుకోసమే స్టేడియంలో నూతన భవన నిర్మాణం చేపట్టి వైఎస్సార్ జిమ్‌గా పేరు పెట్టేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారని మండిపడ్డారు. దీనిపై తాము హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశామని, అయినా.. మున్సిపల్ అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై నిర్మాణ పనులు ఆపకుండా అక్రమంగా కొనసాగించారని విమర్శించారు. హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉన్నా, ఎన్నికల కోడ్ ఉన్నా అప్పటి మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు వైఎస్సార్ పేరుతో శిలాఫలకాలు ప్రారంభించేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్నారు. దీనిపైనా తాను హైకోర్టులో మరో పిల్ వేయగా వైసీపీ ప్రజా ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. భవన నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు రూ.49 లక్షలు కేటాయించినట్లుగా చూపి ప్రజాధనాన్ని నొక్కేశారని, నూతన ప్రభుత్వం తక్షణమే ఆడిట్ జరిపించి ఆ డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు.

బలమైన ప్రతిపక్షంతోనే ఆరోగ్యకర ప్రజాస్వామ్యం!

- వచ్చే ఐదేళ్లు కేంద్రంలో మంచి పాలన: రజనీకాంత్
- చంద్రబాబు ఆహ్వానిస్తే ప్రమాణస్వీకారానికి వెళతానని వెల్లడి



చెన్నై, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బలమైన ప్రతిపక్షాన్ని ప్రజలు ఎన్నుకొన్నారని, ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతమని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఢిల్లీకి బయలుదేరిన ఆయన చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఐదేళ్లు కేంద్రంలో ఎలాంటి పాలన ఉంటుందని భావిస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా, మంచి పాలన ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికైన ఘనతను మోదీ సాధించారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమానికి తనను ఆహ్వానిస్తే తప్పకుండా హాజరవుతానని రజనీకాంత్ తెలిపారు.

పెళ్లి తరువాత చాలామంది మహిళలు ఇళ్లకే పరిమితమై పోతారు. **జ్యోతి శ్రీవాస్తవ** పరిస్థితీ అదే. ఇంజనీరింగ్ చదివి... రాకెట్లు డిజైన్ చేసిన ఆమె కెరీర్... వివాహం అయ్యాక అమాంతం ఆగిపోయింది. కానీ బిడ్డ పుట్టాక... ఆమె ఆలోచనే మారిపోయింది. ఒక తల్లిగా గడించిన అనుభవాన్ని... ఫుడ్ బ్రాండ్‌గా మార్చి... పారిశ్రామికవేత్తగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నేడు ఎందరో తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఆ తల్లులకు వందనం

"అశోక విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం... 73 శాతం మంది భారతీయ మహిళలు మొదటి బిడ్డ పుట్టాక ఉద్యోగం వదిలేస్తున్నారట. ఆ నివేదిక చదివాక ఆశ్చర్యం అనిపించింది. ఇల్లు, పిల్లలు, బాధ్యతలంటూ ఆడవారు తమ కెరీర్ గురించి ఆలోచించడంలేదు. వెనక్కి తిరిగి చూసుకొంటే... నా పరిస్థితీ అదే. మా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాను. వెంటనే ఉద్యోగం వచ్చింది. వృత్తిలో భాగంగా భారత సైన్యం కోసం రాకెట్లు డిజైనింగ్ చేశాను. అది నాకు ఎంతో ఇష్టమైన కొలువు. దాని కోసం నానోటెక్నాలజీ, రాకెట్ ప్రొపెల్లెంట్స్‌లో స్పెషలైజేషన్ చేశాను. అయితే అక్కడ విపరీతమైన పని. క్షణం తీరిక దొరికేది కాదు. జీతం మాత్రం చాలా తక్కువ. పనికి... జీతానికి పొంతన లేదు. దాంతో రెండున్నరేళ్ల తరువాత, అంటే 2018లో ఉద్యోగం వదిలేశాను. అనంతరం ఫ్రీలాన్సర్‌గా కొన్ని వాయుసేన ప్రాజెక్ట్‌కు పని చేశాను. ఎందుకో అది కూడా నాకు సంతృప్తినివ్వలేదు. అదే సమయంలో నాకు పెళ్లయింది. కొన్నాళ్లు ప్రాజెక్ట్ కొనసాగించాను.

అనుభవం నుంచి...

ఏడాది తరువాత నేను గర్భవతిని అయ్యాను. అప్పుడు మొదలయ్యాయి నా కష్టాలు. పుట్టబోయే బిడ్డ కోసమే కాదు... నా గురించి కూడా నేను శ్రద్ధ తీసుకోవాలి కదా. అందుకే ప్రాజెక్ట్ అన్నీ పక్కన పెట్టేశాను. బాబు పుట్టాడు. తల్లి పాలు పట్టే విషయంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత వాడికి అందించే ఆహారం విషయంలోనూ అయోమయం. ఒక తల్లిగా పిల్లాడికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనేది నా తపన. చిరుధాన్యాల్లో అయితే పోషకాలు పుష్కలంగా ఉంటాయని, కొన్ని రోగాలను నయం చేసే శక్తి కూడా వాటిల్లో ఉందని అర్థమైంది. తల్లి పాలలోని గుణాలు ఇందులోనూ ఉన్నాయి. మిల్లెట్స్ పిల్లల ఎదుగుదలను గణనీయంగా పెంచుతాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. వీటన్నటి నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందనిపించింది.

ప్రత్యేక కోర్సులు చదివి...

బిడ్డ పోషణకు సంబంధించి పూర్తి అవగాహన కావాలి. అందు కోసం యునిసెఫ్ 'ఐవైసీఎఫ్' (ఇన్‌ఫ్యాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్) కోర్సు చదివాను. దాంతోపాటే 'చైల్డ్ అండ్ మెటర్నల్ న్యూట్రిషన్' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. ఆ తరువాత నాలాంటి తల్లులకు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం గురించి అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో 'లిటిల్ చెర్రీ మామ్' పేరుతో పేజీ ఒకటి తెరిచాను. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన నాకు ఫుడ్ ప్రాసెసింగ్ మీద అవగాహన ఉంది. భారీ ప్రాజెక్టులకు పని చేసిన అనుభవం ఉంది. అందుకే ఎవరో తెలిసీ తెలియక అన్న మాటలు నేను పట్టించుకోలేదు. నేను అందించే సమాచారం కొందరు చంటి బిడ్డల తల్లులకైనా చేరితే చాలనుకున్నాను.

> ఆరంభంలో కొందరు నన్ను ఎగతాళి చేశారు. హేళనగా మాట్లాడారు. 'ఈమెకేం తెలుసు' అన్నట్టు కొందరు బంధువుల, స్నేహితులు నా మీద జోక్‌లు వేశారు. 'నాడు మంచి ఉద్యోగం వదిలి తప్పు చేశావు' అన్నారు. అవేవీ పట్టించుకోలేదు.



మా అబ్బాయి పేరుతో...

పసి పిల్లల ఎదుగుదలకు సంబంధించి ఆయుర్వేదంలో పేర్కొన్న వివిధ రకాల మూలికల గురించి కూడా చదివాను. వాటి ఔషధ గుణాలకు సంబంధించిన సమాచారం సేకరించి పెట్టుకున్నా. వీటన్నిటినీ క్రోడీకరించి, మిల్లెట్స్‌తో రోజుకు మూడు రకాల వంటలు ప్రయత్నించాను. పోషక విలువలే కాదు, రుచి కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. ఎందుకంటే రుచికరంగా లేకపోతే పిల్లలు ముట్టుకోరు. అలా కొన్ని రెసిపీలు సిద్ధమయ్యాక మా అబ్బాయి పేరుతో చిరుధాన్యాల ఆధారిత 'లిటిల్ చెర్రీ ఫుడ్స్' కంపెనీ ప్రారంభించాను. చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలు ఉన్న, తాజా ఆహారం అందించాలనే లక్ష్యంతో దీన్ని నెలకొల్పాను.

సవాళ్లు ఎదురైనా...

ఒకానొక దశలో ఇక నా వృత్తిగత జీవితం ముగిసిపోయిందని అనుకున్నా. ఆ సమయంలోనే ఇన్‌స్టాలో నేను పెట్టిన పోస్ట్‌లకు క్రమంగా వీక్షకులు పెరిగారు. కొద్ది రోజుల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటింది. అది నాకు నూతనోత్తేజాన్ని ఇచ్చింది. ఆ ఉత్సాహంతోనే కంపెనీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే దానికి డబ్బు ఎక్కడి నుంచి తేవాలి? అది పెద్ద సమస్యగా మారింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మావారు నాకు అండగా నిలిచారు. కొంతవరకు ఆర్థిక వనరులు సమకూర్చారు. మిగిలిన పెట్టుబడి కోసం నేను ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. కానీ ఇంకా లోటు. దాంతో బ్యాంకు లోను తీసుకొని వ్యాపారం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని నవజాత శిశువుల తల్లులకు చేరువయ్యే ప్రయత్నం చేశాను. తొలి విడత ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదల చేసే నాటికి మావద్ద యాభై వేల పైచిలుకు తల్లులతో కూడిన అతిపెద్ద సమూహం ఒకటి ఏర్పడింది. ఆ తరువాత నా పని సులువైంది. కష్టానికి ఫలితం దక్కింది. ఏడాది తిరక్కుండానే మా బేబీ ఫుడ్స్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు మా టర్నోవర్ కోటి రూపాయలు దాటింది. నేటికీ మిల్లెట్ ఫుడ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. సంపాదన, సంతృప్తి... రెండూ దక్కుతున్నాయి. ఇదంతా అంతమంది తల్లులు నాపై ఉంచిన నమ్మకం. ఆ తల్లులందరికీ నా వందనం."

మార్పు యోధులు...

వారియర్స్ వితవుట్ ఎ కాజ్...

పేదలకు, అణగారిన వర్గాలకు ఏదైనా మేలు చేద్దామనే తపనతో నలుగురు కాలేజీ అమ్మాయిలు ఏర్పాటు చేసిన ఈ ఎన్జీవో.. ఇప్పుడు మూడువందల మందికి పైగా వాలంటీర్లతో... దేశంలోని వివిధ నగరాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్పందించే మనసుంటే... సాయం చెయ్యడానికి వయసుతో, ఆర్థిక స్థాయితో సంబంధం లేదని నిరూపిస్తోంది ఈ యువ బృందం.



2020... జన జీవనంలో కొవిడ్ మహమ్మారి రేపిన అల్లకల్లోలాన్ని చూసి చలించిపోయారు అనూష అత్రి, భవానీ సింగ్, ఖుషీ సింగ్, వంశికా మెహతా. ఆ నలుగురు అప్పుడే టీనేజీ దాటిన స్నేహితులు. ఢిల్లీలో చదువుకుంటున్నారు. కనీస అవసరాలు తీరక అల్లాడిపోతున్న ప్రజానీకానికి తమ వంతుగా ఏదైనా చెయ్యాలనుకున్నారు. తమ పాకెట్ మనీని పోగేసి... మాస్కులు, శానిటైజర్లు కొని... మురికివాడల ప్రజలకు పంచిపెట్టారు. ఆ తరువాత నిత్యావసరాలను కూడా అందించారు. ఈ క్రమంలో... ఆ ప్రజల అత్యవసరాలను ప్రత్యక్షంగా గమనించి, అర్థం చేసుకున్నారు. సామాజిక సంక్షేమం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, రిజిస్టర్ చేశారు. అదే 'వారియర్స్ వితవుట్ ఎ కాజ్'. "ఒక మార్పు తేవడానికి మనం దోహద పడడం వెనుక ఎలాంటి కారణం ఉండవలసిన అవసరం లేదనేది మా ఉద్దేశం. తోటివారి కష్టాలకు స్పందించి, వారికి సాయం చేసే సున్నితత్వం సమాజంలో పెరగాలి. ఆ దిశగా చైతన్యాన్ని వ్యాప్తి చెయ్యాలని, దీర్ఘకాలంలో... పేద వర్గాలను వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేలా చెయ్యాలని అనుకున్నాం. మురికివాడల్లో మా ప్రయత్నాన్ని ప్రారంభించాం" అని వివరించారు ఆ ఫ్రెండ్స్. కేవలం ఏదో ఒక అంశానికే పరిమితం కాకుండా... వైద్య శిబిరాల ఏర్పాటు, ఎడ్యుకేషన్ వర్క్‌షాపుల నిర్వహణ, శానిటరీ ప్యాడ్స్, ఆహారం, దుస్తులు, స్టేషనరీ, పుస్తకాల్లాంటివాటి పంపిణీతో సహా... విస్తృతమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో...

"అవసరాలు తీర్చడం, ఆసరాగా నిలబడడం, విద్యకు, ఉపాధికి సహకారం అందించడం... ఇవీ మా ప్రాధాన్యాలు. అదే సమయంలో మౌలిక సదుపాయాలను, ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను అందుబాటులోకి తేవడం కూడా దీనిలో భాగం. మొత్తంగా వారి జీవన నాణ్యతను పెంచడానికి దోహదం చేస్తున్నాం" అని వారు చెబుతున్నారు. మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పడం, ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు ఢిల్లీలోని సిఆర్ఆర్ఐ మురికివాడలో కుట్లు, అల్లికలు లాంటి విషయాల్లో దాదాపు ముప్ఫై మంది మహిళలకు ఈ ఎన్జీవో శిక్షణనిచ్చి.. ఉత్పత్తులు తయారు చేయిస్తోంది. వాటిని మార్కెట్లలో, ఎగ్జిబిషన్లలో విక్రయించి... ఆ మహిళలకు శాశ్వతమైన ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంది. వీధి వర్తకులకు, చిన్న బండ్ల మీద సరుకులు అమ్ముకొనేవారికి ఎండ తీవ్రత నుంచి ఊరట కలిగించడానికి... కిందటి ఏడాది ఈ ఫ్రెండ్స్ ప్రారంభించిన 'బీట్ ది హీట్' కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. దాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా... పెద్ద గొడుగులు, టోపీలు, శీతల పానీయాలు, నీరు పంపిణీ చేస్తున్నారు. "వివిధ ప్రాంతాల్లో యాభైవేల మందికి వాటిని అందజేశాం. ఈ ఏడాది ఇప్పటికే అయిదు వేలమందికి పైగా ప్రయోజనం పొందారు. మరెంతో మందికి మా సేవలు అందించాల్సి ఉంది. దీనిలో ప్రజలను కూడా భాగస్వాముల్ని చేస్తున్నాం" అని చెబుతున్న 'వారియర్స్' ద్వారా గత మూడేళ్ళలో వివిధ సాయాలు అందుకున్నవారి సంఖ్య నాలుగు లక్షలకి పైనే.

ఈ పుట్టిన రోజు ఎంతో ప్రత్యేకం



వెండి తెరపై 'సమరసింహ'మైన బాలకృష్ణ విశ్వరూపం చూసి అభిమానులు ఏనాడో తరించి పోయారు. ఆ హోరులో బాక్సాఫీస్ వసూళ్ల పండగ చేసుకుంది. ఆ తాకిడికి రికార్డులు దాసోహం అయ్యాయి.. బాలయ్య చేతిలోని ఆయుధమే కాదు కంటి చూపు, మాట కూడా పదునే... అందుకే ఈ నట 'సింహ'నికి జనం నీరాజనాలు పట్టారు. రాజకీయాల్లోకి అడుగు పెడితే అక్కడ కూడా ఆయన్ని ఘనంగా ఆదరించారు. మూడో సారి కూడా ఆయన్ని శాసన సభ్యుడిగా గెలిపించి హ్యాట్రిక్ వీరునిగా నిలబెట్టారు. ఒక సినీ హీరో ఇలా వరుసగా మూడు సార్లు అసెంబ్లీకి ఎన్నిక కావడం చరిత్రలో ఇదే ప్రథమం. అంతకు ముందు ఎన్టీఆర్‌కు ఇటువంటి రికార్డ్ ఉన్నా ఆయన సినిమాల నుంచి రాజకీయ రంగంలోకి వెళ్లిన తర్వాత ఆ ఘనత సాధించారు. కానీ సినీ రంగంలో ఉంటూనే రాజకీయ రంగంలో కూడా రికార్డులు క్రియేట్ చేసిన ఏకైక హీరో బాలయ్యే. శాసన సభ్యుడిగా హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో వస్తున్న పుట్టిన రోజు (జూన్ 10) కావడంతో ఈ రోజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది.

తండ్రి ఎన్టీఆర్ దర్శకత్వంలో 'తాతమ్మ కల' (1974) చిత్రంతో ప్రారంభమైన బాలకృష్ణ చలన చిత్ర యాత్ర ఇంకా నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ఆయనతో నటన ప్రారంభించిన హీరోలు, తర్వాత వచ్చిన వారూ మధ్య మధ్యలో గ్యాప్ తీసుకున్నా బాలయ్య మాత్రం ఆగిపోలేదు, అలసిపోలేదు. ఈ ఐదు దశాబ్దాల నట జీవితంలో భారీ విజయాలే కాదు..కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి.. అపజయానికి కుంగిపోలేదు. విజయానికి దగ్గర దారులు వెదుకుతూ రాజీ పడలేదు.



భారతీయ నట వారసుల్లో నందమూరి బాలకృష్ణ ప్రత్యేకత వేరు.. తన సమకాలిక హీరోలు సాంఘిక చిత్రాలకే పరిమితం కాగా పౌరాణిక, జానపద, చారిత్రక, సైన్స్ ఫిక్షన్ చిత్రాల్లో సైతం బాలకృష్ణ నటించి తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారు.

తెలుగు భాష పట్ల బాలకృష్ణకు ఎంతో గౌరవం. స్వచ్ఛమైన ఉచ్చారణతో, తెలుగుతనం ఉట్టిపడే పదాలతో ఆయన డైలాగులు చెప్పే తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. అలాగే ఈ నందమూరి అందగాడు ముఖ కవళికల్లో, అనర్గళంగా సాగే మాటల్లో పౌరుషం శివమెత్తి నాట్యం చేస్తుంటుంది. అందుకే బాలయ్య డైలాగులు అంటే ఫ్యాన్స్ లో అంత క్రేజ్.. ఇక ఆయన కత్తి పట్టి రంగంలోకి దిగితే యాక్షన్ పంట పండినట్లే. తనకు ఉన్న ఇమేజ్‌కి భిన్నంగా నిజ జీవితంలో బాలకృష్ణ వ్యవహరిస్తుంటారు. నలుగురిలో మామూలుగా కనిపిస్తే హీరోగా తన ఇమేజ్ దెబ్బ తింటుందేమో అనే అభద్రత భావం బాలయ్యలో బొత్తిగా కనిపించదు. తన కారుని తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళడం ఆయనకి ఒక సరదా. అలాగే అందరితో జోవియల్‌గా మాట్లాడుతుంటారు.

క్రమశిక్షణ.. ముక్కుసూటి మనస్తత్వం

బాలకృష్ణ తండ్రిలాగే క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు. అలాగే ఆయన నిర్మోహమాటి. ముక్కుసూటి మనస్తత్వం కలవారు. నాన్చుడు వ్యవహారం ఆయనకి నచ్చదు. ఏ విషయమైనా వెంటనే తేల్చేయాల్సిందే. నటన అనేది ఒక ఉద్యోగంగా భావించకుండా ఓ కళగా ఆరాధించే వ్యక్తి కావడం వల్లే ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పనిచేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.

రామోజీ సేవలు అజరామరం



అక్షర యోధుడు రామోజీరావు స్మృతికి నివాళిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆదివారం సంస్మరణ సభ నిర్వహించింది. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని రామోజీరావు సేవలు అజరామరమని కొనియాడారు. నిర్మాత కేఎస్ రామారావు, చదలవాడ శ్రీనివాసరావు, స్రవంతి రవికిషోర్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, విజయేంద్రప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ప్రసన్నకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


Happy Birthday
నందమూరి
బాలకృష్ణ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
GREEN METRO MOVIES ప్రొడ్యూసర్
బొడ్డు రవిశంకర్‌రావు అధ్యక్షులు
కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ


నందమూరి వంశాంకురం..
తారకరాముని అంశాంకురం..
నటసింహం.. రాజకీయ రణసింహం..
అన్స్టాపబుల్ అన్న మాటకి అసలైన నిదర్శనం..
ఎవర్ గ్రీన్ అన్న పదానికి నిండైన ప్రతిరూపం..
నిక్కచ్చికీ నిజాయితీకి నిలువెత్తు నిజరూపం..
కథానాయకుడి నుంచి మహానాయకుడై
ఎదిగిన విశ్వరూపం..
తెలుగు అక్షరానికున్నంత అందం..
తెలుగు భాషకున్నంత దర్పం..
కలబోసి వెలుగుతున్న తెలుగుతేజం..
సినిమారంగంలో ఉండి
తొలి హాట్రిక్ శాసనసభ్యులు...
నందమూరి బాలకృష్ణ గారికి
జన్మదిన శుభాకాంక్షలు..
- WITH BEST WISHES -
KOMMINENI VENKATESWARA RAO
KANAKDURGA ARTS
B. SUDHAKAR NAIDU
KURNOOL
D. RAKESH CHOUDARY
TIRUPATI


ఈ చిత్రం ముగింపు ఎవ్వరికీ చెప్పవద్దు !
NVR CINEMA
PASSION STUDIOS
THE ROUTE
think
నా పేరు "మహారాజ"
నేను సెలూన్ షాపు నడుపుతున్నాను
నా "లక్ష్మి" పోయిందని పోలీస్ కేసు పెట్టాను
ఎవరా "లక్ష్మి" తెలుసుకోవాలంటే
తప్పక చూడండి !
విజయ్ సేతుపతి ప్రతిష్టాత్మక 50వ చిత్రం
మహారాజ
IN THEATRES
JUNE 14TH
NITHILAN SAMINATHAN
IN TELUGU & TAMIL
NETFLIX
ANDHRA PRADESH & TELANGANA RELEASE BY : NVR CINEMA - 79895 67742, 99669 63111


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS PRESENTS
FORTUNE FOUR CINEMAS
TEAM
NBK 109
ముచ్చటగా మూడోసారి అత్యంత భారీ మెజారిటీతో
అఖండ విజయం సాధించిన
మా నందమూరి బాలకృష్ణ గారికిశుభాకాంక్షలు
SMOKING IS INJURIOUS TO HEALTH